# నీకొక అమ్మ ఉందని మరువకు!

## సాధకుల సందేహాలకు శ్రీశారదామాత సమాధానాలు


**రచన, సంకలనం**

ఆచార్య పన్నాల శ్యామసుందర మూర్తి


**సలహా మండలి**

అమిరపు నటరాజన్

డాక్టర్ నెమ్మాని రామగోపాల్

అమిరపు నరేష్

ఆచార్య (శ్రీమతి) చందలూరి చిరంజీవి


**ప్రకాశకులు**

**శ్రీరామకృష్ణ సేవా సమితి**

**బాపట్ల - 522101**

Neekoka Amma Undani Maruvaku! (Telugu)
Code: /020

నీకొక అమ్మ ఉందని మరువకు! (తెలుగు)
– సాధకుల సందేహాలకు శ్రీశారదామాత సమాధానాలు

ప్రకాశకులు
శ్రీ రామకృష్ణ సేవాసమితి
బాపట్ల – 522101

© సర్వహక్కులూ ప్రకాశకులవి

ప్రథమ ముద్రణ: మే, 2018 (3000 ప్రతులు)

For Copies :
Sri Ramakrishna Seva Samithi,
Vijayalakshmi puram, Bapatla - 522101 AP
e-mail : rksamithibapatla@gmail.com
visit us at : www.unworldliness.org

## ప్రకాశకుల మనవి

సాధకులు సంధించిన అనేక ప్రశ్నలకు శ్రీశారదామాత ఇచ్చిన సమాధానాలు సరళగంభీరాలు, భావగర్భితాలు. వాటిని చదవడం ద్వారా చతుర్విధ పురుషార్థాలను అందుకో గలిగే విధానం మనకు కరతలామలకం అవుతుంది.

మా సమితి అధ్యక్షులైన ఆచార్య పన్నాల శ్యామసుందర మూర్తి గారు ప్రశ్నోత్తరాల మాలికగా ఈ చిన్న పుస్తకాన్ని కూర్చారు. పాఠకులకు సులభగ్రాహ్యంగా ఉండడానికి కొన్ని ప్రశ్నలను కల్పించి వ్రాశారు. దీనిలోని సమాధానాలకు మూలగ్రంథాలుగా హైదరాబాదు రామకృష్ణ మఠ ప్రచురణలైన శ్రీశారదావచనామృతం (శా.వ), శ్రీశారదా చరితామృతం (శా.చ), దివ్యజనని శ్రీశారదాదేవి (ది.జ), మాతృసన్నిధి అనే గ్రంథాలను ఉపయోగించారు.

మూలగ్రంథాన్ని అనుసరించేందుకు అనుమతించడమే కాక ఈ పుస్తకానికి 'ముందుమాట'ను వ్రాసిన హైదరాబాదు రామకృష్ణ మఠ అధ్యక్షులైన పూజ్య స్వామి జ్ఞానదానందజీ మహరాజ్ వారికి మా ప్రణామములు.

ఈ పుస్తకానికి ఆశీస్సులు పంపిన పూజ్య స్వామి అక్షరాత్మానందజీ మహరాజ్ వారికి మా ప్రణామములు.

2018 జూన్ 9, 10 తేదీలలో మాచర్లలో జరుగబోతున్న మధ్యాంధ్రప్రదేశ్ ప్రథమ భక్తసమ్మేళనంలో ఈ పుస్తకాన్ని విడుదల చేయడం మాకెంతో సంతోషం.

అందుకు భక్త, సాధక జనావళికి తన ఆధ్యాత్మిక పురోగతిలో ఈ చిరుపుస్తకం ఎంతైనా ఉపయోగపడగలదని విశ్వసిస్తున్నాము.

25 మే, 2018 ప్రకాశకులు

# విషయసూచిక

ముందుమాట ........................................ 5
ఆశీస్సులు ........................................ 7
పరిచయం ........................................ 9
01. కోరికలు ........................................ 11
02. లౌకికజీవనం ........................................ 15
03. ఆచారాలు ........................................ 25
04. కుటుంబం ........................................ 30
05. కష్టాలు, కడగండ్లు ........................................ 40
06. కర్మ – పునర్జన్మ ........................................ 44
07. సమాజం – సమాజసేవ ........................................ 48
08. తీర్థయాత్రలు ........................................ 51
09. భక్తి – పూజ ........................................ 53
10. మనస్సు ........................................ 58
11. ఏకాగ్రత, ధ్యానం ........................................ 65
12. స్వప్రయత్నం ........................................ 68
13. సాధన ........................................ 71
14. మంత్రదీక్ష ........................................ 80
15. నామజపం, నామస్మరణ ........................................ 84
16. గురువు ........................................ 89
17. పతనం ........................................ 92
18. పాపాలు – పరిహారం ........................................ 94
19. వైరాగ్యం ........................................ 96
20. భగవంతుని స్వభావం ........................................ 105
21. భగవంతుని దర్శనం ........................................ 108
22. గురుదేవులు ........................................ 112
23. అమ్మ – స్వస్వరూపం ........................................ 119

రామకృష్ణమఠం,
రామకృష్ణమఠ్ మార్గ్, దోమలగూడ,
హైదరాబాదు – 500 029

## ముందుమాట

దివ్యజనని శ్రీ శారదాదేవి వివిధ సందర్భాలలో భక్తులు అడిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు చక్కటి సమాధానాలిచ్చి, వాళ్ళకు సాధనకు సంబంధించిన చాలా సందేహాలను నివృత్తి చేశారు. అలా జనని చేసిన అనేకానేక బోధనలను శ్రీశారదాదేవి వచనామృతం  పేరుతో రామకృష్ణమఠం, హైదరాబాదు వారు ప్రచురించడం జరిగింది. వచనామృతం మరీ పెద్ద గ్రంథం ఏమీ కాదు. ఆ పుస్తకాన్ని చదువుకొని, ఆధ్యాత్మిక పథగాములందరూ అన్ని సందేహాలనూ నివృత్తి చేసుకొనవచ్చును. కానీ నిమిషం తీరుబడిలేని నేటితరం, పుస్తకం కాస్త పెద్దదిగా ఉంటే చాలు దానివైపు కనీసం చూడనైనా చూడరు. పెద్దపుస్తకాలు కాదు కదా చిన్న చిన్న పుస్తకాలు చదవడమూ తగ్గించారు. కాబట్టి జనని శ్రీశారదాదేవి సందేశాలలో అమూల్యరత్నాలనదగ్గ వాటిని

కొన్నిటిని ఎంచి పుస్తకాన్ని కూర్చితే భక్తులకు సులభతరంగా ఉంటుందని భావించి శ్రీమూర్తిగారు ఈ సంకలనానికి శ్రీకారం చుట్టారు.

శ్రీ శారదాదేవి వచనామృతానికి ఒక చక్కటి పరిచయ పుస్తకంగా కూడా ఈ పుస్తకం ఉపకరిస్తుందని మేము భావిస్తున్నాము. సాధకులు త్వరితగతిలో పుస్తకాన్ని చదివి దివ్యజనని శారదాదేవి సందేశామృతాన్ని గ్రోలటానికి అవకాశం కల్పిస్తున్నది ఈ పుస్తకం.

మధ్యలో ఇంకొక ప్రశ్నను వేసి, కొన్ని పెద్ద ప్రశ్న-సమాధానాలను చిన్నవిగా చేసి మోక్షగాములు సులభంగా ఉపదేశాలను అర్థం చేసుకునేలా చేశారు శ్రీ శ్యామసుందర మూర్తిగారు. వీరి కృషి ప్రశంసనీయం. ఈ పుస్తకం సాధకులకు కరదీపికగా భాసిల్లుతుంది.

ఈ చిన్న పుస్తకం ఆస్తికమహాశయుల ఆదరణను చూరగొంటుందని భావిస్తూ మూర్తి గారి ప్రయత్నాన్ని మనసారా అభినందిస్తున్నాం.

22 మే, 2018

స్వామి జ్ఞానదానంద
అధ్యక్షులు

స్వామి అక్షరాత్మానంద,
ఉపాధ్యక్షులు, రామకృష్ణ మిషన్,
కొలంబో, శ్రీలంక

## ఆశీస్సులు

ప్రపంచంలో పుస్తకాలే కాక చదువరులు కూడా కోకొల్లలే! అయితే, పుస్తకంలో వ్రాసిన భావాలను పాఠకుడు మరింత బాగా అర్థం చేసుకొనేలా చేయడమెలాగా అన్నదే ప్రతి రచయిత ముందుండే సమస్య.

ఒక విద్యార్థి విషయంలో అయితే ఒక 'క్వశ్చన్ బ్యాంక్' కొన్నిసార్లు ఉపయోగపడవచ్చు. దీని ద్వారా కలిగిన ప్రేరణతో విద్యార్థి తన పుస్తకాలను మరింత లోతుగా చదవడానికి ప్రయత్నిస్తాడు. అయితే దీనివల్ల విద్యార్థి చాలా సమయం వెచ్చించాల్సి వస్తుంది. దానికి బదులు ఒక ఉపాధ్యాయుడు ఒక ప్రశ్నలనిధిని తయారు చేసి ఇచ్చి దానికి సమాధానాలను వెతుక్కోమని చెప్పవచ్చు. అయితే దానికి కూడా చాలా సమయమే అవసరమవుతుంది. పైగా, విద్యారంగంలో ఈ పద్ధతులు పనిచేయవచ్చునేమో గానీ, సామాన్యప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఆధ్యాత్మిక సాధనలో మరింత సులభమైన పద్ధతిని చూపక తప్పదు.

వాటికంటే సులభమైన పద్ధతి ప్రశ్నలనూ, సమాధానాలనూ ఒకేచోట కూర్చి పుస్తకాన్ని తయారుచేయడం. క్రైస్తవ సంప్ర దాయంలో విరివిగా వాడబడే ఈ పద్ధతినే 'catechism' అంటారు. హిందూ సంప్రదాయంలో కూడా ఈ పద్ధతి

కనిపిస్తుంది. ఆదిశంకరాచార్యులు రచించిన 'ప్రశ్నోత్తర మాలిక' దీనికి ఒక మంచి ఉదాహరణ.

'నీకొక అమ్మ ఉందని మరువకు!' అన్న ఈ పుస్తకం రామకృష్ణ సాంప్రదాయ భక్తుల కోసం రచించబడింది. అనేక అంశాల మీద, ముఖ్యంగా ఆధ్యాత్మిక సాధనలు, వాటికి తోడు దైనందిన జీవితాన్ని గురించిన విషయాలను గురించి దివ్యజనని శ్రీశారదాదేవి చేసిన బోధనలు ఈ పుస్తకంలో పొందుపరచబడ్డాయి.

భక్తుల ప్రశ్నలకు మాతృదేవి అనేక సందర్భాలలో సమాధానాలు ఇచ్చారు. అవి 'శ్రీశారదావచనామృతం' అనే గ్రంథంలో ఎక్కువగా కనిపిస్తాయి. డా॥ పన్నాల శ్యామసుందర మూర్తిగారు భక్తులు తరచుగా అడిగే ప్రశ్నలకు దానిలో నుండి సమాధానాలను వ్రాయడం ద్వారా చేసిన ఈ కృషి భక్తులకు ఎంతైనా ఉపయోగపడుతుంది. కొన్ని సమాధానాలు శ్రీరామకృష్ణ భక్తులకే గాక అందరు భక్తులకూ ఉపయోగపడతాయి. ఈ చిన్న గ్రంథం ఆధ్యాత్మిక సాధకులకు అమూల్యమైన మార్గదర్శినిగా ఉపయోగపడుతుందనీ, శ్రీరామకృష్ణ శారదా వివేకానంద సాహిత్యమాలలో మరొక మణిపూస కాగలదనీ ఆశిస్తున్నాను.

Swami Aksharatmananda

తేదీ: 16 మే, 2018 స్వామి అక్షరాత్మానంద

# పరిచయం

సామాన్య స్త్రీలాగా కనిపించే అసాధారణ మహిళ శ్రీశారదా మాత. ఆమె ఎక్కడా ప్రసంగాలు చేయలేదు. తన మహోన్న తత్వాన్ని మరుగున పరచుకొని తన జీవితం ద్వారా అనుష్ఠాన వేదాంతాన్ని బోధించిన అద్భుత మాత శ్రీశారదాదేవి.

శ్రీశారదామాత వద్దకు రకరకాల వ్యక్తులు, మహిళలు, స్వామీజీలు, సాధారణ జనులు, ఇతరులు వచ్చి నిత్యజీవితంలో సాధనలలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె ముందు ఏకరువు పెట్టేవారు. వాటన్నింటికీ తన అపార అనుభవంతో అత్యంత సరళంగా, సూటిగా సమాధానాలనిచ్చి వారి సమస్యలకు పరిష్కారం తెలిపేవారు శ్రీ శారదాదేవి. ఆ సమాధానాల ద్వారా నిత్యజీవిత సమస్యల మధ్య ఆధ్యాత్మిక సాధన ఎలా చేయాలో అత్యంత సులభశైలిలో తన ఇంగితజ్ఞానాన్ని జోడించి తెలిపేవారు. కొన్ని ప్రశ్నలు ఒకే రకంగా ఉన్నట్లు కనిపించినా, వేర్వేరు సందర్భాలలో భక్తుల మనోస్థితిని బట్టి శ్రీమాత విభిన్నమైన సమాధానాలను ఇచ్చారు.

సాధకుల సమస్యలకు వారివారి ఆధ్యాత్మిక స్థాయిని బట్టి, సామాజిక దృక్పథాన్ని బట్టి వివరించిన పరిష్కారాలు ప్రశ్న వేసేవారిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేసి వారి పురోభి వృద్ధికి తోడ్పడేవి. ఆనాడు శ్రీశారదాదేవి ద్వారా ఆవిష్కరించ బడిన ఆధ్యాత్మిక సత్యాలు, ఆనాడే కాదు, ఎల్లప్పుడూ ఆచరణీయం అనడంలో ఏ సందేహమూ లేదు. ఎందుకంటే ఆ సమస్యలు ప్రపంచంలోని సాధకులందరూ తమ జీవితాలలో

ప్రతినిత్యమూ ఎదుర్కొనేవే. అలాగే శ్రీశారదాదేవి తెలిపిన విషయాలు నిత్యసత్యాలు. కాబట్టి ఎల్లప్పుడూ ఆచరించ దగినవే.

పరమపూజ్య స్వామి జ్ఞానదానందజీ మహరాజ్, అధ్యక్షులు, రామకృష్ణమఠం, హైదరాబాదు వారు రచించిన గ్రంథం శ్రీ శారదాదేవి వచనామృతంతోపాటు మాత మీద రచించబడిన ఇతర గ్రంథాల నుండి సేకరించబడిన బోధనలు నవయుగానికి అన్వయం అయ్యేలా ప్రశ్నలు- సమాధానాల రూపంలో ఈ చిన్నపుస్తకంలో కూర్చబడినాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలు శ్రీశారదాదేవి (అమ్మ) స్వయంగా చెప్పినవే. శ్రీశారదాచరితామృతం, దివ్యజనని శ్రీశారదాదేవి, మాతృసన్నిధి అనే పుస్తకాలు కూడా తోడ్పడ్డాయి.

ఈ గ్రంథం సాధకుల సందేహాలను తీర్చి, వారి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి తోడ్పడగలదని ఆశిస్తున్నాను. ఈ గ్రంథ రచనకు ఉపయోగించిన మూలగ్రంథాలలోని విషయసేకరణకు అనుమతించిన పరమపూజ్య స్వామి జ్ఞానదానందజీ మహరాజ్ గారికి, ఈ పుస్తకాన్ని ప్రచురించిన శ్రీరామకృష్ణ సేవా సమితి, బాపట్ల వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

శ్రీ శారదామాత చరణసేవలో,
డా॥ పన్నాల శ్యామసుందర మూర్తి

20 మే, 2018
గుంటూరు

# నీకొక అమ్మ ఉందని మరువకు!

## *సాధకుల సందేహాలకు శ్రీశారదాదేవి సమాధానాలు*

## 01. కోరికలు

***1 ప్రశ్న: అమ్మా! సాధనలు బాగానే చేస్తున్నాను అనిపిస్తున్నది. కానీ అంతులేని కోరికలు నన్ను చుట్టుముడుతున్నాయి. వాటిని అరికట్టలేక పోతున్నాను. నా గతి ఏమవుతుంది?***

అమ్మ: నాయనా! కోరికలు ఉన్నంతవరకూ పునర్జన్మలకు అంతం ఉండదు. ఒకదాని తర్వాత ఒకటిగా అనేక శరీరాలను ధరించేలా చేసేది మనలోని కోరికలే. కాస్త పటికబెల్లం తినాలన్న కోరిక ఉన్నా సరే మళ్ళీ జన్మించాల్సిందే. కోరికను ఒక సూక్ష్మమైన మర్రి విత్తనంతో పోల్చవచ్చు. అతి చిన్నదైన మర్రి విత్తనం నుండి బ్రహ్మాండమైన మర్రిచెట్టు పెరిగినట్టు, మనలో కలిగే చిన్న కోరికే తర్వాత అనంతంగా పెరిగిపోయి, శాఖోపశాఖలుగా విస్తరిస్తుంది. కోరికలున్నంతవరకూ పునర్జన్మ తప్పదు. నిజానికి, పూర్తిగా కోరికలను వదిలించుకో గలిగే వ్యక్తులు అరుదు. ఐతే పూర్వజన్మలో సత్కర్మలు చేసినవాడు, తర్వాత జన్మలో కూడా ఆధ్యాత్మిక చైతన్యాన్ని కోల్పోకుండా ఉంటాడు. తెలిసిందా? (శా.వ. 243)

***2 ప్రశ్న: అమ్మా! మీరెప్పుడూ మేము కోరే కోరికలన్నింటినీ తీర్చమని గురుదేవులను ప్రార్థిస్తూ ఉంటారు. అదెలాగమ్మా? మా మనస్సులో ఒక్కొక్కసారి విపరీతమైన కోరికలు కూడా కలుగుతుంటాయి కదా! మాకు కలిగిన కోరికలన్నింటినీ ఆయన తీరుస్తారా?***

అమ్మ: నాయనా! దాని గురించి నీవేమీ కలత చెంద నవసరం లేదు. మీరు ఎన్ని కోరికలు, ఎటువంటివి కోరినా, గురుదేవులు మీకు శ్రేయస్కరమైన వాటినే మంజూరు చేస్తారు సుమా! ఆ విషయంలో మీరేమీ భయపడనక్కరలేదు. (శా.వ. 167)

***3 ప్రశ్న: అమ్మా! కోరికలే మరొక జన్మ కలగడానికి కారణం అని చెపుతున్నారు కదా? మరి కోరికలను వదిలించుకోవడం సాధ్యమేనా?***

అమ్మ: నాయనా! అందరికీ అది సాధ్యమయ్యే పనేనా? అందరూ అలా కోరికలే లేని స్థితికి చేరుకుంటే ఇక సృష్టే ఆగిపోతుంది. అందరూ అలా చేయలేరు. కనుకనే సృష్టి ఇలా కొనసాగుతోంది, మనుష్యులు పదేపదే జన్మిస్తూ, సంసారంలో కొనసాగుతున్నారు. కోరికలు సమూలంగా నశించినప్పుడే జన్మరాహిత్యం కలుగుతుంది. వేరే మార్గం లేదు. కోరికలు పూర్తిగా నశించనంత కాలం మళ్ళీ పుట్టాల్సిందే! (శా.వ. 263)

***4 ప్రశ్న: అమ్మా! ఒక కోరిక తొలగిపోయిన మరుక్షణమే మరొక కోరిక మొలకెత్తుతోంది. ఈ కోరికలన్నీ ఎలా సమసిపోతాయి?***

అమ్మ: నాయనా! కోరికలకి అంతే ఉండదు. నేను అనే భావం ఉండేదాకా కోరికలు ఉండనే ఉంటాయి. గురుదేవులు ఎల్లప్పుడూ మిమ్మల్ని కాపాడుతుంటారు కాబట్టి ఆ కోరికలు

మిమ్మల్ని ఏమీ చేయలేవు. ఎవరు ఆయన పాదారవిందాలను ఆశ్రయిస్తారో, ఆయనను శరణు వేడుకుంటారో, ఉన్నతమైన జీవితం గడపాలనుకుంటారో, వారిని ఆయన తప్పక కాపాడతారు. అది ఆయన బాధ్యత. ఐతే, సర్వస్వమూ ఆయనకు అర్పించి జీవించాలి. ఆయన మంచి చేయాలను కుంటే చేయనీ, ముంచివేయాలనుకుంటే ముంచనీ! నీవు మాత్రం మంచినే చేస్తూ ఉండాలి. అది కూడా ఆయన ప్రసాదించిన శక్తి మేరకు, ప్రయత్నలోపం లేకుండా, చేయాలి సుమా! తెలిసిందా? (శా.వ. 281)

***5 ప్రశ్న(నళిని): అత్తయ్యా! జ్ఞానం, భక్తి వంటి వాటిలో దేనివలన మనం భోగభాగ్యాలతో సుఖంగా జీవించగలమో వాటికోసమే మనం భగవంతుణ్ణి ప్రార్థించాలి కదా?***

అమ్మ: కాదు. సుఖంగా జీవించడం కోసం ప్రార్థన చేయకూడదు. భగవంతుడికి చేయవలసిన ప్రార్థన గురించి ఒక్కమాటలో చెప్పాలంటే, "నిర్వాసన" (కోరికలు లేని స్థితి) కావాలని ప్రార్థించాలి. కోరికే అన్ని దుఃఖాలకూ మూల కారణం. జననమరణచక్రంలో చిక్కుపడి మాటిమాటికీ తిరుగుతూ ఉండడానికి కారణం ఈ కోరికే. అంతేకాదు. ముక్తిపథానికి అడ్డంకిగా ఉండేది కూడా కోరికే సుమా! (శా.వ. 333)

***6 అమ్మా! నా భర్త డాక్టరు. ఆయనకు మంచి రాబడి రావాలని, మేము ధనవంతులమవ్వాలనీ ఆశీర్వదించండమ్మా!***

అమ్మ: ఆహా! అదెలా సాధ్యమమ్మా! నీ భర్తకు మంచి రాబడి రావటం కోసం, నా బిడ్డలు వ్యాధులతో బాధపడాలా? అది మంచిది కాదమ్మా! అందరూ బాగుండాలనేదే నా అభిమతం.

కాబట్టి నువ్వు కోరినట్టు నేను ఆశీర్వదించలేను. (శా.వ. 319-320)

***7 ప్రశ్న: అమ్మా! తుచ్ఛమైన ఈ కామాన్ని వదిలించుకోవడం ఎలా?***

అమ్మ: కామాన్ని పూర్తిగా ఎవరైనా వదిలించుకో గలుగుతారా? శరీరం ఉన్నంతవరకూ కామం ఉండే తీరు తుంది. కానీ ఒక్క మాట! మంత్రానికి కట్టుబడి నాగుపాములు కూడా వశమయ్యే విధంగా భగవన్నామ స్మరణతో కామాన్ని కూడా తలెత్తకుండా చేయవచ్చు. (శా.వ. 481)

***8 ప్రశ్న: అమ్మా! సుఖభోగాల పట్ల ఉన్న కాంక్షను వదలుకోవడం సాధ్యమేనా?***

అమ్మ: మంచి సందేహమమ్మా! ఆ కాంక్ష తొలగిపోవడం అంత సులభం కాదు. కానీ పెరిగి పెద్దయ్యాక నలుగురినీ చూసి నిజం గ్రహించి తమ ప్రవర్తనను తలచుకొని సిగ్గుపడతారు. ఇతరులతో వాదులాడినప్పుడు వారు వీరిలోని ఈ బలహీనతను (సుఖభోగాల కాంక్షను) చూపించి ఎత్తిపొడుస్తారు. దానితో వీరే మెల్లమెల్లగా దాని నుంచి బయటపడతారు. (శా.వ. 144,145)

## 02. లౌకికజీవనం

***9 ప్రశ్న: నిత్యజీవితంలో ఎలా ఉండాలో చెప్పండమ్మా?***

అమ్మ: 'ఎప్పుడు ఎలాగో అప్పుడు అలా', 'ఎక్కడ ఎలాగో అక్కడ అలా', 'ఎవరితో ఎలాగో వారితో అలా' ఉండండమ్మా! అంతకంటే నేనేం చెప్పగలను? (శా.చ. 130)

***10 ప్రశ్న: అమ్మా! గ్రామ పంచాయితీ వారు జయరాంబాటీలోని మీ ఇంటికి సంవత్సరానికి నాలుగు రూపాయలు పన్ను విధిస్తే సౌమ్యులైన మీరు పన్ను మినహాయింపు కోసం అంత పోరాటం ఎందుకు చేశారమ్మా?***

అమ్మ: నాయనా! నేను పోరాటం చేసింది డబ్బు కోసం కాదు. ముందుచూపుతోనే ఆ పని చేశాను. ఇప్పుడేదో విధంగా నేను పన్ను చెల్లించగలుగుతాను. కానీ భవిష్యత్తులో ఇక్కడ ఒక బ్రహ్మచారిగానీ, సాధువు గానీ ఉంటారు. వాళ్ళంతా ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి జీవించేవారు! అలాంటి వారు పన్ను ఎలా చెల్లించగలరు? ఈ కారణంగానే నేను పన్ను మినహాయింపు కోసం పోరాడాను. (శా.చ 319)

***11 ప్రశ్న (స్వామి జ్ఞానానంద): అమ్మా! పాలు తెచ్చే వ్యక్తి రోజూ పాలలో నీళ్ళు కలిపి తీసుకొస్తున్నాడు. అందుకనే నీళ్ళు కలపని చిక్కటి పాలు తీసుకువస్తే ఇప్పుడిచ్చే ధరకు రెట్టింపు ధర ఇస్తానని చెప్పాను. అది తప్పా అమ్మా?***

అమ్మ: అదేమిటి నాయనా, అలా చేశావు? నువ్వు చేసినది తప్పు. నువ్వు ఆ విధంగా రెట్టింపు ధర ఇచ్చావంటే పాలమ్మే వాళ్ళందరూ ధరను పెంచేస్తారు. అందువల్ల పేదలు పాలను కొనలేక నానా అవస్థలూ పడతారు. అంతేకాదు. నువ్వు పాల ధర ఎంత పెంచినా పాలు అమ్ముకునే వ్యక్తికి పాలలో నీళ్ళు కలిపే బుద్ధి మాత్రం పోదు. ఎక్కువ ధరకు పాలు అమ్మటం వలన ఇంకా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని వాడు ఇంకా ఎక్కువగా పాలలో నీళ్ళు కలుపుతాడు. (శా.చ. 319)

***12 ప్రశ్న: అమ్మా! నేడు ఒక భక్తుడు గురుదేవుల నివేదన కోసం ఒక బుట్టలో సీతాఫలాలు తెచ్చి వాటిని పూజా మందిరంలో పెట్టాడు. అది ఖాళీ అయిన తర్వాత, అక్కడ పనిచేసేవారు చెప్పినట్టు ఆ బుట్టను బయటపారేశాడు. ఈ విషయంలో మీ సలహా ఏమిటి?***

అమ్మ: నేను వసారావైపు వెళ్ళి ఆ బుట్టను చూశాను. అది చాలా బాగుంది. అటువంటి వస్తువును పారేయడం ఎందుకు? చిన్న వస్తువునైనా వృథా చేయకూడదు. తరిగిన కూరగాయల తొక్కలను ఆ బుట్టలో వేసుకోవచ్చు. వాటిని పశువులకు వేయవచ్చు కదా! (శా.వ. 51)

***13 ప్రశ్న: అమ్మా! మీ భక్తుడొకరిని మీ దర్శనానికి మీరు మొదట్లో అనుమతించకుండా, ఆ తర్వాత కొన్నాళ్ళకు అనుమతించారట. అలా ఎందుకు చేశారమ్మా?***

అమ్మ: అతడి సంగతి ఏమి చెప్పను? నాకు ప్రణామం చేయడానికి వచ్చి, ఒక కత్తి తీసుకుని తన తల నరుక్కోబోయాడు! అదేమంటే సాధన, జపధ్యానాలలో మనస్సు లీనం కావట్లేదు కాబట్టి మీరిచ్చిన ప్రాణాలను మీ పాదపద్మాల

వద్దే సమర్పిస్తానంటాడు! ఇదేమన్నా బాగుందా? అంతా మూర్ఖత్వమే కదా! నాముందు బలి చేసుకోవడానికి నేనేమన్నా రాయినా, లేక కాళీఘాట్‌లోని కాళీ దేవినా? ఆనాటి నుండి అతణ్ణి ఇక్కడికి రానీయలేదు. ఆ తరువాత పిల్లలందరూ బ్రతిమాలారు గనుక మళ్ళీ అతడు రావడానికి అనుమతించాను. అయితే ఇప్పుడు అతడు ఒంటరిగా రాడు. మరొకరితో కలసివచ్చి ప్రణామం చేసి వెళతాడు. (శా.వ. 128)

***14 ప్రశ్న: అమ్మా! గోలాప్‌మా మతిమరుపుతో రెండుమూడు సార్లు ప్రమాదానికి లోనయ్యారట కదా! మీరైనా జాగ్రత్తగా ఉండమని ఆమెకు సలహా ఇవ్వకూడదూ?***

అమ్మ: అవునమ్మా! అందుకే ఆమెతో ఇలా చెపుతుంటాను: ‘లోకంలో జీవించాలంటే కాస్త అటూయిటూ దృష్టి పెట్టాలి. మతిమరుపు విడిచిపెట్టాలి. అప్రమత్తంగా మెలగాలి!’ అప్పుడే ఇతరులతో కలిసి జీవించడం సాధ్యమవుతుంది. నా దగ్గరకు వచ్చి శోకాలు పెడితే ప్రయోజనం ఏముంది? (శా.వ. 130)

***15 ప్రశ్న (భక్తురాలు): అమ్మా! ఈ భక్తురాలిని కూడా మాతోపాటు నివేదిత పాఠశాలలో ఉండనివ్వండి. పిల్లలకు చదువు నేర్పిస్తుంది. మాతో కలసి ఉండవచ్చు. మీరేమంటారు?***

అమ్మ: చూడమ్మా! అందరూ ఒకే పని చేయడానికి ఈ లోకానికి రాలేదు. మీరు చదువుకోండి. విద్యార్థినులకు చదువు నేర్పించండి! అది మీ పని! ఈమె మాత్రం అటువంటి పనులు చేయడానికి ఇక్కడికి రాలేదు. నేర్చుకోవడం, నేర్పించడం చాలా మంచి పనులే. సందేహం లేదు. అవి మీరు చేయండి. అంతేకానీ అది అందరికీ సరిపోయే పనికాదు. అందరికీ, అన్ని పనులూ చేసే అర్హత ఉండదు. (శా.వ. 115)

***16 ప్రశ్న: అమ్మా! పన్నెండు సంవత్సరాలుగా చేతికి అంటుకున్న ఈ చర్మవ్యాధితో బాధపడుతున్నాను. మీకు చెప్పి బాధపెట్టడం ఎందుకులే అని చెప్పలేదు!***

అమ్మ: నీ తల్లిగా ఉంటూ, ఇన్నేళ్ళుగా నిన్ను చూస్తూ ఉండి కూడా నీ వ్యాధి విషయం గమనించలేకపోయినందుకు నా మనస్సు తల్లడిల్లుతోంది. నాతో పూజా మందిరానికి రా! గురుదేవులకు అర్పించిన పూలను, చరణామృతాన్ని ఇస్తాను. అంతా నయమైపోతుంది. సాధ్యమైనంత వరకూ చేపలు, మాంసం, ఉల్లిపాయలు, వెల్లుల్లి తరగడం మానివెయ్యి. పొరపాటున చర్మం చిట్లితే, గురుదేవుల చరణామృతాన్ని లేపనంగా వాడు. వెంటనే నయమవుతుంది. (శా.వ. 116)

***ప్రశ్న: అమ్మా! మీరు చెప్పిన విధంగా చేశాను. నా చర్మవ్యాధి నయమైంది. కానీ అమ్మా! ఈ వ్యాధిని తగ్గించుకోవడం కోసం నేను మిమ్మల్ని ఆశ్రయించలేదు. ఈ వ్యాధిని నయం చేసినంత సులభంగా నన్ను విడిచిపెట్టలేరు!***

అమ్మ: నీ శరీరం కూడా నాదే కదమ్మా! నీకు అనారోగ్యంగా ఉంటే నేను కూడా బాధ పడాలిగా! (శా.వ. 117)

***17 ప్రశ్న: అమ్మా! ఈ సమయంలో మీరు విశ్రాంతి తీసుకుంటారని నాకూ తెలుసు. గోలాప్‌మా ఈ సమయంలో వచ్చినందుకు కోప్పడ్డారు కూడా. కానీ మీ నిద్రకు భంగం కలిగించేంత మూర్ఖురాలిని కాదు గదమ్మా?***

అమ్మ: ఓహో! ఈ వేళలో వచ్చినందుకు గోలాప్‌మా కోప్పడిందా? బాధపడకమ్మా! ఇది గురుదేవుల సామ్రాజ్యం. ఇక్కడ ఎలాంటి నియమాలూ లేవు. ఇక్కడి తలుపులు అందరి కోసమూ నిత్యం తెరిచే ఉంటాయి. ఎవరికి ఎప్పుడు అవకా

శమూ, తీరికా లభిస్తాయో, అప్పుడు వారు ఇక్కడికి రావచ్చు. గోలాప్‌మా మందలింపును మనస్సులో పెట్టుకోకమ్మా! (శా.వ. 120)

***18 ప్రశ్న: అమ్మా! గిరీష్ బాబు సోదరి మరణించింది. మానవుల మరణం గురించి మీరు ఏమి చెపుతారమ్మా?***

అమ్మ: నాయనా! మరణం గురించి ఏమి చెప్పేది? ఇప్పుడు ఉంటారు. మరుక్షణం కనుమరుగైపోతారు. పోయిన వ్యక్తితో పాటు ఏదీ వెళ్ళదు. మరణానంతరం అతడి వెంట వెళ్ళేది అతడు చేసిన ధర్మాధర్మాలు, పాపపుణ్యాలే! (శా.వ. 288)

***19 ప్రశ్న: అమ్మా! కిరణ్‌బాబు కొత్త ఇల్లు 'లక్ష్మీనివాస్'కు వెళ్ళారట కదా! అది ఎలా ఉంది?***

అమ్మ: నాయనా! ఆ ఇల్లు చాలా బాగుంది. విశాలమైన వసారా! భాగ్యవంతులకు మాత్రమే అలాంటి ఇల్లు లభిస్తుంది. ఇరుకుగా ఉన్న చోట నివసిస్తే మనస్సు కూడా సంకుచితమై పోతుంది. విశాలమైన చోట నివసిస్తే మనస్సు కూడా విశాల మవుతుంది. (శా.వ. 289)

***20 ప్రశ్న: అమ్మా! నిజమైన స్నేహితుడు ఎలా ఉండాలి?***

అమ్మ: నాయనా! సముచిత తరుణంలో హెచ్చరించే వ్యక్తే నిజమైన స్నేహితుడు. సమయం మించిపోయిన తర్వాత, 'అరెరే! అలా చేసి ఉంటే బాగుండేది!' అని చెప్పడం వలన ప్రయోజనం ఏముంది? నిజమైన స్నేహితుడైతే మనం తప్పు చేస్తున్నప్పుడు కచ్చితంగా హెచ్చరించగలగాలి. (శా.వ. 291)

***21 ప్రశ్న: అమ్మా! నా స్నేహితుడొకడు అధిక ధర పెట్టి కొని బహుమతులు ఇస్తుంటాడు. మరొక స్నేహితుడు పేదరికం వలన చాలా తక్కువ వెల ఉన్న బహుమతులు ఇస్తుంటాడు. దీనిని ఎలా చూడాలి?***

అమ్మ: నాయనా! బహుమతుల ధరను బట్టి స్నేహానికి విలువ కడతావా? ఎటువంటి ప్రేమతో ఆ బహుమతి ఇచ్చారో దాన్ని మాత్రమే ముఖ్యంగా చూడాలి. (ది.జ. 107)

***22 ప్రశ్న: అమ్మా! ఆ స్త్రీ (సన్యాసిని) మీతో భగవంతుడి గురించి అంత వాదించింది కదా! అలా చేయడం మంచిదేనా?***

అమ్మ: స్త్రీలు వాదానికి దిగడమా? భగవంతుని విషయం వాదనతో తేలుతుందా ఏమిటి? జ్ఞానులు కూడా వాదం మూలంగా భగవంతుణ్ణి తెలుసుకోలేరు సుమా! (శా.వ. 33)

***23 ప్రశ్న: అమ్మా! మా సంసారంలో ఎంతో ఖర్చవుతున్నది. ఇక్కడ మీ సేవ కోసం మేం ఇస్తున్న ఐదురూపాయలు చాలా తక్కువ. మీ సేవ కోసం డబ్బులు ఇవ్వడంలోనే మాకు సంతృప్తి కదమ్మా? కాదనకండి!***

అమ్మ: నీవు చెప్పింది నిజమేనమ్మా! ఇక్కడ ఇస్తే అది సన్న్యాసుల, భక్తుల సేవ కోసం వినియోగించబడుతుంది. (శా.వ. 79)

***24 ప్రశ్న: అమ్మా! ఇదేంటి? మీరు నాకు నమస్కారం చేస్తున్నారు? మీరు ఇలా చేయవచ్చా? మీ పాదాలకు నా మోచేయి తగిలినంత మాత్రాన మీరు ఇలా చేయడం బాగాలేదమ్మా!***

అమ్మ: అదేంటి నాయనా, అలా అంటావు! మీరందరూ నిజంగా భగవత్స్వరూపులు. ఆ విధంగానే భావించి నీకు నమస్కారం చేశాను సుమా! అందులో తప్పేమీ లేదు. (శా.వ. 254)

***25 ప్రశ్న (సురబాల): ఇదిగో చూడు! ఈ పిల్లి మీద నువ్వు (మాతృదేవి) కరుణ చూపవలసిన పనిలేదు. అది ఇప్పటికి మూడుసార్లు గ్లాసులో మూతిపెట్టి మంచినీరు తాగింది. మూడుసార్లు తరిమినా పోలేదు. ఇవాళ దాన్ని చంపిన తర్వాతే***

***వేరే పని చేస్తాను. మనుష్యులపట్ల నీవు చూపుతున్న కరుణ చాలు. నీ ప్రేమనంతా వారివరకే ఉంచేసుకో!***

అమ్మ: చూడమ్మా దాహం వేసిన ప్రాణిని నీళ్ళు త్రాగకుండా ఆపకూడదు. పైగా ఆ పిల్లి గ్లాసులో నోరు పెట్టిందంటున్నావు కదా! దానిని ఆ నీళ్ళు త్రాగనీ. ఇక నా కరుణ విషయమంటావా – నా కరుణను పొందని వ్యక్తి నిజంగా దురదృష్టవంతుడే! నేను కరుణ చూపని వ్యక్తో, జంతువో, కీటకమో – ఏదీ లేదు సుమా! (శా.వ. 303)

***26 ప్రశ్న: అమ్మా! కలకత్తాకు రమ్మని మిమ్మల్ని పదేపదే ప్రాధేయపడుతున్నా మీరు వెళ్ళడం లేదు ఎందుకని? వాళ్ళు బాధపడుతున్నారమ్మా!***

అమ్మ: వాళ్ళకేం నాయనా, చెబుతారు! వాళ్ళు ఏదీ లేని సాధువులు. లే అంటే లేవవచ్చు. కూర్చో అంటే కూర్చోవచ్చు. వాళ్ళకి ఎలాంటి చీకూచింతా లేదు. ఒక తుండుగుడ్డ భుజాల మీద వేసుకుంటే చాలు, బయలుదేరవచ్చు. నాకు అలా ఎలా కుదురుతుంది? ప్రయాణం చేయాలంటే ఎన్ని విషయాలు ఆలోచించి, నిర్ణయం తీసుకోవాలి? ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా పనులు చేయవలసి ఉంటుంది కదా నేను? (శా.వ. 477)

***27 ప్రశ్న: అమ్మా! మీ ఆరోగ్యం బాగాలేక పోయినా మీరే వంట చేయవలసి వస్తున్నది. ఎడతెగక కష్టపడుతున్నారు. మీ వంట మనిషికి ఏమీ రాదు. ఆ వ్యక్తిని పంపించివేయడానికి మీరు ఒప్పుకుంటారా?***

అమ్మ: నాయనా! ఆ వంట మనిషిని మీరు పంపించి వేయాలనుకుంటే అలాగే చేయండి! కానీ నేను పంపించివేస్తే మాత్రం వాడికి గత్యంతరం లేదు సుమా! (శా.వ. 479)

***28 ప్రశ్న: అమ్మా! మీ పెట్టెలో బట్టలన్నీ తీసి సర్దుతున్నాను. ఇదిగో, ఇది బాగా చిరిగిపోయింది. దీనిని బయట పారవెయ్యనా?***

అమ్మ: వద్దు! దానిని అలాగే ఉంచు! దానిని ఎంతో ప్రేమతో నా కుమార్తె 'నివేదిత' నాకు తెచ్చియిచ్చింది. దానిని నేను చాలా రోజులు ఉపయోగించాను కూడా! (శా.వ. 390)

***29 ప్రశ్న: మేము వచ్చి చాలాసేపయింది. ఇక వెళతామమ్మా?***

అమ్మ: చూడమ్మా! ఎక్కడినుంచైనా వెళ్ళేటప్పుడు 'వెళతాం, వెళుతున్నాం' అనకూడదు. 'వెళ్ళి వస్తాం!' అని చెప్పాలి. సరే, వెళ్ళిరండి. తీరిక దొరికినప్పుడు మళ్ళీ రండి! (శా.వ. 347)

***30 ప్రశ్న: అమ్మా! ఆ యువకుల ధోవతుల గురించి మీరు అలా ఎందుకు వ్యాఖ్యానించారమ్మా?***

అమ్మ: నాయనా! ఆ యువకులు ఇద్దరూ అంచులేని ధోవతులు ధరించారు. యువకులైనవారు చక్కని అంచుగల ధోవతులు ధరించాలి. లేకపోతే వారి మనస్సు కూడా ముసలిదైపోయి, ఉత్తేజాన్ని కోల్పోతుంది. మనస్సును ఎప్పుడూ ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఇదిగో నాయనా! ఈ కొత్త ధోవతులు వారికి ఇచ్చి, వాటిని కట్టుకోమని చెప్పు. (శా.వ. 334)

***31 ప్రశ్న: అమ్మా! ఆ బ్రహ్మచారి చాలా మంచివాడు. కానీ అతడి పొరపాటు వలన రాధూ కోసం తీసుకువస్తున్న ఆహారపు పాత్ర క్రిందపడి, ఆహారమంతా నేలపాలయింది. అంతేగానీ, అతడు మంచివాడమ్మా!***

అమ్మ: నాయనా! ఒక సాధువుగా అతడు మంచివాడై ఉండవచ్చు కానీ నాకు మాత్రం పనిచేయగల సమర్థులే అవసరం. చెట్టునీడన నివసించే సాధువు నా పనులు చేయలేడు.

కొందరు క్షణికోత్సాహంలో మహత్కార్యాలు చేయగలరు. కానీ అతి సామాన్యమైన పనులు చేయడంలో ఒక వ్యక్తి కనబరిచే శ్రద్ధ మాత్రమే ఆ మనిషి యోగ్యతను చాటిచెపుతుంది. (శా.వ. 330)

***32 ప్రశ్న: అమ్మా! మేము సాంఘిక జీవనం గడుపుతున్నాం. ఎవరితో ఎలా మసలుకోవాలి?***

అమ్మ: నాయనా! సంఘ జీవనంలో ఎవరికి ఇవ్వవలసిన గౌరవం వారికివ్వాలి. చివరకు చీపురు కట్టను కూడా గౌరవించి దాని ప్రదేశంలో దానిని ఉంచాలి. అంతేకాని ఎక్కడ పడితే అక్కడ పడేయకూడదు. అన్నిటికన్నా చిన్న పని అనుకున్న దానిని కూడా అత్యంత గౌరవంతో నెరవేర్చాలి. (ది.జ. 107)

***33 ప్రశ్న: అమ్మా! రోజూ వంట గదిలో వండిన పదార్థాలలో చాలా వృథా అయిపోతున్నాయి. వాటినేం చేయాలి?***

అమ్మ: నాయనా! వాటిని పారవేయకూడదు. ఎవరికి పనికి వచ్చేది వారికివ్వాలి. మనుష్యులు తినగా మిగిలినవి ఆవులకో, ఆవులు తినలేనివి కుక్కలకో, కుక్కలు తినలేనివి చెరువులో చేపలకో వెయ్యాలి. అంతేగాని, ఏ పదార్థాన్నీ వృథా చేయకూడదు. (ది.జ. 320)

***34 ప్రశ్న: అమ్మా! మీరు అందరినీ సమంగా ప్రేమిస్తున్నారు. మమ్మల్నీ అలాగే ప్రేమించమంటారు. అదెలా సాధ్యమమ్మా?***

అమ్మ: అందరినీ సమానంగా ప్రేమించటం ఎలాగో చెబుతా విను. నీవు ప్రేమించినవారిని ఏమీ అడగకు. ఎందు కంటే అందరూ నీవు అడిగినంత ఇవ్వలేకపోవచ్చు. కొందరు ఎక్కువ, కొందరు తక్కువ ఇవ్వవచ్చు. అప్పుడు ఎక్కువ ఇచ్చిన వారిని ఎక్కువగానూ, తక్కువ ఇచ్చినవారిని తక్కువగానూ

ప్రేమిస్తావు. అప్పుడు నీ ప్రేమ అందరిపట్ల సమానంగా ఉండదు. నిష్పక్షపాతంగా అందరినీ ప్రేమించలేవు. (ది.జ. 105, 106)

***35 ప్రశ్న (అన్నపూర్ణమ్మ): అమ్మా! నాకు మనశ్శాంతి కరువైంది. ఏమవుతుందోనని భయంగా ఉంది.***

అమ్మ: నీకు భయమెందుకమ్మా! నీవు గురుదేవులను దర్శించావు. కానీ నీకొక విషయం చెబుతాను. నీకు మనశ్శాంతి కావాలంటే, ఇతరుల దోషాలను ఎంచవద్దు. అందుకు బదులు నీలోని దోషాలనే ఎంచుకో. ఈ ప్రపంచం మొత్తాన్ని నీదిగా చేసుకో! నీకు పరాయి వారెవరూ లేరు. ఈ సర్వ ప్రపంచం నీదే! (శ్రీ శారదామాత చరమ సందేశం) (ది.జ. 67)

## 03. ఆచారాలు

***36 ప్రశ్న: అమ్మా! ఆహారం విషయంలో మేమెలాంటి నియమాలు పాటించాలి?***

అమ్మ: నాయనా! ఏ ఆహారం తీసుకోదలచుకున్నా ముందు దానిని దేవుడికి అర్పించి ఆ తరువాతే తినాలి. భగవదర్పణం చేయకుండా ఏ ఆహారాన్నయినా తినకూడదు. ఆహారాన్ని బట్టి రక్తం తయారవుతుంది. పరిశుద్ధమైన ఆహారాన్ని తీసుకుంటే పరిశుద్ధమైన రక్తం ఏర్పడుతుంది. తద్వారా మనస్సు పరిశుద్ధ మవుతుంది. శక్తి కూడా వస్తుంది. అంతేకాదు. మనస్సు పవిత్రమైనప్పుడు పవిత్రమైన భక్తి పుడుతుంది. భగవత్ప్రేమ కూడా కలుగుతుంది సుమా! (శా.వ. 301)

***37 ప్రశ్న(దుర్గాబాబు): అమ్మా! నేను ఆసుపత్రిలో పనిచేస్తున్నాను. పని మధ్యలో దాహం వేసి పలుమార్లు నీళ్ళు త్రాగవలసి వస్తున్నది. ఆహారం విషయంలోనూ అంతే. ఏమి చేయమంటారు?***

అమ్మ: ఏమి చేస్తావు నాయనా! పని మధ్య నీరు త్రాగకుండా ఉండలేవు కదా! గురుదేవులను తలచుకుని పుచ్చుకో. విధినిర్వ హణ కనుక దోషం లేదు. ఇలా ఉద్యోగవ్యాపారాలు చేస్తున్న ప్పుడు నియమాలన్నింటినీ పాటించడం సాధ్యమా? (శా.వ. 307)

***38 ప్రశ్న: అమ్మా! మా పక్కింటివారు, పిల్లిగానీ, కుక్కగానీ పొరపాటున తాకితే, చేస్తున్న పనినంతా వదిలేసి, స్నానం చేయడం వంటి మూఢాచారాలను ఎక్కువగా పాటిస్తున్నారు. దీని మీద మీ అభిప్రాయం ఏమిటి?***

అమ్మ: అవునవును. కృష్ణబోసు సోదరి కూడా అంతే. గంగలో మునుగుతుంది. 'తల మునిగిందా!' అని ప్రక్కవారిని అడుగుతుంది. ఇటువంటి ఆచారాల పిచ్చి ఉన్నవారి మనస్సు ఎప్పటికీ పవిత్రతను సాధించలేదు. వారు ఎదిగేకొద్దీ వారితో పాటు ఈ ఆచారాల పిచ్చికూడా పెరిగిపోతూ ఉంటుంది. ఇది అన్ని విషయాలలోనూ నిజం. (శా.వ. 311)

### *39 ప్రశ్న: అమ్మా! మీరేమో శ్రాద్ధాహార భోజనం తినకూడదన్నారు. గృహస్థులమైన మేము బంధువుల శ్రాద్ధకర్మలప్పుడు ఏమి చేయాలమ్మా?*

అమ్మ: నిజమే నాయనా! అది కొంచెం ఇబ్బందికరమైన పరిస్థితే! మరణించిన వ్యక్తికి పదమూడవ రోజు నిర్వర్తించే శ్రాద్ధకర్మలో అర్పించే ఆహారం స్వీకరించకూడదు. అది భక్తికి భంగం కలిగిస్తుంది. కానీ బంధువుల మనస్సును గాయపర చడం కూడా మంచిది కాదు. అందువలన శ్రాద్ధానికి వెళ్ళండి. ఉరుకులు పరుగుల మీద పని చేసిపెట్టండి. కానీ భోజనం చేయకుండా ఉండడానికి ప్రయత్నించండి. అలా కుదరని పక్షంలో ఆ శ్రాద్ధంలో మహావిష్ణువుకో, ఇతర దేవతలకో అర్పించిన ఆహారాన్ని స్వీకరించండి. భగవంతుని ప్రసాద మయితే శ్రాద్ధాహారాన్ని కూడా భక్తులు పుచ్చుకోవచ్చు. (శా.వ. 301)

### *40 ప్రశ్న: అమ్మా! ఏకాదశి రోజుల్లో ఎలా ఉండాలి? ఏమి తినాలి?*

అమ్మ: ఏకాదశి రోజున కటిక ఉపవాసం చేయవద్దు. కొంచెం సగ్గుబియ్యం జావ పుచ్చుకో. అది శరీరాన్ని చల్లబరుస్తుంది. వ్రతాలతో శరీరాన్ని బలహీనం చేసుకోకు. ఆరోగ్యం పాడయితే సాధనలు ఎలా చేయగలవు? (శా.వ. 112-113)

***41 ప్రశ్న (గోలాప్‌మా): అమ్మా! ఒక శూద్రుడి చేతులతో వండిన ఆకుకూరనీ, ఆహారాన్నీ మీరు ఎలా తిన్నారు? అది సరికాదు. మీరిలా చేసి ఉండకూడదు.***

అమ్మ: గోలాప్! మూర్ఖంగా మాట్లాడకు. ఎవరు శూద్రుడు? అతడు భక్తుడు, నా బిడ్డ! భక్తులకు కులభేదాలుంటాయా? నీ నిష్కాపట్యం బాగానే ఉంది కానీ ఇలా మూర్ఖంగా మాట్లాడకు! (శా.వ. 131)

***42 ప్రశ్న (నళిని): అత్తా! మహమ్మదీయుడైన అంజాద్‌కి అంత ప్రేమగా, అతని ప్రక్కన కూర్చుని భోజనం వడ్డించి, ఆ ఎంగిలి విస్తరి తీసివేసి, అతడు భోజనం చేసిన చోటును కూడా శుభ్రం చేశావే! ఇదంతా ఊళ్ళోవాళ్ళు చూస్తే మనల్ని కులం నుండి వెలివేస్తారు కదా?***

అమ్మ: నళినీ! నోరుమూసుకో! నాకేమిటీ కులమేమిటీ? శరత్ (శారదానంద) ఎలా నాకు కుమారుడో, అలాగే ఈ అంజాద్ కూడా నా కుమారుడే! (శా.చ. 309)

***43 ప్రశ్న: అమ్మా! మీరు చేపలు తినడం ఎందుకు మానివేశారు? మీరు తినడం లేదు కదా అనే నేను మానేశాను. మీరు తింటే నేనూ తింటాను.***

అమ్మ: నాయనా! అదే మూర్ఖత్వం! నేను ఈ ఒక్క నోటితోనే ఆరగిస్తున్నానని అనుకుంటున్నావా? నేను చెపుతున్నా విను! ఇక మీదట నువ్వు తప్పనిసరిగా చేపలు తినాలి! (శా.వ. 131)

***44 ప్రశ్న: అమ్మా! వితంతువైన మీరు సుమంగళి చిహ్నాలయిన గాజులు, అంచుగల చీర ఇంకా ఎందుకు ధరిస్తున్నారు? ఇది సంప్రదాయ విరుద్ధం కదా?***

అమ్మ: అమ్మా! నా భర్త సామాన్య మానవుడా? ఆయన మరణానికి అతీతుడు గదా. వారు మహాసమాధి చెందాక నేను గాజులు తీసివేయడానికి ప్రయత్నించాను. అప్పుడు ఆయన సాక్షాత్కరించి, 'నేను ఎక్కడికి పోయాను? ఈ గది నుంచి మరొక గదికి వెళ్ళాను! అంతే కానీ నేను చనిపోలేదు. ఇదుగో ఇక్కడే ఉన్నాను!' అంటూ నన్ను వారించారు. మరొక రెండు సార్లు కూడా నేను గాజులు తీసివేయడానికి ప్రయత్నిస్తే అలాగే జరిగింది. ఇక దానిని గురుదేవుల నిర్ణయంగా, ఆదేశంగా భావించి అప్పట్నుంచీ సుమంగళిగానే జీవిస్తున్నాను. (శా.చ 141)

***45 ప్రశ్న: అమ్మా! స్వామీజీ (వివేకానంద స్వామి) శూద్రులైనందువల్ల ఆయనకు సన్న్యాసానికి అర్హత లేదని కొందరంటున్నారు. అలాగే స్త్రీలకు కూడా సన్న్యాసం నిషిద్ధం అంటారు. దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి?***

అమ్మ: ఆ విషయాలన్నీ నాకు తెలియవు నాయనా! తెలిసింది ఒక్కటే. సప్తఋషులలోని ఒక ఋషి నరేంద్రునిగా దిగివచ్చారు. ఇంతవరకే నాకు తెలుసు. అంతేగాక, గురుదేవుల శిష్యులు జ్ఞానులు. జ్ఞాని అయిన వారెవరైనా సన్న్యాసం పుచ్చుకోవచ్చు. ఇక స్త్రీలకు సన్న్యాసం విషయం అంటావా? గౌరీమా లాంటి వారు కేవలం స్త్రీయేనా? ఆమె పురుషులకే మాత్రం తీసిపోదు. ఆమె సాధించిన మహత్కార్యాలను సాధించిన పురుషులెంత మంది ఉన్నారు? గురుదేవులిలా అనేవారు – "ఒక స్త్రీ సన్న్యాసం పుచ్చుకొన్న తరువాత ఆమెను స్త్రీగా పరిగణించ కూడదు." (శా.వ. 302)

***46 ప్రశ్న: అమ్మా! వ్యాధిగ్రస్తులై పడుకుని ఉన్నవారికి నమస్కరించడం శాస్త్రవిరుద్ధమని విన్నాను. అలా నమస్కరిస్తే ఏమి జరుగుతుంది?***

అమ్మ: నాయనా! అలా నమస్కరిస్తే ఆ వ్యక్తిని పీడిస్తున్న వ్యాధి అతడి వద్దే స్థిరంగా ఉండిపోతుంది. అందుకే వ్యాధిగ్రస్తులై పడుకున్న వారికి నమస్కరించకూడదు. (శా.వ. 191)

***47 ప్రశ్న: అమ్మా! భక్తురాలైన మా స్నేహితురాలు ఒకామె రోజుకు మూడు నాలుగు సార్లు అన్నం తింటుంది. ఇలా చేయడం సరియేనా?***

అమ్మ: ఈ అల్పవిషయాలను గురించి ఆలోచిస్తూ మనస్సు పాడుచేసుకోకమ్మా! వీటిని గురించి తలచుకుంటూ ఉంటే భగవంతుణ్ణి మరచిపోవలసి వస్తుంది. లోకులు ఏమనుకున్నా సరే, నీకు ఏది సరైనదని అనిపిస్తుందో దానిని భగవంతుణ్ణి తలచుకుంటూ చేయి. 'లోకులను కేవలం కీటకాలుగా భావించు!' అనేవారు గురుదేవులు. దీని అర్థం ఎవరినీ అగౌరవపరచమని కాదు. ఇక్కడ గురుదేవులు ప్రస్తావించింది అల్పులు, దుర్మార్గులు అయిన లోకుల గురించి మాత్రమే సుమా! (శా.వ. 145)

## 04. కుటుంబం

***48 ప్రశ్న: అమ్మా! మిమ్మల్ని చూడడానికి వచ్చిన ఈ అమ్మాయిలు ఇక వెళ్తొస్తామంటున్నారమ్మా. ఇప్పటికే పొద్దుపోయింది. ఇవాళ ఇంటికి వెళ్ళాక వీళ్ళకి చీవాట్లు తప్పవు!***

అమ్మ: అయ్యో! వాళ్ళకి చీవాట్లు తప్పవా? అమ్మా! ఇంట్లో ఏమైనా అంటే ఎదురుతిరగవద్దు. గురుదేవుల అనుగ్రహంతో అన్నీ చక్కబడతాయి. ఈ ప్రపంచంలో ఎన్ని రకాల మనుష్యులున్నారు! అన్నీ సహించి జీవనం కొనసాగించాలి. స–స–స (శ, ష, సల అపభ్రంశం) - మూడు 'స'లు - అంటే 'సహించు, సహించు, సహించు!' అని అర్థం. మూడు కాలాలలోనూ, అన్ని వేళలా సహనం కలిగివుండమని దానికి అర్థం. సహనం కలిగిన వ్యక్తి మాత్రమే ఒద్దికగా జీవిస్తాడని అనేవారు గురుదేవులు. కాబట్టి సహనంతో జీవించండమ్మా! (శా.వ. 349)

***49 ప్రశ్న: అమ్మా! నేను జపతపాలకు ఎక్కువ సమయం కేటాయించడం వలన సాంసారిక విధులను నిర్లక్ష్యం చేయవలసివస్తున్నది. అసలు ఆధ్యాత్మిక జీవితమే ముఖ్యం కదా అనిపిస్తున్నది. మీరేమంటారు?***

అమ్మ: ఇటువంటి మాటలు నాకు నచ్చవు నాయనా! కుటుంబం కూడా భగవంతునికి చెందినదే కదా. మనల్ని ఆయన ఎక్కడ ఏ పనిలో పెడితే, ఆ పనిని ఆయన పట్ల విశ్వాసంతో, చేతనైనంత శ్రద్ధగా చక్కగా చేయటానికి ప్రయత్నించాలి. అంతేగానీ, ఆధ్యాత్మిక సాధనల సాకుతో కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం సరికాదు. (శా.వ. 476)

***50 ప్రశ్న: అమ్మా! అత్తగారింట్లో ఎలా ఉండాలి?***

అమ్మ: అత్తగారింట్లో వారందరినీ జాగ్రత్తగా చూసుకోవాలి. లేకపోతే వారు బుసకొడతారు. ఇక్కడ మీరు నా బిడ్డలు. మీకు ఏమి చెప్పినా, ఏమి ఇచ్చినా మీరు తృప్తి చెందుతారు. ఏ లోటు జరిగినా పట్టించుకోరు. కానీ అత్తగారింట్లో సంగతి వేరు. వారికిచ్చేవన్నీ శ్రేష్ఠమైనవిగా ఉండాలి. చిన్న లోటు జరిగితే చాలు, ముఖం ముడుచుకుంటారు! (శా.వ. 236)

***51 ప్రశ్న: అమ్మా! 17 ఏళ్ళ వయస్సున్న నా కుమార్తె ఒక ఆడపిల్లకు జన్మనిచ్చింది. కానీ ఆ పసిబిడ్డ ఈ రోజు ఉదయం హఠాత్తుగా చనిపోయింది. దుఃఖంతో తల్లడిల్లుతున్న నా కూతురికి కొంచెం మనశ్శాంతి లభిస్తుందని మీ వద్దకు తీసుకువచ్చాను. ఆమెకేమైనా చెప్పండమ్మా!***

అమ్మ: అయ్యో! నా తల్లీ! నీకు మైల కదా నన్ను తాకవద్దని నిన్ను బాధపెట్టాను కదా. ఏమనుకోకు తల్లీ. ఎంతో దుఃఖంతో బాధపడుతూ మనశ్శాంతి కోసం నన్ను ఆశ్రయించావు కదా. మైల అయినా ఫర్వాలేదు. రా! వచ్చి నా పాదాలను తాకి నమస్కరించు. అమ్మాయీ! నీకు ఏమి చెప్పను? నాకేమీ తెలియదు. గురుదేవుల ఛాయాచిత్రాన్ని నీ దగ్గర ఉంచుకో. ఆయన ఉనికి నిజం. ఆయన నీవద్దనే ఉన్నారని జ్ఞాపకం ఉంచుకో. కన్నీటితో నీ బాధలను ఆయనకు విన్నవించు. వ్యాకులతతో "గురు మహరాజ్! మీ పాదపద్మాల వద్ద నాకు ఆశ్రయమివ్వండి! నాకు మనశ్శాంతి ఇవ్వండి!" అని మనః పూర్వకంగా క్రమంగా ప్రశాంతతను సంతరించుకుంటుంది. కష్టాలు ఎదురైనప్పుడల్లా ఆయనకు విన్నవించుకో! (శా.వ. 170, 171)

***52 ప్రశ్న: అమ్మా! సంసారులమైన మేము, కుటుంబంలో ప్రతి ఒక్కరి అవసరాలనూ, ఇష్టాలనూ తీర్చడంతోనే అలిసిపోతున్నాం. గురుదేవులను స్మరించడానికి ఐదు నిమిషాలు కూడా తీరిక దొరకడం లేదు. ఏమి చేయాలమ్మా?***

అమ్మ: ఏమీ ఫరవాలేదమ్మా! గురుదేవులు అంతర్యామి. అందరి హృదయాలలోనూ ఆయన నెలకొని ఉన్నారు. నువ్వు మనసారా చేసే ఏ కొద్దిపాటి ప్రార్థననైనా ఆయన తప్పక విని, అర్థం చేసుకుంటారు. అంతేకాక, నువ్వు కుటుంబంలో పనులని చెప్పావే. వాటిని చేస్తున్నది నువ్వా? ఆయనే కదా చేయిస్తున్నది? కుటుంబం కూడా ఆయనదే కదా? ఆయన సంకల్పం లేకుండా ఏదైనా జరుగుతుందా? చెట్టు ఆకు కూడా ఆయన సంకల్పం లేకుండా కదలదు. నీ మనస్సులో ఈ ఆవేదన, వ్యాకులత తలెత్తితే, అది కూడా ఆయన సంకల్పం వలననే జరిగిందని గ్రహించు. నువ్వు ఆయనను ప్రేమించినా, ప్రేమించకున్నా ఆయన నిన్ను ప్రేమిస్తారు. (శా.వ. 152)

***53 ప్రశ్న (సురేంద్ర): అమ్మా! ఇంట్లో చాలామంది ఉన్నారు. వంట పూర్తయ్యేలోగానే ఒకరిద్దరు భోజనం చేసేస్తున్నారు. ఆ తరువాత భగవంతుడికి నైవేద్యం చేయడానికి సంకోచంగా ఉంది! ఎలా?***

అమ్మ: కుటుంబంలో అలా జరగడం అనివార్యం. మాకు కూడా అటువంటి పరిస్థితి ఎదురవుతూనే ఉంటుంది. కానీ ఒక్కమాట. ఇంట్లో కనుక ఒక రోగి ఉంటే, అతడి కోసం ప్రత్యేకంగా కొంత ఆహారాన్ని తీసి ఉంచాలి. నువ్వు తినే టప్పుడు మాత్రం గురుదేవులే నీకు ఆ ఆహారాన్ని ప్రసాదించి

నట్లుగా భావించి, ఆయనను స్మరించుకుంటూ భోజనం చెయ్యి. అలా చేస్తే ఎలాంటి దోషమూ అంటదు. (శా.వ. 308)

***54 ప్రశ్న (మణీంద్ర): సాతు (ఒక సన్న్యాసి) బంకూరా ప్రాంతంలోని 'ఇందుపూర్'లో కరువు బాధిత ప్రాంతంలో నివారణ కార్యక్రమాలకు సేవ నిమిత్తం వెళుతున్నాడు. అదే సమయంలో అతడి సోదరి వివాహం కుదిరింది. ఆ వివాహానికి అతడు రాలేదని అతడి తల్లిదండ్రులు చాలా బాధపడుతున్నారు. అతడు ఏమి చెయ్యాలమ్మా?***

అమ్మ: అవును నాయనా! వారెంతో బాధపడ్డారని నాకు కూడా తెలిసింది. బాధ ఉండడం సహజమే కానీ ఒక సన్న్యాసి వివాహ వేడుకలలో ఎలా పాల్గొంటాడు? మరో సందర్భంలో విడిగా వెళ్ళి చూసి వస్తాడులే. (శా.వ. 107)

***55 ప్రశ్న: అమ్మా! వడ్లు దంచడం, కసువు ఊడ్చడం లాంటి పనులు కూడా చేస్తూ మీరు ఎందుకంత శ్రమ పడుతున్నారు?***

అమ్మ: నాయనా! అందరికీ ఆదర్శంగా ఉండడం కోసమే ఇవన్నీ చేస్తున్నాను. అంతేకాదు. ఆదర్శప్రాయమైన జీవితం గడపడానికి ఎంత అవసరమో అంతకంటే ఎక్కువగానే నేను పని చేశాను సుమా! (శా.వ. 232)

***56 ప్రశ్న: అమ్మా! మా అత్తగారు ఎప్పుడూ ఎవరోవొకరిలో తప్పులు వెతుకుతూ, వారిని బిగ్గరగా చీవాట్లు పెడుతూ ఉంటారు. అదేమంటే నేను చెప్పేది నిజమే కదా అంటారు. ఈ స్వభావం మంచిదేనా?***

అమ్మ: నాయనా! ఎవరి మీదా అంత బిగ్గరగా అరవటం మంచిది కాదు. ప్రతి విషయంలోనూ, ఎల్లప్పుడూ లోపాలు

చూడడమనేది కోరి దుఃఖాన్ని తెచ్చుకోవటమే అవుతుంది. నిజమే చెపుతున్నాం అన్న వంకతో చాలామంది తమ మృదుత్వాన్నీ, సౌజన్యాన్నీ కోల్పోతారు. ఏమి జరిగినా సాత్త్వికతను, సౌజన్యాన్ని కోల్పోకూడదు సుమా! అప్రియమైన నిజాన్ని సైతం మృదువుగా చెప్పాలని పెద్దలు అంటారు. సహనాన్ని మించిన సుగుణం వేరొకటి లేదు! (శా.వ. 270)

***57 ప్రశ్న: అమ్మా! కలహాలతో నిండిన ఈ కుటుంబంలో మీరెందుకు జన్మించారు?***

అమ్మ: నాయనా! నా సోదరుల సంగతి వదిలెయ్యి గానీ నేనెందుకు ఈ కుటుంబంలో జన్మించానో తెలుసా? నా తల్లిదండ్రులు అటువంటి సజ్జనులు కాబట్టే అక్కడ జన్మించాను. మా నాన్నగారు గొప్ప రామభక్తుడు. ఎవరి నుండీ ఏమీ స్వీకరించరు. మా అమ్మ కరుణామూర్తి. ఇంటికి వచ్చిన వారందరికీ అవసరమైనవన్నీ చేసి పెట్టడమే కాక తప్పనిసరిగా భోజనం పెట్టేది. ఎంతో సరళస్వభావురాలు. నా తల్లిదండ్రులు అటువంటి సజ్జనులైన వారు కాబట్టే వారి ఇంటిలో నేను జన్మించాను! (శా.వ. 279)

***58 ప్రశ్న: అమ్మా! నాకు డబ్బు సంపాదించడంతో పాటు, తీర్థయాత్రలు చేయడం, తపస్సాధనలు చేయడం కూడా ఇష్టం. మా ఇంట్లో వాళ్ళు ప్రస్తుతానికి డబ్బు సంపాదించు, మిగిలినవన్నీ ఇప్పుడు దేనికి, పెద్దవాడివైన తర్వాత చేసుకోవచ్చులే అంటున్నారు. మీ సలహా ఏమిటమ్మా?***

అమ్మ: నాయనా! నీవు చెప్పినవన్నీ వయసులో ఉండగానే చేయాలి. వృద్ధాప్యంలో కఫమూ, జలుబూ, ఇతర వ్యాధులూ

పట్టి పీడిస్తూ ఉంటాయి. శరీరం కూడా కొద్దిపాటి శ్రమకే అలసిపోతూ ఉంటుంది. మనస్సు ఉత్సాహాన్ని కోల్పోతుంది. అటువంటి స్థితిలో ఏదైనా సాధించగలవా? నా విషయంలో అదే జరిగింది. కాశీ, బృందావనం మొదలైన తీర్థస్థలాలన్నింటినీ ప్రాయంలో ఉన్నప్పుడే దర్శించాను కాబట్టి అక్కడ అన్నిచోట్లకూ కాలినడకన వెళ్ళగలిగాను. కానీ ప్రస్తుతం ఈ ముసలితనంలో కాస్త దూరం వెళ్ళాలన్నా పల్లకీ కావలసి వస్తున్నది. నాయనా! అందుచేత ఈ తరుణంలోనే నీవు చేయాలనుకున్నదంతా చెయ్యి! (శా.వ. 316, 317)

***59 ప్రశ్న: అమ్మా! నా భర్త ఈ మధ్యనే మరణించారు. నా భర్త ఆస్తి విషయంలో చాలా చిక్కులు తలెత్తాయి. ఆయన వీలునామా దొరకలేదు. ఈ గడ్డు సమస్య నుంచి బయటపడడం ఎలా?***

అమ్మ: చూడమ్మా! ఆస్తి విక్రయించడానికి నీకు హక్కులేని పక్షంలో నమ్మకస్థుడైన ఒక మంచి మనిషి అజమాయిషీ క్రింద దానిని వదిలిపెట్టు. లౌకికులను నమ్మలేము? నిజమైన సాధువులే ధనలోభానికి అతీతులు. అమ్మాయీ! మరీ అంతగా ఆందోళన చెందవద్దు. భగవత్సంకల్పం ప్రకారమే అంతా జరుగుతుంది. నువ్వు ధర్మమార్గంలోనే నడుచుకుంటున్నావు కదా! గురుదేవులు నిన్ను తప్పక కరుణిస్తారు. (శా.వ. 68)

***60 ప్రశ్న: అమ్మా! మా స్నేహితురాలి అత్తగారు ఆమెతో అతి కఠినంగా ప్రవర్తిస్తుంది. అదేమంటే ఆమెకు శిక్షణ ఇవ్వాలి కదా అంటోంది. ఈ విషయం గురించి మీరేమి చెపుతారు?***

అమ్మ: లేదమ్మా! అది మంచి పని కాదు. అంత కాఠిన్యం అసలు పనికిరాదు. ఒక కంట కాస్త కనిపెట్టి ఉండడం మంచిదే

కానీ కొంత స్వేచ్ఛ కూడా ఇవ్వాలి. ఆమె కోడలు ఇంకా చిన్నపిల్లే కదా. తినాలనీ, మంచి బట్టలు కట్టుకోవాలనీ కోరిక ఉంటుంది కదా! అత్తగారు మితిమీరిన పెత్తనం చలాయిస్తే, కోడలు ఇల్లు విడిచి పారిపోవడానికి పూనుకునే ప్రమాదం ఉంది సుమా! అందుకని జాగ్రత్తగా ఉండాలి. (శా.వ. 74)

***61 ప్రశ్న: అమ్మా! కుటుంబంలో ఎన్నెన్నో సమస్యలు. అవి చాలదన్నట్టు ఆఫీసు పనులు. ఈ అగచాట్ల మధ్య జపధ్యానాలు అసలు సాగటం లేదు. ఎలాంటి పురోగతీ లేదనిపిస్తోంది. ఏమి చేయమంటారు?***

అమ్మ: నాయనా! అలా ఆలోచించకు. పురోగతి ఉందో లేదో నీకెలా తెలుస్తుంది? ఏమి జరిగినా ఫర్వాలేదు. అంతిమ క్షణాల్లో గురుదేవులు వచ్చితీరతారు. ఆ విషయం ఆయనే స్వయంగా సెలవిచ్చారు కదా! ఆయన మాటలు వ్యర్థమవుతాయా? శక్తి మేరకు జపధ్యానాలు చేస్తూ జీవితం గడుపు. పురోగతి లేదనుకోకు. దాని గురించి తెలియడం లేదని జపధ్యానాలు మానకు. (శా.వ. 401)

***62 ప్రశ్న: అమ్మా! ఈ ప్రపంచంలో సమగ్రంగా ఏదీ సాధించలేమనీ, ఈ సంసారంలోని లౌకిక బంధాలనుంచి విడివడలేమనీ అనిపిస్తోంది. ఏమి చేయాలమ్మా?***

అమ్మ: ఈ ప్రపంచం ఒక పెద్ద బురద గుంట. దానిలోనుంచి బయటపడడం చాలా కష్టం. బ్రహ్మవిష్ణువులు కూడా అందులో పడి ఉక్కిరిబిక్కిరవుతారు. ఇంక మనిషి గురించి చెప్పేదేముంది? భగవంతుని పవిత్రనామాన్ని స్మరిస్తూ ఉండు. నామజపం చేస్తూ ఉంటే ఆయనే ఏదోవొక రోజున నిన్ను ఈ బంధాలనుంచి విడిపిస్తారు. ఆయనే స్వయంగా

విడిపించకపోతే ఎవరికైనా ముక్తి పొందడం సాధ్యమవుతుందా? ఆయన మీద అచంచల విశ్వాసాన్ని పెంపొందించుకో! బిడ్డలకు ఏ విధంగా తల్లిదండ్రులు ఆశ్రయమో, అదే విధంగా గురుదేవులను నువ్వు భావించు. (శా.వ. 101)

***63 ప్రశ్న: అమ్మా! నాకు ఒక్కడే కొడుకు ఉన్నాడు. అతడు వివాహం చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. ఏం చేయమంటారో చెప్పండి?***

అమ్మ: ఈ రోజుల్లో యువకులు ఇలా మాట్లాడడం నాగరికమై పోయింది. వివాహం ఎందుకు చేసుకోకూడదు? వివాహం చేసుకుంటే ఆధ్యాత్మిక జీవితం గడపలేమా? అంతా మనస్సుకు సంబంధించిందే కదా! గురుదేవులు నన్ను వివాహం చేసుకోలేదా? ఒకవేళ ఏ బాదరబందీ లేకుండా హాయిగా జీవించాలనుకుంటున్నాడేమో! కష్టాలు, కడగండ్ల మధ్యలో కూడా ఎవరైతే భగవంతుణ్ణి వదలకుండా పట్టుకుంటారో వారే తప్పకుండా ఆయనను పొందుతారు. ఇక సన్న్యాసుల విషయమంటావా? అది అంత తేలిక కాదు. అత్యున్నత ఆధ్యాత్మిక స్థితిలో ఉన్నవారు మాత్రమే సన్న్యాసులై సమస్త బంధాలనూ త్రెంచివేసుకుని ముందుకు పోగలుగుతారు. కొందరు సుఖదుఃఖాలను పూర్తిగా అనుభవించడమే మంచిదని నేనంటాను. అయితే, గురుదేవుల సహచరుల విషయం మాత్రం వేరు. (శా.వ. 137)

***64 ప్రశ్న: అమ్మా! ఇంటి పనుల ఒత్తిడివలన మీ దగ్గరికి తరచూ రాలేకపోతున్నాను. అందువలన నా మనస్సు ఎంతో ఆవేదనకు గురవుతున్నది. నా ఆవేదన తీరేదెలాగమ్మా?***

అమ్మ: అమ్మాయీ! ఎందుకు కలత చెందుతావు? సంసారభారాన్ని కూడా గురుదేవులే కదా ఇచ్చారు? సంసారపు పనులను చేయడం మీ కర్తవ్యం. పనులు పూర్తయినప్పుడే కదా ఇక్కడికి రావడం కుదిరేది? కోరినంత మాత్రాన అంతా జరిగిపోతుందా తల్లీ? కోర్కెలు ఈడేరటం మన చేతుల్లో లేదు. భగవత్సంకల్పం ప్రకారమే అంతా జరుగుతుంది. (శా.వ. 150)

***65 ప్రశ్న: అమ్మా! కొందరు పిల్లలు మందకొడిగా ఉంటారు. వారిలో ఉత్సాహాన్ని పెంపొందించడం ఎలా? వారిని కూడా మామూలు పిల్లలలాగా పెంచడమెలా?***

అమ్మ: ఇదేం చోద్యం! పిల్లల మనస్తత్వాలను ఎలా గ్రహించాలో తల్లులైన మీకు నేను నేర్పించాలా? పిల్లలతో సహజంగా మెలగాలి. సరళంగా మాట్లాడాలి. సమ వయస్కులైన పిల్లలతో ఆడుకోనివ్వాలి. ఎక్కువగా తిట్టకూడదు, కసురుకోకూడదు. ఎక్కువగా గద్దించడం వలన, కొట్టడం వలన పిల్లలు మరింత మందకొడిగా తయారవుతారు. మీకు దూరమవుతారు. చెప్పవలసింది ప్రేమగా చెప్తే, వారు సులభంగా గ్రహిస్తారు. వారు ఏమైనా ప్రశ్నించినపుడు గదమాయించడమో, బెదిరించడమో, తిట్టడమో చేస్తే వారి మనస్సులు కూడా స్వాభావికంగా, సహజంగా వికసించవు సుమా! (శా.వ. 150,151)

***66 ప్రశ్న: అమ్మా! నా బిడ్డ మంచిచెడులన్నీ మీ చేతుల్లోనే ఉన్నాయి. వాణ్ణి వివాహం చేసుకోమంటారా, లేదా చెప్పండి?***

అమ్మ: నేను కచ్చితంగా చెపుతున్నాను. అతణ్ణి వివాహం చేసుకోనీ – అన్నింటినీ అనుభవించనీ! లేకుంటే, ఎక్కణ్ణుంచి ఏ

కోరిక అంకురిస్తుందో ఎవరి కెరుక? కానీ ఒక్క విషయం మాత్రం నేను స్పష్టంగా చెప్పగలను. గురుదేవులు ఒక వ్యక్తిని పట్టుకున్నారంటే, ఆ వ్యక్తికి ఇక పతనం ఉండదు. నువ్వు స్థిమితంగా ఉండు. గురుదేవులు అనుగ్రహించిన సిద్ధమంత్రం అతడికి నేను ఉపదేశించాను. ఇక అతడికి ఏ కీడైనా వాటిల్లుతుందా ఏమిటి? (శా.వ. 137,138)

***67 ప్రశ్న: అమ్మా! ఎవరైనా తప్పు చేశారని అనిపించినపుడు, వారిని తీవ్రంగా మందలించడం, చీవాట్లు పెట్టడం నా స్వభావంగా తయారైంది. ఏమి చేయమంటారు?***

అమ్మ: అదేంటి నాయనా! ఇతరుల మనస్సు నొచ్చుకొనేలా మాట్లాడవచ్చా? వారు నిజంగా తప్పు చేసినప్పటికీ, వారి మనస్సుకు బాధ కలిగేలా మాట్లాడకూడదు. ఇలాగే కొనసాగిస్తే, చివరకు అదే నీ స్వభావంగా మారిపోతుంది సుమా! సున్నితత్వాన్ని కోల్పోతే, నీ మాటలకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. ఒక కుంటివాణ్ణి అతడెలా కుంటి వాడయ్యాడని అడగాలనుకుంటే, 'నువ్వెలా కుంటివాడి వయ్యావ'ని అడుగకూడదనీ, సమయం, సందర్భం చూసుకుని సున్నితంగా అడగాలనీ గురుదేవులు చెప్పేవారు. (శా.వ. 481)

## 05. కష్టాలు, కడగండ్లు

***68 ప్రశ్న: అమ్మా! మా కష్టాలకు, దుఃఖాలకు అంతు లేకుండా ఉంది. భగవంతుణ్ణి ఎంత ప్రార్థించినా మా దుఃఖాలు తొలగిపోవడం లేదు. మేము ఏమి చేయాలి?***

అమ్మ: నాయనా! ఇదే మాట ప్రతివొక్కరూ అంటూ ఉంటారు. కానీ దుఃఖం అనేది కూడా భగవంతుని వర ప్రసాదమే కదా! అది కూడా ఆయన కరుణకు చిహ్నమే కదా! ఈ లోకంలో దుఃఖాలు అనుభవించని వారెవరున్నారు? కృష్ణుడితో బృంద (ఒక గోపిక) ఇలా అన్నది: "నీవు కరుణా మూర్తివని అన్నదెవరు? నిన్ను ఆశ్రయించిన వారందరూ కష్టాలలో మునిగితేలిన వారే కదా! రామావతారంలో సీతను ఏడిపించావు! ఇక కృష్ణావతారంలో నీ తల్లిదండ్రులు కంసుడి చెరసాలలో పడరాని బాధలు పడుతూ, రేయింబవళ్ళూ నీ నామస్మరణ చేస్తూ విలపించారు. ఇది తెలిసి కూడా నీ నామస్మరణ ఎందుకు చేస్తానో తెలుసా? అది మరణభయాన్ని తొలగించి వేస్తుంది కనుక." కాబట్టి, కష్టాలు ఉన్నాయి కదా అని భగవంతుని నామస్మరణ మానకూడదు! (శా.వ. 246)

***69 ప్రశ్న: అమ్మా! నేను ఒక స్నేహితురాలితో చాలా సన్నిహితంగా, ప్రేమగా ఉండేదానిని. ఒకరంటే ఒకరికి ప్రాణం. కానీ ఈ మధ్య మా ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు వచ్చి మనస్తాపం కలుగుతున్నది. ఏమి చేయమంటారు?***

అమ్మ: ఇదుగో చూడమ్మా! మనుష్యులను ప్రేమిస్తే దుఃఖాలనూ, కష్టాలనూ అనుభవించి తీరాలి. భగవంతుణ్ణి

నిజంగా ప్రేమించగలిగిన వారే భాగ్యవంతులు. అటువంటి వారికి కష్టమూ, దుఃఖమూ ఉండవు. (శా.వ. 487)

***70 ప్రశ్న: అమ్మా! ఈ సంసారంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని, దుఃఖాల పాలవుతున్నాము. వీటిని తట్టుకోవడం ఎలా?***

అమ్మ: జీవితంలో నువ్వు వేసే ప్రతి అడుగులోనూ గురుదేవులను స్మరించు. ఎలాంటి కష్టమైనా సరే నీకు దుర్భరమని అనిపించదు. అసలు ఏ దుఃఖాలూ, కష్టాలూ లేని వారు ఎవరైనా ఉన్నారా? అందరి జీవితాల్లోనూ అవి ఉండనే ఉంటాయి. ఆయన పవిత్రనామాన్ని జపించు. ఆయనను శరణువేడి జీవితాన్ని సాగించు. అప్పుడు ఆయన నీకు శక్తిని ప్రసాదిస్తాడు. ఇక, కష్టాలూ, దుఃఖాలూ, సమస్యలూ - ఏవీ నిన్ను కలతపెట్టలేవు సుమా! (శా.వ. 101)

***71 ప్రశ్న: అమ్మా! గురుదేవులు కామకాంచన పరిత్యాగాన్ని పదేపదే వక్కాణించేవారు. సంసార జీవితం గడుపుతున్న మాలాంటి వారు ఆయన చెప్పినట్టు చేయలేము కదా! సంసార జీవితం గడుపుతున్న మమ్మల్ని గురుదేవులు ప్రేమించరా? మమ్మల్ని వదిలేస్తారా?***

అమ్మ: అవేం మాటలు నాయనా! అసలు అటువంటి ఆలోచన నీకెలా వచ్చింది? ఇది సత్యదూరం. సన్న్యాసులకంటే గృహస్థుల కోసమే ఆయన ఎక్కువగా ఆరాటపడ్డారు. గృహస్థులు సంసారమనే వలలో చిక్కుకుని బయటపడలేక, ఎన్నెన్నో కష్టాలు పడుతూ, భగవంతుని కోసం పరితపిస్తున్నారనీ ఆవేదన చెందుతూ వారి మనస్సులను భక్తితో నింపమని ఆయనే స్వయంగా జగజ్జననిని ప్రార్థించేవారు. నిజమైన భక్తి

గల గృహస్థులను ఆయన ఎంతో అభిమానించేవారు. ఆయన అందరినీ ప్రేమిస్తారు. ఎవరినీ వదలరు సుమా! (శా.వ. 481)

***72 ప్రశ్న: అమ్మా! భగవంతుడే ఉండివుంటే ఈ లోకంలో ఇంత దుఃఖమూ, ఇన్ని కష్టాలూ ఎందుకున్నాయి? ఆయన వీటన్నింటినీ పట్టించుకోడా? వీటిని తొలగించే శక్తి ఆయనకు లేదా?***

అమ్మ: నాయనా! అంతా భగవంతుని లీల. ఆయన పట్టించుకోకపోతే సృష్టి ఎలా జరుగుతుంది? ఎలా నిర్వహించబడుతుంది? ఈ సృష్టి అంతా సుఖదుఃఖాలతో కూడుకున్నదే. సృష్టిలో అసలు దుఃఖమనేదే లేకపోతే, సుఖం విలువ మనుష్యులకు తెలుస్తుందా? అందరూ కష్టాలు, దుఃఖాలు లేకుండా పూర్తిగా సంతోషంగా ఉండడం సాధ్య మవుతుందా?

అన్నివేళలా సంతోషంగా ఉండేవారు ఎవరైనా ఉంటారా? అలాగే నిరంతరం దుఃఖాన్ని అనుభవించేవారు కూడా ఎవరూ ఉండరు. (వంతెన క్రింద నీరు కదలిపోయినట్లు సుఖదుఃఖాలు కూడా కదిలిపోతాయి.) కర్మకు తగ్గట్టే ఫలితం ఉంటుంది, అవకాశాలు లభిస్తాయి. అంతేకానీ మన సుఖదుఃఖాలకు భగవంతుణ్ణి నిందించడం సరి కాదు సుమా! (శా.వ. 246)

***73 ప్రశ్న: అమ్మా! నాకు ఐదుగురు కుమార్తెలు. వారికి వివాహాలు చేయలేకుండా ఉన్నాను. ఇదే నాకు ఎంతో ఆందోళన కలిగిస్తోంది. నాకేది మార్గం?***

అమ్మ: వివాహాలు చేయలేకపోతున్నావని ఎందుకు ఇంత బాధపడుతున్నావు? వారిని నివేదిత పాఠశాలకు పంపించు. చదవడం, వ్రాయడం, ఇతర చేతివృత్తులు నేర్చుకుని బాగుపడతారు. తమ కాళ్ళ మీద తాము నిలబడగలుగుతారు. (శా.వ. 19)

***74 ప్రశ్న: అమ్మా! మీ సమక్షంలో ఉన్నంతసేపూ అన్నీ బాగానే ఉంటాయి. ఎటువంటి చీకూచింతా ఉండవు. కానీ ఇంటికి వెళ్ళిన మరుక్షణమే అన్ని దురాలోచనలూ చెలరేగుతున్నాయి. దుష్టస్నేహాలూ, దుర్మార్గాలూ, అన్నీ మొదలవుతున్నాయి. ఎంత ప్రయత్నించినా వాటి బారినుంచి బయట పడలేకపోతున్నాను. ఎందుకిలా జరుగుతోంది? దీనికి పరిష్కారమేమిటమ్మా? నేను పాతాళానికి క్రుంగిపోవలసిందేనా?***

అమ్మ: నాయనా! దీనికంతటికీ కారణం గతజన్మల సంస్కారమే! వాటి మూలంగానే ఇవన్నీ జరుగుతాయి. వాటిని బలవంతంగా తరిమివేయటం చాలా కష్టం. కానీ కంగారు పడనక్కరలేదు. సత్సాంగత్యంతో, సజ్జనుడిగా జీవించడానికి దృఢంగా ప్రయత్నించు. అంతా చక్కబడుతుంది. గురుదేవులను ప్రార్థించు. నేను కూడా ఉన్నాను కదా! భయమెందుకు? సరైన సమయంలో ఆయనే సమస్తమూ పరిష్కరిస్తారు. (శా.వ. 183)

***75 ప్రశ్న: మా కష్టాలను గురుదేవులు గమనించరా? ఆదుకోరా?***

అమ్మ: గురుదేవులు భక్తులందరి కష్టాలనూ గమనిస్తారు. ఆదుకుంటారు. కానీ నీలాంటివారు ఆయనకు ఎంతోమంది ఉన్నారు. అందరినీ సంబాళించాలి కదా! ఆయన ఎప్పుడూ ఇలా అంటూ ఉండేవారు. "ఇది చైతన్యమయ ఆనందసాగరం. దీనిలో ఎన్నో అలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి, పడిపోతున్నాయి. దీనికి అంతమే లేదు." కష్టకాలంలో గురుదేవులు దర్శనమివ్వకపోతే, చేయూతనివ్వకపోతే మనిషి ఎక్కడికి పోతాడు? కాబట్టి ఆ విషయంలో సందేహపడనక్కరలేదు. (శా.వ. 277)

## 06. కర్మ - పునర్జన్మ

***76 ప్రశ్న: అమ్మా! మునుపు బ్రహ్మానందస్వామి (రాఖాల్) ఉద్బోధన్ గృహంలో (అమ్మ నివాసం ఉండే గృహం) ఒక పిశాచాన్ని చూశారట కదా! ఆ విషయం గురించి మీరేమి చెపుతారు?***

అమ్మ: గట్టిగా మాట్లాడకమ్మా! అందరూ భయపడతారు. గురుదేవులు ఇలాంటివెన్నో చూశారు. ఒకసారి ఆయన రాఖాల్‌తోపాటు వేణీపాల్ ఉద్యానగృహానికి వెళ్ళారు. అక్కడుంటున్న ఒక పిశాచం ఆయన వద్దకు వచ్చి "నువ్వెందుకు ఇక్కడికి వచ్చావు? మేము దహించుకు పోతున్నాం. నువ్వు ఇక్కడ ఉండడం మేము భరించలేకుండా ఉన్నాము. వెళ్ళిపో! ఇక్కడ నుంచి వెళ్ళిపో!" అని అభ్యర్థించింది. గురుదేవులు ఎవరితోనూ ఏమీ చెప్పకుండా రాఖాల్‌ను వెంటబెట్టుకుని ఆ రాత్రే తిరిగివచ్చారు. నువ్వు ఆ పిశాచాలు పరమమూర్ఖమైనవనీ, గురుదేవులను ముక్తినివ్వమని కోరి ఉండవచ్చు గదా అంటున్నావు కానీ గురుదేవులను దర్శించిన తర్వాత ప్రత్యేకంగా ముక్తిని యాచించాలా? (శా.వ. 70, 71)

***77 ప్రశ్న: అమ్మా! కాలగతిలో ఎవరికి ఏమి జరగాలో అది జరిగి తీరుతుందని అంటారు కదా! దానిని వివరించండి!***

అమ్మ: నువ్వు చెప్పింది సరైనదే నాయనా! కాలగతిలో దేవుడి ఉనికి కూడా మిథ్యేననిపిస్తుంది. జ్ఞానం సంతరించుకున్న తరువాత దేవీదేవతలన్నీ మాయ అని అర్థమవుతాయి. ప్రతిదీ కాలగతిలో జనించి, కాలగతిలో కనుమరుగయ్యేదే అని జ్ఞానం పొందాక మనిషి గ్రహిస్తాడు. (శా.వ. 250)

***78 ప్రశ్న: అమ్మా! కాశీలో మరణించే వ్యక్తి ముక్తి పొందుతాడా? శరణు జొచ్చనివారికీ, భక్తులు కాని వారికీ, ఇతర మతస్థులకీ కూడా ముక్తి లభిస్తుందా?***

అమ్మ: శాస్త్రాలు అలాగే చెపుతున్నాయి. ఆ నమ్మకంతోనే ఎందరో వస్తున్నారు. భగవంతుణ్ణి పొందిన వ్యక్తికి ముక్తి కాక మరేం లభిస్తుంది? ఇక్కడ నివసించే అందరికీ ముక్తి లభిస్తుంది. కాశీ దివ్యచైతన్యంతో విరాజిల్లే స్థలం. ఇక్కడి క్రిమికీటకాదులతో సహా సకల ప్రాణికోటి దివ్యచైతన్యంతో తొణికిసలాడుతున్నాయి. భక్తుడు, భక్తుడు కానివాడు, పరాయి మతస్థుడు, పశుపక్ష్యాదులతో సహా ఇక్కడ తుదిశ్వాస వదిలే వారికెవరికైనా సరే ముక్తి తథ్యం. అంతదాకా ఎందుకు? నీ చేతి మీద వాలిన ఈ ఈగకు కూడా ముక్తి లభిస్తుంది! (శా.వ. 293)

***79 ప్రశ్న: అమ్మా! కాశీలో మరణించిన వారికెవరికైనా ముక్తి వస్తుందని మీరు చెపుతున్నారు. కానీ నాకు ప్రత్యక్షదర్శనం కలిగితే కదా, నమ్మకం కలిగేది?***

అమ్మ: నాయనా! మహాత్ముల వచనాల పట్ల విశ్వాసం లేకపోతే ఏమి చేయగలుగుతాము? ఋషులు, మునులు బోధించిన, అనుసరించిన మార్గం తప్ప మరోమార్గం ఉందా ఏమిటి? అంతేకాక నీకు విశ్వాసం ఉంటే ఎంత, లేకపోతే ఎంత? భగవంతుడు నిన్ను లెక్కచేస్తాడా? గురుదేవులు భగవంతుణ్ణి ప్రత్యక్షంగా దర్శించారు. ఆయన సమస్తమూ చూశారు. ఆయన సర్వజ్ఞుడు. ఆయన వాక్కు వేదవాక్కు. ఆయన మాటలు విశ్వసించకపోతే మరేం చేస్తావు? (శా.వ. 294)

***80 ప్రశ్న: అమ్మా! ఇదివరకు మఠానికి ఎప్పుడూ వచ్చే బాబు ఇప్పుడసలు రావడం లేదు. అతడు ఎన్నాళ్ళుగానో భక్తుడు.***

***మీరిక్కడున్నారని చెప్పినా, మిమ్మల్ని చూడడానికి కూడా రాలేదు. అతడు ఇలా ఎందుకు చేస్తున్నాడు?***

అమ్మ: అంతా ప్రారబ్ధకర్మ నాయనా! ఎన్నో జన్మల కర్మఫలం బాకీ ఉంది. ఇప్పుడు వాటిని అనుభవించవలసి ఉంది. అలలన్నీ అణిగిపోతే ఈ జన్మలోనే ముక్తి లభిస్తుంది. అంతదాకా అతడు ఇలాగే ప్రవర్తిస్తూ ఉంటాడు. (శా.వ. 398)

***81 ప్రశ్న: అమ్మా! ఈ జన్మలోని కార్యాచరణకు పూర్వజన్మలే కారణం అంటారు. ఇక ముందు జన్మ యొక్క కర్మ దానికంటే ముందటి జన్మ మీద ఆధారపడి వుంది. ఇలా కొనసాగుతూనే ఉంటుంది. అయితే దీనికి ప్రారంభం ఏది?***

అమ్మ: నాయనా! భగవంతుని సంకల్పమే వీటన్నిటికీ మూలం. ఆయన సంకల్పం లేకుండా ఏదీ జరగదు. ఒక ఆకు కూడా కదలదు. కర్మలన్నింటికీ – అవి సత్కర్మలు కానీ, దుష్కర్మలు కానీ – భగవత్సంకల్పం మేరకే సమయం ఆసన్న మైనప్పుడు జరుగుతాయి. మనిషి చేతల ద్వారా భగవంతుడు తన సంకల్పాన్ని వ్యక్తీకరిస్తాడు. మన కర్మలే మన వెంట వస్తాయి. సత్కర్మల ద్వారా పాపాలను తగ్గించుకోవచ్చు, అలాగే దుష్కర్మల ఫలాలను రద్దు చేయవచ్చు. క్రమక్రమంగా జన్మ పరంపరల నుంచి విముక్తి పొందవచ్చు. (శా.వ. 247)

***82 ప్రశ్న: అమ్మా! అయితే మరి భగవదనుగ్రహంలో కూడా పక్షపాతం ఉన్నట్లే కదా?***

అమ్మ: లేకేం నాయనా! ఉంది. అయితే అది ప్రారబ్ధకర్మను అనుసరించి ఉంటుంది. కర్మఫలం తీరగానే మోక్షం కలుగు తుంది. అదే ఆ వ్యక్తికి ఆఖరి జన్మ అవుతుంది. (శా.వ. 265)

***83 ప్రశ్న: అమ్మా! ప్రారబ్ధకర్మను అనుభవించి తీరాలని శాస్త్రాలు చెపుతున్నాయి కదా. అటువంటప్పుడు కర్మఫలాన్ని రద్దుచేయడం సాధ్యమేనా? భగవంతుని పవిత్రనామాన్ని ఉచ్చరించడం ద్వారా పూర్వజన్మకర్మలను నశింపజేసుకోవచ్చా?***

అమ్మ: నాయనా! కర్మఫలం అనివార్యం. దానిని అనుభవించి తీరాలి. కానీ భగవన్నామ జపం చేస్తే, దాని తీవ్రతను తగ్గించుకోవచ్చు. అదెలాగంటే, నాగలి దిగబడితే ఎంత గాయమవుతుందో అంత గాయం అవ్వాలని రాసి ఉంటే, దానికి మారుగా సూది గుచ్చుకున్నంత గాయమే అవుతుంది. జపం వల్ల కర్మఫలం యొక్క తీవ్రత చాలావరకూ తగ్గుతుంది.

గురుదేవులు కూడా వారి అన్నగారి శాపఫలితంగా కర్మఫలాన్ని అనుభవించవలసి వచ్చింది. దాని వలననే ఆయన వ్యాధిగ్రస్తులయ్యారు. అపుడు నేను, "మీకే ఇలా అయితే, ఇక సామాన్యులు ఎలా జీవించగలరు?" అని అడిగాను. అందుకు ఆయన, "నా సోదరుడు ధార్మికుడు కాబట్టి ఆయన మాటలు అసత్యం కావు. అందరి వాక్కూ అలా ఫలిస్తుందా ఏమిటి?" అన్నారు. కాబట్టి, నాయనా! కర్మఫలాన్ని ఎవరైనా సరే, అనుభవించక తప్పదు. కానీ దాని తీవ్రతను తగ్గించుకోవడం మన ప్రయత్నంలోనే ఉంటుంది సుమా! (శా.వ. 283)

***84 ప్రశ్న: అమ్మా! మేము సన్యాసం తీసుకుని, పవిత్రమైన ధార్మికజీవితం గడుపుతున్నప్పటికీ, ఇన్ని శారీరక రుగ్మతలతో ఎందుకు బాధపడుతున్నాం?***

అమ్మ: నాయనా! మీకిదే ఆఖరి జన్మ. అందుకే గత జన్మల కర్మఫలాన్నంతా ఈ జన్మలో శారీరక రుగ్మతల రూపంలో అనుభవించి తీర్చివేసుకుంటున్నారు. తెలిసిందా? (శా.వ. 291)

## 07. సమాజం - సమాజసేవ

***85 ప్రశ్న: అమ్మా! మన వైద్యశాల పేదల కోసం నెలకొల్పబడింది. కానీ, బాగా స్తోమత ఉన్న ధనికులు కూడా మన వైద్యశాలకు వచ్చి ఉచితంగా మందులు తీసుకుంటున్నారు. వారిని అనుమతించవచ్చా?***

అమ్మ: నాయనా! ఆశ్రమం గురించి తెలిసినప్పటికీ, ఆర్థిక స్తోమత ఉన్నవారు కూడా ఉచితంగా ఇచ్చే మందుల కోసం వస్తే, వారికి చేతనైనంత సేవ చేయండి. యాచకుడెవడైనా పేదవాడే కదా! (శా.వ. 334)

***86 ప్రశ్న: అమ్మా! మన దేశానికి పట్టిన ఈ కష్టకాలానికి అంతమే లేదా?***

అమ్మ: ఎందుకు లేదు నాయనా? అందు నిమిత్తమే కదా గురుదేవుల రాక. గురుదేవుల నిర్యాణానంతరం నేను కూడా వెళ్ళిపోవాలనుకున్నాను. అప్పుడాయన నాకు కనిపించి “నువ్వు అప్పుడే వెళ్ళిపోకూడదు. కొంతకాలం ఉండి తీరాలి. ఇంకా నువ్వు చేయవలసిన పనులు ఎన్నో ఉన్నాయి. కలకత్తావాసులు పురుగుల లాగా చీకట్లో ప్రాకుతూ పడి వున్నారు. నువ్వు వారిని ఉద్ధరించాలి” అన్నారు. అందుచేత గురుదేవుల ఆశీస్సులతో దేశం సత్యయుగంలోకి ప్రవేశించింది సుమా! (శా.వ. 228)

***87 ప్రశ్న: అమ్మా! మీరు మహమ్మదీయుల పండగలలో ఎందుకు మొక్కుకుంటారు. అక్కడ నివేదించడానికి తీపిపదార్థాలెందుకు మసీదుకు పంపుతారు?***

అమ్మ: నాయనా! హిందువులకు, మహమ్మదీయులకు దేవుళ్ళు విడివిడిగా ఉన్నారనుకుంటున్నారా? అందరికీ దేవుడు ఒక్కడే కదా! గురుదేవులు ఇస్లాం మత సాధనలు చేశారు. నమాజ్ కూడా చేశారు! అంతా ఒక్కటే నాయనా, పేరులోనే తేడా! నాకైతే అసలు ఆ తేడాలేవీ కనిపించవు. (శా.వ. 209)

***88 ప్రశ్న: అమ్మా! గుజరాత్‌లోని సోమనాథ దేవాలయంలోని విగ్రహాలను సుల్తాన్ మహమ్మద్ ధ్వంసం చేసి, చందనపు చెక్కలతో చేసిన ఆలయం తలుపులను తరలించుకు పోయాడు. అలాగే ఎన్నెన్నో దేవాలయాలను, దేవీదేవతల విగ్రహాలను మహమ్మదీయులు ధ్వంసం చేశారు. ఇలా ఎందుకు జరిగింది?***

అమ్మ: నాయనా! సంకల్పమాత్రాన సమస్తం సాధించగల శక్తిమంతుడు భగవంతుడు. వీటన్నింటినీ భగవంతుని లీలలుగా, క్రీడలుగా మనం పరిగణించాలి. ఇంకొక విషయం చెప్పనా? మహమ్మదీయుల దండయాత్రలకు భయపడి బృందావనంలోని గోవిందజీ విగ్రహాన్ని జయపూర్‌కు తరలించారు. వాళ్ళ దండయాత్రలు పూర్తి అయిన తర్వాత గోవిందజీ ఆలయపూజారులు ఆ విగ్రహాన్ని జయపూర్ నుంచి తిరిగి తీసుకురావడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు ఒక దివ్యవాణి ఇలా వినిపించింది – “విగ్రహాన్ని మాత్రమే కదా వారు తరలించారు. నేను మాత్రం ఎక్కడికీ వెళ్ళలేదు. ఇక్కడే మరొక విగ్రహాన్ని రూపొందించండి. దానిలో నేను నెలకొంటాను!” ఆ విధంగా భగవంతుడు ఎప్పుడు, ఏమి చేయదలచుకున్నాడో దానిని చేస్తాడు. (శా.వ. 283)

***89 ప్రశ్న: అమ్మా! మహమ్మదీయుల పాలనలో అనేక దురాగతాలు జరిగాయి. దేవాలయాలు ధ్వంసమయ్యాయి. వాటిని అరికట్టడానికి భగవంతుడు ఏమి చేశాడు?***

అమ్మ: నాయనా! దేవునికి అనంతమైన సహనం ఉంది. రాత్రింబవళ్ళూ శివలింగం మీద బిందెలకొద్దీ నీళ్ళు పోసి భక్తులు ఆయనను ఆరాధిస్తున్నారు. అది ఆయనను బాధించిందా? వస్త్రంతో కప్పి ఉంచి పూజలు చేస్తారు. అదేమన్నా ఆయనకు కష్టం కలిగించిందా? ఎల్లలెరుగని సహనం ఆయనది. ఈ దురాగతాలు అనేవి మనకే బాధ కలిగిస్తాయి. కానీ భగవంతుడివేమీ లెక్కచేయడు. (శా.వ. 292)

***90 ప్రశ్న (శాంతానంద): కాబూల్‌లో గొప్ప యుద్ధం జరుగుతోంది. యుద్ధం వలన ఎన్నెన్ని కష్టాలు, దుఃఖాలు? ఇదంతా ఏమిటమ్మా? ఎందుకిలా జరుగుతోంది?***

అమ్మ: నాయనా! పాలకుడి పాపం దేశాన్ని నాశనం చేస్తుంది. వంచన, మోసం, సజ్జనులను చంపడం మొదలైన వన్నీ పాపాలు. పాలకుడే పాపానికి పాల్పడితే ప్రజల బాధలకు అంతుండదు. వాటి పర్యవసానమే యుద్ధం, భూకంపం, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాలు. అన్ని వర్గాలూ కొంత శాంతించినపుడే యుద్ధం పరిసమాప్తమవుతుంది. (శా.వ. 106)

## 08. తీర్థయాత్రలు

***91 ప్రశ్న: అమ్మా! తిథివారనక్షత్రాలు చూడకుండా తీర్థస్థలాలకు వెడితే, అప్పటికే సముపార్జించిన పుణ్యమంతా హరించుకు పోతుందని అంటారు. అదే సమయంలో, సత్కార్యాలను వాయిదా వేయకూడదని కూడా చెపుతారు. ఇటువంటి సందర్భాలలో ఏమి చేయాలి?***

అమ్మ: నాయనా! అకాలసమయాలలో తీర్థయాత్రలకు వెళ్ళకూడదని కొందరంటారు. కానీ ఒక విషయం గమనించు. వారంవర్జ్యం కోసం సత్కార్యాలను వాయిదా వేయవచ్చునేమో కానీ కాలుడు అవన్నీ లెక్క చూసుకుని వస్తాడా? మరణానికి కచ్చితమైన సమయం లేనట్టే, సత్కార్యానికి కూడా ముహూర్తం నిర్ణయించుకోవడం సబబు కాదు. సందర్భం లభించినపుడు మనం తిథివారనక్షత్రాలు చూడకుండా తక్షణమే సత్కార్యాలను నిర్వర్తించాలి. (శా.వ. 179)

***92 ప్రశ్న (స్వామి కేశవానంద - కేదార్‌బాబు): మీరు రామేశ్వరానికి తీర్థయాత్ర చేసి అక్కడి దేవీదేవతల ఛాయాచిత్రాలెన్నింటినో మాకు ఇచ్చారు. ఆశ్రమంలో పెట్టి వాటిని పూజించమంటున్నారు. కానీ మీరే ఆశ్రమంలో గురుదేవులను ప్రతిష్ఠించారు కదా. సర్వదేవదేవీ స్వరూపులైన శ్రీరామకృష్ణులు అక్కడ ఉన్నారు కాబట్టి అక్కడ ఇతర దేవతలను పూజించడం నాకిష్టంలేదు. ఏమి చేయమంటారు?***

అమ్మ: పోనీలే నాయనా! నీకెలా అనిపిస్తే అలా చెయ్యి. నేనిచ్చిన ఈ ఫొటోలకు పూజచేయడం ఇష్టం లేకపోతే, వాటికి పటం కట్టించి పూజగదిలో అలంకరించు చాలు. (శా.వ. 322)

***93 ప్రశ్న: అమ్మా! కాశీ సందర్శనం వల్ల పుణ్యం లభిస్తుందని పెద్దలు అంటారు. కానీ మాబోటి పేదలు కాశీకి వెళ్ళలేరు కదా! మరి మాకు ఆ పుణ్యం ఎలా లభిస్తుంది? (ఈ ప్రశ్న వేసిన భక్తుడు కలకత్తా వాసి.)***

అమ్మ: కాశీకే వెళ్ళాల్సిన అవసరం లేదు. దక్షిణేశ్వరానికో, బేలూరు మఠానికో వెళితే కాశీకి వెళ్ళినంత పుణ్యం వస్తుంది. కానీ దృఢవిశ్వాసం ఉండాలి. కాశీలో ఉన్న దైవమే దక్షిణేశ్వ రంలో, బేలూరుమఠంలో కూడా వెలసివున్నారు! (శా.వ. 194)

***94 ప్రశ్న: అమ్మా! పూరీ జగన్నాథక్షేత్రంలో ఎవరి దివ్యవిగ్రహం వెలిసి ఉంది?***

అమ్మ: అదేమిటో నాయనా! అక్కడ వెలసినది ఈశ్వరుడని కలగన్నాను. ప్రశ్న: అమ్మా! అయితే మీరక్కడ జగన్నాథస్వామి ప్రతిమను చూడలేదా? అమ్మ: లేదు నాయనా! అక్కడ నేను పరమేశ్వరుని దివ్యరూపాన్నే, శివలింగాన్నే చూశాను. లక్ష సాలగ్రామాలతో నిర్మితమైన పీఠం మీద జగన్నాథ శివుడు వెలసి ఉన్నాడు. విమలాదేవి కూడా అక్కడ వెలసి ఉంది. విమలాదేవి అంటే దుర్గాదేవియే కదా! అందువలన అక్కడ వెలసింది పరమేశ్వరుడే! (శా.వ. 282)

***95 ప్రశ్న: అమ్మా! సాధువులు తీర్థయాత్రలు చేయడం మంచిదేనా?***

అమ్మ: మంచిదే కానీ, నాయనా! ఉన్నచోటనే మనస్సు ప్రశాంతంగా ఉండేటట్లయితే ఇక తీర్థయాత్రలు చేయవలసిన పనేముంది? (శా.వ. 394)

## 09. భక్తి - పూజ

***96 ప్రశ్న: అమ్మా! ఎందుకు ఆ పువ్వులను పారవెయ్యమని అంటున్నారు. ఆ పూలు పూజకు పనికిరావా?***

అమ్మ: నాయనా! నేను దూరం నుంచి ఆ భక్తుడు బుట్టలో తామరపువ్వులు తీసుకురావడం చూశాను. అతడు నన్ను చూడగానే ఆ బుట్టతో సహా చేతులు పైకెత్తి నాకు నమస్క రించాడు. అతడు అలా చేయడాన్ని నేను గమనించాను. నాకు ఆ పుష్పాలతోపాటు నమస్కరించాడు కాబట్టి ఆ పూలను గురు దేవులకు అర్పించకూడదు. అందుకే వాటిని తీసేయమన్నాను. గురుదేవుల అర్చనకు ఉపయోగించేవన్నీ అత్యంత పవిత్రంగా, మరొకరికి అర్పించకుండా ఉండాలి సుమా! (శా.వ. 333)

***97 ప్రశ్న: అమ్మా! మీరేమో గురుదేవులకు నైవేద్యం పెట్టమంటున్నారు. నాకేమో ఆ మంత్రాలేవీ తెలియవు. ఎలాగమ్మా?***

అమ్మ: ఇదిగో చూడు అమ్మాయీ! మంత్రాలేవీ తెలియ నక్కరలేదు. ముందు గురుదేవులు నీ సొంతవారని భావించు. ఆ భావంతోనే వారితో, 'రండి! కూర్చోండి! స్వీకరించండి! భోజనం చేయండి!' అని ప్రార్థించు. వారు వచ్చినట్లు, కూర్చు న్నట్లు, ఆహారం తీసుకుంటున్నట్లు భావించు. నీకు సొంతమైన వారికి మంత్రమూ, తంత్రమూ అవసరమా? క్రియలూ, ఉపచారాలూ – ఇవన్నీ బంధువులకు చూపే మర్యాదల లాంటివి. నీకు సొంతమైన వారికి అటువంటి ఉపచారాలూ, మర్యాదలూ ఎందుకు? గురుదేవులకు నీవు ఎలాంటి

మానసికస్థితిలో నైవేద్యాన్ని సమర్పిస్తావో, ఆ మానసికస్థితికి తగినట్టుగా ఆయన దానిని స్వీకరిస్తారు సుమా! (శా.వ. 366, 367)

***98 ప్రశ్న: ప్రేమానంద స్వామి దేహాన్ని వదిలినప్పుడు ఆయన శరీరం కేవలం అస్థిపంజరం అయిపోయింది. ఆయనంతటి మహావ్యక్తికి కూడా అలా ఎందుకు జరిగింది? అంతేకాక, ఆయన దహన సంస్కారాల నిమిత్తం కొందరు భక్తులు నాలుగైదు వందల రూపాయల విలువచేసే గంధపు కట్టెలు, నెయ్యి, సాంబ్రాణి, పూలు, మొదలైనవన్నీ ఇచ్చారు. ఇలా చేయడం మీద మీ అభిప్రాయం ఏమిటి?***

అమ్మ: అమ్మాయీ! దేహాన్ని ధరించి, భూమి మీద జన్మించిన తర్వాత ఎంతటి మహాపురుషులైనా సరే, దేహంతో వచ్చే వ్యాధులన్నింటినీ అనుభవించి తీరాలి. కానీ తేడా ఏమిటంటే – 'సామాన్యుడు శరీరం వదిలి పోయేటప్పుడు ఏడుస్తూ పోతాడు. మహాపురుషుడు చిరునవ్వు చిందిస్తూ పోతాడు. వారికి మరణం ఒక ఆట. ఇక ఆ గంధపు చెక్కలు, మొదలైనవాటి విషయానికి వస్తే, ఆ భక్తులు ధనాన్ని ఒక మంచి పనికి ఖర్చు చేసి తరించారు. వారు ఒక భక్తుని కోసం ఖర్చుపెట్టారు సుమా! ఆ సంపదను భగవంతుడు వారికి ప్రసాదించాడు, ఇంకా ప్రసాదిస్తాడు కూడా! (శా.వ. 62)

***99 ప్రశ్న: అమ్మా! మా అమ్మమ్మ వివిధ దేవతలకు సంబంధించిన మంత్రాలు నేర్పించింది. ఈ దేవతలనందరినీ ఎలా పూజించాలి?***

అమ్మ: అదా నీ సందేహం? అన్ని పూజలకూ నీ ఇష్టదైవపు బీజమంత్రాన్నే ఉపయోగించు. అన్ని దేవీదేవతల రూపం లోనూ అలరారుతున్నది నీ ఇష్టదైవమే కదా. ఇష్టదేవత యొక్క

బీజమంత్రాన్ని ఇతర దేవతల నామంతో కలిపి 'నమః' అనే పదాన్ని కలిపి పూజ ఎలా చేయాలో నీకు నేను నేర్పిస్తాను. అంతేకాదు. నీకు ఏ దేవతనన్నా పూజించాలనిపిస్తే గురు దేవులను పూజిస్తే చాలు. ఎందుకంటే ఇష్టదైవమూ, ఆయనా ఒక్కరే. ఆయనే సర్వదేవదేవీ స్వరూపులు. (శా.వ. 368, 369)

***100 ప్రశ్న: గురుదేవులకు నైవేద్యం సమర్పించే మంత్రమూ, పద్ధతీ నాకు తెలియవు. ఏం చేయాలి?***

అమ్మ: పూజావిధానాలన్నింటినీ తెలుసుకోవలసిన అవసరం లేదు. ఇష్టదేవతా మంత్రాన్ని ఉచ్చరిస్తూనే నైవేద్యం సమర్పించవచ్చు. (శా.వ. 480)

***101 ప్రశ్న: అమ్మా! నేను రోజూ మీకు ఇచ్చే 'షర్బత్'లో పంచదార, పళ్ళరసం సరైన పాళ్ళలో ఉన్నాయో లేదోనని పరీక్షించడానికి మీకిచ్చే ముందు నేను రుచి చూసి తరువాత మీకు ఇస్తున్నాను. నేను పాపం చేస్తున్నాననీ, పొరపాటు చేస్తున్నాననీ అప్పుడప్పుడు అనిపిస్తున్నది. ఈ విషయంలో మీరు ఏమి చెపుతారమ్మా?***

అమ్మ: నాయనా! మనం అత్యంత ఆత్మీయంగా ప్రేమించే వారికి ఏదైనా ఇచ్చేటప్పుడు, కొద్దిగా రుచిచూసి ఇవ్వడమే మంచిది. దానిలో తప్పేమీ లేదు. ఇంకా చెప్పాలంటే అలాగే ఇవ్వాలి. గోపబాలురు తాము రుచిచూసిన తరువాతే కృష్ణుడికి పండ్లు ఇచ్చేవారు కదా! కాబట్టి దానిలో తప్పేమీ లేదు. (శా.వ. 485)

***102 ప్రశ్న: అమ్మా! పవిత్రమైన మనస్సునూ, భక్తినీ పొందాలంటే ఎలా? ఈ విషయంలో నా గురించి మీరు కొంచెం గురుదేవులతో చెప్పండి?***

అమ్మ: నాయనా! వాటిని తప్పకుండా పొందుతావు. గురుదేవులను శరణువేడావు కదా. నీకు అంతా సిద్ధిస్తుంది.

క్రమం తప్పకుండా ఆయనను ప్రార్థించు. నేను కూడా ఆయనతో నీ మనస్సును పరిశుద్ధం చేయమనీ, దానిని భక్తితో నింపమనీ చెబుతూనే ఉన్నాను. సమయం ఆసన్నమైనప్పుడు నీకు సమస్తమూ సిద్ధిస్తుంది. సరేనా? (శా.వ. 236)

***103 ప్రశ్న: అమ్మా! సోదరి నివేదిత గురించి మీ అభిప్రాయం ఏమిటి?***

అమ్మ: ఆహా! ఆమె గురించి ఏమి చెప్పేది! ఆమె భక్తి అద్భుతం. నాకోసం ఏమి చేసినా ఆమె శ్రమ అనుకునేది కాదు. కొన్ని దినాలు ఆమె నన్ను చూడడానికి రాత్రివేళ వచ్చేది. దీపం వెలుగు నా కళ్ళమీద పడితే అసౌకర్యంగా ఉంటుందని, ఆ దీపాన్ని ఒక కాగితంతో కప్పి, వెలుగును తగ్గించేది. నాకు నమస్కరించిన తర్వాత, నా పాదధూళి తీసుకునేది. నివేదితను తలచుకుంటుంటే నా కళ్ళలో నీళ్ళు వస్తాయి. (శా.వ. 18)

***104 ప్రశ్న: అమ్మా! నాగమహాశయుని గురించి చెప్పండి?***

అమ్మ: 'నాగ్' భక్తి అత్యంత తీవ్రమైనది. ప్రసాదం విస్తరాకును అంటుకున్నదన్న ఒకే కారణంతో ఆ విస్తరాకును కూడా తినేశాడతడు. ఆయన కళ్ళు ప్రేమరసభరితాలు. అవి ఎల్లప్పుడూ ఎర్రబారి బాష్పపూరితంగా ఉండేవి. ఆయన నా వద్దకు వచ్చేటప్పుడు భక్తిపారవశ్యంతో మెట్లు ఎక్కలేక తూలుతూ నడిచేవాడు. నన్ను చూడగానే ఆయన శరీరమంతా కంపించిపోయేది. ఆయనకు నేనొక వస్త్రాన్ని ఇచ్చాను. దాన్నెప్పుడూ తలపాగాలా చుట్టుకునేవారు. అటువంటి భక్తిని నేను మరెవరిలోనూ చూడలేదు. (శా.వ. 25)

***105 ప్రశ్న: అమ్మా! కొత్తగా కొంతమంది భక్తులు వస్తున్నారు. తమకు సేవ చేసే అవకాశం కల్పించమని కోరుతున్నారు. ముఖ్యంగా పూజామందిరంలో సేవచేయాలని వారి ఆకాంక్ష. ఏమి చేయమంటారు?***

అమ్మ: కొత్తగా వచ్చే భక్తులకు తప్పకుండా సేవచేసే అవకాశం కల్పించాలి. కొత్తగా వస్తున్నారు కాబట్టి ఉత్సాహంగా, శ్రద్ధతో సేవ చేస్తారు. అయితే సేవలో పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా పూజకి ఏర్పాట్లు చేసేటప్పుడు చందనంలో ఆకులు ఉండకూడదు. పూలు, బిల్వ పత్రాలలో పురుగులు, ముళ్ళు ఉండకుండా చూసుకోవాలి. పూజ, దానికి సంబంధించిన పనులు చేసేటప్పుడు శరీరాన్ని కానీ, వెంట్రుకలను కానీ, దుస్తులను గానీ చేతులతో తాక కూడదు. ఎంతో జాగ్రత్తగా ఆ పనులు నిర్వర్తించాలి. నైవేద్యం మొదలైనవి నిర్ణీత సమయాలలో జరిపించాలి. (శా.వ. 48)

***106 ప్రశ్న: పూజా సామగ్రి తెచ్చినపుడు ఎందుకమ్మా నన్ను చేతులు గంగాజలంతో కడుక్కోమన్నారు? నేనంత పాపాత్ముణ్ణా? నన్ను పవిత్రం చేస్తేగానీ ఇది సమర్పించడానికి అర్హత లభించదా? (అని నా మనస్సులో అనుకున్నాను. అందరి హృదయాలలో నెలకొని ఉన్న మాతృదేవి నా మనస్సులోని మాటను గ్రహించి, ఇలా అన్నారు.)***

అమ్మ: నాయనా! గురుదేవుల పూజ నిమిత్తం పూజాద్రవ్యాలు తెచ్చావు. మంచిదే! కానీ అదే చేతులతో నా పాదాలను తాకావు. గురుదేవులకు సమర్పించేవి అత్యంత పవిత్రంగా ఉండాలి కదా. అందుకే నాయనా! నిన్ను చేతులు కడుక్కోమన్నాను. వేరే ఉద్దేశ్యం ఏమీ లేదు సుమా! (శా.వ. 158)

## 10. మనస్సు

***107 ప్రశ్న: అమ్మా! సంపద, సద్గుణాల గురించి మీ అభిప్రాయం?***

అమ్మ: నాయనా! సంతృప్తికి మించిన సంపద గానీ, సహనానికి మించిన సద్గుణం కానీ లేదు సుమా! (ది.జ 70)

***108 ప్రశ్న: అమ్మా! ఎంత ప్రయత్నించినా మనశ్శాంతి లభించడం లేదు. సంసారానలంలో దహించుకుపోతూ, మీ దగ్గరకు వచ్చి, మాట్లాడినపుడు మాత్రమే మనశ్శాంతి పొందుతున్నామమ్మా!***

అమ్మ: జరిగేదంతా గురుదేవుల అనుగ్రహం వల్లనే జరుగుతున్నదని నువ్వెందుకు మరచిపోతున్నావమ్మా? ఇదిగో ఇప్పుడు నువ్వు నా దగ్గరికి వచ్చావే, అది కూడా ఆయన సంకల్పమే! భగవంతుణ్ణి ప్రేమించు. పిల్లలకు కూడా భగవంతుణ్ణి ప్రేమించడం నేర్పించు. (శా.వ. 153)

***109 ప్రశ్న: అమ్మా! నా మనస్సులో రకరకాల ఆవేదనలు గూడుకట్టుకుని ఉన్నాయి. వాటిని తొలగించుకోవడం ఎలా?***

అమ్మ: ఏమిటీ! మనస్సు కేవలం ఆవేదనలకు మాత్రమే మూలస్థానమా? భగవదనుభూతి కోసం సాధన చేస్తున్నావు కదా! ఆ ప్రయత్నంలో నిన్ను ముందుకు తీసుకుపోయేది మనస్సే కదా! భగవదనుభూతి పొందిన స్థితిలో మనస్సనేదేదీ ఉండదు. కానీ ప్రస్తుతం ఈ సాధన చేస్తున్న స్థితిలో మనస్సు సహాయం ఎంతో అవసరం. మనిషికి సన్మార్గం చూపించేది పవిత్రమైన మనస్సే కదా! చెడు మార్గాలు పట్టకుండా మనస్సు దిశను మళ్ళించాలి. అపుడు ఆ మనస్సే ఇష్టదైవాన్ని అవగతం చేసుకునే పరికరంగా మారుతుంది. కంగారు పడకు! వీటి

గురించి మీరు కలత చెందాల్సిన అవసరం లేదు. గురుదేవులున్నారు. ఆయన మీ చేయిపుచ్చుకుని ముందుకు నడిపిస్తారు. ఎల్లవేళలా ఆయన మీతోనే ఉంటారు. (శా.వ. 121)

***110 ప్రశ్న: అమ్మా! నేను అనేక మానసిక సమస్యలతో అతలా కుతలం అవుతున్నాను. గురుదేవులూ, మీరూ కూడా నా గురించి పట్టించుకోవడం లేదు. దానికితోడు నేను వకీలుగా పనిచేస్తున్నాను. నా విధి ఎలావుందో? భయంగా ఉంది!***

అమ్మ: నాయనా! భయమెందుకు! నేనున్నాను గదా! మనస్సు స్వభావమే అంత. అది కాసేపు ఉన్నతస్థితిలోనూ, కాసేపు నిమ్నస్థితిలోనూ ఉండి అతలాకుతలం చేస్తుంది. దాన్ని పట్టించుకోకుండా, నిరంతరం నామజపం చేస్తూ ఉండు. ఇక నీ వకీలు పని సంగతి అంటావా? అదీ ఒక వృత్తే కదా! దాని గురించి ఆందోళన ఎందుకు? (శా.వ. 469)

***111 ప్రశ్న: అమ్మా! మనస్సులో దురాలోచనలు ఎందుకు వస్తాయి? వాటిని తొలగించుకోవడం ఎలా?***

అమ్మ: దిగజారిపోవడమే మనస్సు యొక్క స్వభావం. మనిషి మనస్సును బలవంతంగా పట్టుకుని, దానికి అడ్డుకట్ట వేసి ఉంచుతాడు. కానీ, అది అప్పుడప్పుడూ దానిని త్రెంచుకుని బయటకు ప్రవహిస్తుంది. అయితే మనం నిరంతరం దానిని అదుపులో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. సత్పురుషుల సాంగత్యం వలన, మంచి విషయాలు ఆలోచించడం వలన మనస్సు ఉన్నతస్థితిని పొందడం తథ్యం. అతి నీచంగా ఉన్న వారి మనస్సుకూడా సాధువుల కృపాకటాక్షంతో తన ధోరణి మార్చుకుంటుంది.

వేటగాడొకడు సాధువులాగా వేషం ధరించి పక్షులను పట్టు కోవడానికి వెళ్ళాడు. అడవిలో పక్షుల సాత్త్విక స్వభావమూ, నిర్భయత్వమూ చూశాడు. అలా చూసినప్పుడు అతడిలో వైరాగ్యం జనించింది. వెంటనే అతడు వేట మానుకున్నాడు. అందువల్లనే సత్సాంగత్యం అవసరం. సమయం దొరికి నప్పుడల్లా సత్పురుషుల సాంగత్యం చేస్తూ ఉండు. అలాంటిది దొరకకపోతే మంచి పుస్తకాలు చదువు. మహాత్ముల జీవితాల గురించి ఆలోచించే కొద్దీ మనస్సు పవిత్రమవుతుంది.

ఉదాహరణకు నీరు ఎల్లప్పుడూ పల్లానికే పారుతుంది. కానీ సూర్యకిరణాల సంపర్కం వలన అదే నీరు ఆవిరై ఆకాశానికి లేస్తుంది. కొండశిఖరాలలో మంచుగా నిలుస్తుంది. వర్షంగా క్రిందికి దిగి, సెలయేళ్ళుగా, నదులుగా పారి ప్రాణులకు ఎంతో మేలు చేస్తుంది. మనస్సు విషయం కూడా అంతే! సత్సాంగత్యం వలన మనస్సు పవిత్రం అవుతుంది. (శా.వ. 488)

***112 ప్రశ్న: అమ్మా! మనస్సు ఒక్కొక్కసారి ఉత్సాహంగానూ, ఒక్కొక్కసారి నిరాశానిస్పృహలతోనూ ఉంటుంది. ఈ బలహీనతకు కారణం ఏమిటి?***

అమ్మ: నాయనా! అమావాస్య, పౌర్ణమి అనేవి ఎంత ప్రకృతి సహజమో, అదే విధంగా మనస్సులో కలిగే మార్పులు కూడా సహజం. మనస్సు కొన్ని సమయాలలో ప్రశాంతంగానూ, మరి కొన్ని సమయాలలో చంచలంగానూ ఉంటుంది. మనస్సు స్వభావమే అది. క్రమక్రమంగా దాన్ని లొంగదీసుకోవాలి. మనస్సు యొక్క చాంచల్యాన్ని అరికట్టడానికి ముఖ్యమైన మార్గం భగవన్నామ స్మరణే సుమా! (శా.వ. 318)

***113 ప్రశ్న: అమ్మా! మనస్సు ఎంతో చంచలంగా ఉంటోంది. ఎంత ప్రయత్నించినా దానిని అదుపులో పెట్టుకోలేక పోతున్నాను. ఏమి చేయమంటారు?***

అమ్మ: తుఫాను గాలులు వీచినపుడు మేఘాలన్నీ చెల్లాచెదరైపోతాయి. అదే విధంగా 'నామజపం' అనే తుఫాను ప్రభావంతో 'ప్రాపంచికత' అనే మేఘాలను తరిమివేయవచ్చు. అప్పుడు మనస్సు చక్కగా అదుపులోకి వస్తుంది. (శా.వ. 479)

***114 ప్రశ్న: అమ్మా! దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగాసనాలు నేర్చుకుంటున్నాను. అది మంచిదేనా?***

అమ్మ: మంచిదే గానీ నాయనా! కానీ వాటిని అధికంగా చేసేకొద్దీ మనస్సు శరీరం మీదికి ఎక్కువగా మరలుతుంది. మధ్యలో మానివేస్తే శరీరానికి హాని వాటిల్లుతుంది. ఇవన్నీ గ్రహించి ఆ తర్వాత యోగాసనాలు అభ్యసించు. (శా.వ. 399)

***115 ప్రశ్న: అమ్మా! కొన్ని సమయాల్లో మనస్సు చాలా బలహీనమైపోతుంది. ఎందువలన?***

అమ్మ: దాని గురించి ఏమీ ఆందోళన చెందకమ్మా! ఒక్క గురుదేవులకు మాత్రమే అటువంటి బలహీనత అనేది నిజంగా లేదు. మిగిలిన అందరికీ ఎంతోకొంత ఉంది. ఒక్కసారైనా మనస్సులో బలహీనత తలెత్తని మహాపురుషులు ఎవరైనా ఈ భూమి మీద పుట్టారా? 'మనస్సు బలహీనంగా ఉంద'ని తెలుసుకుని, బయటపడడానికి ప్రయత్నం చేస్తే, అదే గొప్ప విషయం. ప్రయత్నం చేసేవాడిపట్ల మహామాయ ప్రసన్నమై, దారి ఇస్తుంది. చాలామంది, ఎప్పుడైనా మనస్సు కొంచెం ప్రశాంతమవ్వగానే, మనస్సుమీద విజయం సాధించామని భావించుకుని, అంతకంటే ముందుకు సాగాలన్న ప్రయత్నం

అనవసరమనుకుంటారు. ఇంకొక విషయం – ఈ బలహీనతను ప్రసాదించేది కూడా భగవంతుడే. “సాధన పూర్తి కాలేదు జాగ్రత్తగా ఉండు! నలువైపులా ఉన్న భూతప్రేతాలు నీ బలహీనతను ఆసరాగా చేసుకుని, నీ భుజాల మీద కూర్చుంటాయి కాబట్టి నీ ప్రయత్నం మానకు!” అని హెచ్చరించడానికే భగవంతుడు ఆ బలహీనతను మనకు ఇస్తాడు. అంతేకాక బలహీనత వలన అహంకారం నశిస్తుంది. నేను సాధించలేక పోయానని అనుకోవడమే అహంకార నాశనానికి గుర్తు. గురుదేవులను శరణువేడి జీవనం కొనసాగించు! ఏమీ ఫరవాలేదు. (శా.వ. 369)

***116 ప్రశ్న: అమ్మా! మనస్సు ఎలాగూ అదుపులో లేదు. ఇపుడు శరీరం కూడా రోగానపడడంతో మనస్సు అసలు జపధ్యానాల జోలికే వెళ్ళనంటోంది. ఏమి చేయాలి?***

అమ్మ: చూడమ్మా! మనస్సును రెండుగా విభజించాలి. ఒకటి వివేకం కలిగిన మనస్సు. రెండవది వివేకం లేకుండా ఆడుకునే బాలుడిలాగా ఉండే మనస్సు. తల్లిదండ్రులు ఆడుకుంటున్న పిల్లలను ఎలా పర్యవేక్షిస్తూ ఉంటారో, అలాగే వివేకం కలిగిన భాగం వివేకం లేని మనస్సును పర్యవేక్షించేలా చెయ్యాలి. కొద్దిగా మారాం చేసినా దానిని వెంటనే అదుపులోకి తేవాలి, కోప్పడాలి, గద్దించాలి! అల్లరి పిల్లలను తల్లిదండ్రులు మందలించడం నువ్వు చూడలేదా? అదే విధంగా మనస్సును కూడా అవసరమైనపుడు మందలించి, దారిలోకి తెచ్చుకోవాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే మనస్సు గుణపాఠం నేర్చుకుని, దారికి వస్తుంది. (శా.వ. 372, 373)

***117 ప్రశ్న: అమ్మా! మనస్సు యొక్క తత్త్వాన్ని గురించి చెప్పండి? మనిషి ఇతరులలో తప్పలనే ఎందుకు చూస్తాడో చెప్పండి?***

అమ్మ: తన మనస్సు గురించి తెలుసుకోగోరే మనుష్యులు చాలా తక్కువగా ఉంటారు. ఇతరులలో తప్పులు పట్టటానికే మనుష్యులు ఇష్టపడతారు. ఎవరైతే తన తప్పులు తాను తెలుసుకుని, వాటిని సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తాడో, అతడికి ఇతరులలో తప్పులు పట్టే స్వభావం పోతుంది. సాధారణంగా మనిషి తనలో ఉన్న కించిత్తు మంచిని కొండంతగా చూసుకుంటాడు. ఇతరులలో కొండంత మంచి ఉన్నా, దానిని కించిత్తుగానే చూస్తాడు. ఈ స్వభావాన్ని మహామాయ స్వయంగా సృష్టించింది! దాని వలననే మనిషి ఆత్మస్తుతిలో మునిగి ఉంటాడు. ఇక ఇతరుల మంచిని గురించి ఎలా ఆలోచిస్తాడు? అందరూ గురుదేవులకు చెందినవారే! అనే భావన మనస్సులో ఉంటే, అందరినీ ప్రేమించాలని అనిపిస్తుంది. అందరిలోనూ గురుదేవులను చూడలేనప్పుడు ఇలా పరనింద చేయడమూ, తప్పులు పట్టడమూ మనస్సుకు మంచిపనులుగా తోస్తాయి. తన శ్రేయస్సు దేనిలో ఉందో తెలియనివాడే ఇతరుల మంచిచెడ్డల గురించి పరిశోధించే ప్రయత్నంలో ఉంటాడు. (శా.వ. 379)

***118 ప్రశ్న: అమ్మా! నేను ఒకచోట నిశ్చింతగా ఉండలేక పోతున్నాను. దీనికి పరిష్కారం ఏమిటి?***

అమ్మ: ఎందుకలా జరుగుతోంది? ఎక్కడ ఉన్నా సంతోషంగా ఉండే విధంగా నీ మనస్సును మలచుకోవాలి. అంతేకానీ, అత్తగారింట్లో ఉంటే ఆనందంగా ఉండలేననీ,

పుట్టింట్లో ఉంటే ఆనందంగా ఉండగలననీ భావించనక్కర లేదు. నీ మనస్సును కుదుట పరచుకుని, ఎక్కడ ఉన్నా సంతోషంగా ఉండడాన్ని నేర్చుకో! (శా.వ. 58)

***119 ప్రశ్న: మాకు ధారణ, ధ్యానం ఎందుకు సిద్ధించడం లేదు?***

అమ్మ: నాయనా! అది అంత సులభమా? మనస్సు పవిత్రంగా ఉంటే ధారణ, ధ్యానం ఎందుకు సిద్ధించవు? పవిత్రమైన మనస్సు గలవారు జపం చేయడానికి కూర్చుంటే చాలు, లోపలినుండి మంత్రం దానంతట అది పెల్లుబికి వస్తుంది. ప్రయత్నపూర్వకంగా కాదు, అప్రయత్నంగా! బద్ధకాన్ని వదిలించుకుని, క్రమం తప్పకుండా వేళకు జపధ్యానాలు చేయాలి. దక్షిణేశ్వరంలో ఉన్నప్పుడు నేను తెల్లవారు ఝామున లేవడానికి ఒక్కరోజు బద్ధకిస్తే, ఆ తరువాత మూడు రోజులు కూడా ఆలస్యంగా నిద్రలేచాను. 'ఆహా! బద్ధకానికి అలవాటు పడిపోయాను!' అని గ్రహించి, ఆ మరునాడు బలవంతంగా వేకువఝామునే లేవడం మొదలుపెట్టి, మళ్ళీ పాత అలవాటును పొందగలిగాను. కాబట్టి ఇటువంటి విషయాలలో దృఢసంకల్పం ఉండాలి సుమా! (శా.వ. 316)

## 11. ఏకాగ్రత, ధ్యానం

***120 ప్రశ్న: అమ్మా! రోజంతా పనిచేశాను. ఇప్పుడు వచ్చి ధ్యానం చేద్దామంటే మనస్సు నా మాట వినడం లేదు. ఎలాగమ్మా?***

అమ్మ: నాయనా! రోజంతా శ్రమపడి వచ్చాక ఏదైనా కాస్త తిను. కాసిని మంచినీళ్ళు కూడా త్రాగితే ఒంట్లో కొత్త శక్తి వస్తుంది. ఆ తరువాత జపమో, ధ్యానమో చేస్తే, దానిలో మనస్సు సులభంగా లగ్నమవుతుంది. (శా.వ. 329)

***121 ప్రశ్న: అమ్మా! ధ్యానంలో మనస్సు లగ్నం కావడం లేదమ్మా! ఏమి చేయమంటారు?***

అమ్మ: అదేమీ ఫరవాలేదులే నాయనా! గురుదేవుల ఛాయాచిత్రాన్ని చూస్తూ ఉండు. అది చాలు. కాశీపూర్‌లో గురుదేవులు వ్యాధిగ్రస్తులై ఉన్నప్పుడు యువకులు ఆయనకు సేవ చేస్తూ వచ్చారు. వారిలో గోపాల్ కూడా ఉన్నాడు. ఒక రోజు అతడు గురుదేవుల సేవను విస్మరించి, ధ్యానం చేసుకోవడానికి వెళ్ళిపోయాడు. అప్పుడు గిరీష్ బాబు గోపాల్‌ను గురించి ఇలా అన్నాడు: "కళ్ళు మూసుకుని గోపాల్ ఎవరిని ధ్యానిస్తున్నాడో, ఆయన బాధతో పడుకొని ఉన్నారు. గోపాల్ ఏమి ధ్యానం చేస్తున్నాడో, ఏమో!" ఆ తరువాత గోపాల్‌ను పిలిపించారు. అందుకే నాయనా! గురుదేవులను చూస్తూ ఉండు. సమస్తమూ సిద్ధిస్తుంది! (శా.వ. 307)

***122 ప్రశ్న: మనస్సు ఏకాగ్రం కావడానికి ఎంత జపం చేయాలి?***

అమ్మ: రోజుకు పదివేలసార్లు, ఎందుకు, ఇరవైవేలసార్లు కూడా జపం చేయవచ్చు! నీ శక్తిమేరకు జపం చేయి! (శా.వ. 79)

***123 ప్రశ్న: అమ్మా! సులభంగా ధ్యానం చేసే పద్ధతిని తెలపండి?***

అమ్మ: నాయనా! ఆ గోడ మీద వ్రేలాడుతున్న గురుదేవుల మూర్తినీ, నా ఛాయాచిత్రాన్నీ ధ్యానిస్తే చాలు. అంతకంటే సులభమైన పద్ధతి నీకెక్కడ దొరుకుతుంది? (శా.వ. 159)

***124 ప్రశ్న: అమ్మా! ధ్యాన సమయంలో మనస్సు ఏకాగ్రమవ్వడం లేదు. మనస్సు చంచలంగా, విచ్చలవిడిగా పరుగులు తీస్తోంది. ఏంచేయాలి?***

అమ్మ: నాయనా! అదేమీ పెద్ద విషయం కాదు. కళ్ళకు, చెవులకు వాటివాటి ప్రత్యేకమైన స్వభావాలున్నట్టే చంచలంగా ఉండడం మనస్సు యొక్క స్వభావం. దాని స్వభావాన్ని మార్చాలంటే నిరంతరం జపధ్యానాలు చేస్తూ ఉండాలి. భగవంతుని పావననామం ఇంద్రియాల శక్తికంటే ఎంతో శక్తిమంతమైనది. క్రమపద్ధతి ప్రకారం జపధ్యానాలు చేస్తూ ఉంటే అంతా చక్కబడుతుంది. మనస్సు చక్కగా స్వాధీనంలోకి వస్తుంది. భయపడకు! (శా.వ. 202)

***125 ప్రశ్న: అమ్మా! భగవంతుణ్ణి స్మరించడం మొదలుపెట్టగానే ఎందుకు నా మనస్సు అటూయిటూ పోతూ ఉంటుంది? నిలకడగా ఉండదు ఎందుకు?***

అమ్మ: సరే నాయనా! మనస్సు ఎక్కడెక్కడికో పోతుందంటున్నావే. అంటే డబ్బు, భార్య, పిల్లలు, వీటిమీదికే గదా? వీటి మీదికైతే అంత మంచిది కాదు. కానీ రోజువారీ పనుల గురించి మనస్సు ఆలోచించడం మామూలే. నీకు ధ్యానం కుదరకపోతే, జపం చేయి. 'జపాత్ సిద్ధిః' – అంటే జపం ద్వారానే పరిపూర్ణస్థితి కలుగుతుంది. ధ్యానం కుదరితే

మంచిదే – కుదరకపోతే బలవంతంగా మనస్సును అందులో నిలపాలని ప్రయత్నించకూడదు. (శా.వ. 394)

***126 ప్రశ్న: అమ్మా! నేను వరద సహాయకార్యక్రమాలలో ఎక్కడెక్కడికో వెళ్ళవలసి ఉంటుంది. అక్కడ సంశయమో, చాంచల్యమో కలిగితే ఎవరిని ఆశ్రయించాలో తెలియడం లేదు. ఆ సమయంలో ఏమి చేయాలి?***

అమ్మ: ఆ సమయంలో గురుదేవుల ఛాయాచిత్రాన్ని సదా నీ వద్ద ఉంచుకో. ఆయన ఎల్లప్పుడూ నీతో ఉంటున్నట్లూ, నిన్ను గమనిస్తున్నట్లూ భావించు. ఏ సమస్య తలెత్తినా ఆయననే ప్రార్థించు. అందుకు కావలసిన పరిష్కారాన్ని నీ మనస్సుకు ఆయనే స్ఫురింపజేస్తారు. ఆయన అంతర్యామి కదా. కానీ నీ మనస్సు ఎప్పుడూ బాహ్యాముఖంగా ఉండడం వలన అది అంతర్ముఖమవ్వదు. అందువలన అది ఆయనను బాహ్యంగా వెతుకుతూ తిరుగుతుంది. నువ్వు దేనికోసం ప్రార్థించినా, నిజానికి అది నీకు తప్పక కావలసినదైతే, అందుకు సమాధానం లోపలనుండి అప్రయత్నంగా రావడాన్ని చూస్తావు. మనోవాక్కాయాలు ఒక్కటై ప్రార్థన చేస్తే గురుదేవులు ఆలకిస్తారు, కావలసినది చేస్తారు. (శా.వ. 378, 379)

## 12. స్వప్రయత్నం

***127 ప్రశ్న: అమ్మా! ఇక్కడికి వచ్చే భక్తులలో చాలామంది తమకు 'భగవంతుణ్ణి చూపించమనీ, గురుదేవుల దర్శనం పొందేలా చేయమ'నీ మిమ్మల్ని అడుగుతుంటారు. వారికి మీరేమి చెబుతారమ్మా?***

అమ్మ: నాయనా! నీవు చెప్పినట్లు ప్రస్తుతం ఇక్కడికి వచ్చేవారందరూ భగవంతుణ్ణి చూపించమని పదేపదే అడుగుతుంటారు. కానీ తాముగా ఎటువంటి సాధనలూ చేయరు. నిష్ఠ ఉండదు. జపతపాదులు ఏమీ చేయరు. పూర్వజన్మలో గోహత్య, భ్రూణహత్య లాంటి ఘాతుకాలు ఎన్ని చేశారో ఆ దేవుడికే ఎరుక! ఆ ప్రారబ్ధమంతా క్షీణించిన తరువాతే కదా ఏదైనా జరిగేది. చంద్రుణ్ణి మేఘాలు కప్పివేస్తే, గాలి వీచి క్రమక్రమంగా మేఘాలు తొలగినపుడే కదా చంద్రుడు కనిపిస్తాడు? కళ్ళు మూసి తెరిచేలోపలే మేఘాలు మాయమవుతాయా? చంద్రుడు దర్శనమిస్తాడా? ఆధ్యాత్మిక జీవితం, భగవద్దర్శనం మొదలైనవాటి సంగతి కూడా అంతే. కర్మఫలం క్రమక్రమంగానే తగ్గుతుంది. అది పూర్తిగా క్షీణించినపుడే భగవద్దర్శనం కలుగుతుంది సుమా! (శా.వ. 267)

***128 ప్రశ్న: అమ్మా! సాధకులందరూ ఎదుర్కొనే ఏకైక సమస్య ఏకాగ్రత లేకపోవడమే! అంతే కదమ్మా?***

అమ్మ: నాయనా! సాధకుడు ప్రతిరోజూ పదిహేను, ఇరవై వేల జపం చేయగలగాలి. అలా చేస్తే మనస్సు అదుపులోకి వచ్చి, ఏకాగ్రత లభిస్తుంది. ఇది నా సొంత అనుభవంతో

చెపుతున్నాను. ముందుగా అభ్యాసం చేయాలి. అలా చేశాక కూడా మీకు విజయం లభించకపోతే నన్ను అడగండి! కానీ మనస్ఫూర్తిగా సాధన చేయాలి సుమా. ఇవేమీ చేయకుండానే సఫలీకృతులు కాలేదనుకుంటే ప్రయోజనమేముంది? (శా.వ. 317)

***129 ప్రశ్న(కేదార్‌బాబు): అమ్మా! మీ బిడ్డలందరూ పండితులు. ఇక్కడుంటున్న మాబోటి కొద్దిమంది మాత్రం పామరులం. శరత్ మహరాజ్ గురుదేవుల చరిత్ర రచించారు. మిగిలిన వారు ఉపన్యాసాలిస్తున్నారు. వారి ద్వారా ఎన్ని పనులు జరుగుతున్నాయో! మావల్ల ఏమి జరుగుతుందమ్మా?***

అమ్మ: అదేంటి నాయనా! అలా అన్నావు? ఎవరి శక్తిసామర్థ్యాలని బట్టి వారు గురుదేవుల సేవ చేస్తారు. అందులో ఎక్కువ తక్కువలేమీ లేవు. భగవంతుని వైపు మనస్సును మళ్ళించడమే అసలు విషయం. గురుదేవుల విషయమే తీసుకో – ఆయనకు చదవనూ, రాయనూ తెలియదు. కానీ ఆయన సదా భగవచ్చింతనలోనే ఉండేవారు కదా. కావలసింది అదే! నీమూలంగా కూడా ఇక్కడ ఎన్నో పనులు జరుగుతున్నాయి. ఇదంతా గురుదేవుల సేవే కదా. ఎందుకు మీరు బాధపడుతున్నారు? మీరందరూ నాకు చెందినవారు. మిమ్మల్ని మీరు తక్కువగా అనుకోకండి! (శా.వ. 324)

***130 ప్రశ్న: అమ్మా! గురుదేవులను ఎక్కువగా స్మరించలేక పోతున్నాను. ఆయన కృప మాకు లభిస్తుందా?***

అమ్మ: ఫరవాలేదమ్మా! నువ్వు ఆయనను కించిత్తు స్మరించినా చాలు. ఒకింత ధ్యానించినా చాలు. కానీ మనస్సును, ప్రాణాలను జోడించి చేయండి. వ్యాకులతతో ఆయనను ప్రార్థించండి. రోజు గడిచిపోయే వేళ రెండు కన్నీటి చుక్కలు

రాల్చి నామజపం చేయండి. ఆ కన్నీరు కాకపోతే మీ దగ్గర ఏముందో చెప్పండి చూద్దాం? వేరే ఏమయినా ఉంటే, అవన్నీ ఆయనవే. ఆ రెండు కన్నీటి బిందువులే మీవి. వాటిని ఆయనకు అర్పించండి. గురుదేవులు ఈసారి అవతరించింది మీ కోసమే! భయపడవద్దు. భగవంతుణ్ణి చేరుకోవడానికి ఇంత సుగమమైన మార్గం చూపించి వెళ్ళారాయన! (శా.వ. 152)

***131 ప్రశ్న: అమ్మా! గురుదేవులు, "నేను మూసను తయారు చేశాను. మీరు ప్రతిమను పోసుకోండి" అనేవారు కదా! దానికి అర్థం ఏమిటమ్మా?***

అమ్మ: నాయనా! ప్రతిమను పోయడమంటే గురుదేవులను ధ్యానించడమూ, ఆయనను గురించి చింతన చేయటమూ. అంతకు మించి ఏముంది? గురుదేవులను తలచుకుంటే చాలు అన్ని ఆధ్యాత్మిక భావనలూ పొందవచ్చు. ఆయన ఇంకొక హామీ ఇచ్చారు. అదేమిటంటే, "ఆయనను తలచుకునే వారికి ఆహారానికి లోటుండదు!" ఈ మాటల్ని తానే చెప్పారు. ఆయన భక్తులందరూ ఎంత హాయిగా ఉన్నారో చూడు! ఆయన భక్తులలాంటి వారిని మరెక్కడా చూడలేము! (శా.వ. 296)

## 13. సాధన

***132 ప్రశ్న: అమ్మా! తరణోపాయం ఏమిటి?***

అమ్మ: చూడమ్మా! ఆ గూటిలోని గడియారం 'టిక్ టిక్' మని కొట్టుకుంటున్నట్లు నిరంతరం భగవన్నామాన్ని జపిస్తూ ఉండు. అది నీకు సర్వం సమకూరుస్తుంది. అంతకు మించి చేయవలసిందేమీ లేదు. (ది.జ. 83)

***133 ప్రశ్న (భక్తురాలు): అమ్మా! పనిలేకుండా, ఖాళీగా ఉన్నప్పుడు మనస్సులోకి రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. వాటిని అరికట్టడం ఎలా?***

అమ్మ: నాయనా! ఒక్క క్షణమైనా ఖాళీగా ఉండకూడదు. ఏదోవొక పని చేస్తూ ఉండాలి. ఏదోవొక పని కల్పించుకుని, దానిలో నిమగ్నమవడానికి ప్రయత్నించు. సోమరితనంలో పడి పోతే, మనస్సులో రకరకాల ఆలోచనలు, భయాలు పుట్టుకు వచ్చి, నిన్ను బెంబేలెత్తిస్తాయి. అలా జరగకుండా ఉండాలంటే ఏదోవొక పనిలో నిమగ్నమవడం, నిత్యం భగవన్నామ స్మరణ చేయడమే చక్కగా పనిచేసే మార్గాలు. (శా.వ. 480)

***134 ప్రశ్న: అమ్మా! ఎంత సాధన చేసినా, గురుదేవులను మేము ఎందుకు చూడలేక పోతున్నాము?***

అమ్మ: నాయనా! తప్పక చూడగలుగుతావు. సముచిత తరుణంలో చూడగలుగుతావు. ఆయనను నీ సొంతంగా భావిస్తే, తప్పక ఆయన దర్శనం లభిస్తుంది. తెలిసిందా? (శా.వ. 238)

***135 ప్రశ్న: అమ్మా! సంసారబాధ్యతల మూలంగా గురుదేవుల పూజ సాంప్రదాయ బద్ధంగా చేయలేక పోతున్నాను. ఏమి చేయాలి?***

అమ్మ: నాయనా! సంసార బాధ్యతలతో సతమతమవుతూ, సాంప్రదాయబద్ధంగా గురుదేవుల పూజ ఎలా చేయగలుగుతావు? ఫరవాలేదులే. తీవ్రమైన వ్యాకులతతో ఆయనకు ప్రార్థన చేయి. చాలు. నీకు అవసరమైన, శ్రేయస్కరమైన వాటి నన్నింటినీ ఆయన సమకూరుస్తారు. చందమామ అందరికీ మామే కదా! (శా.వ. 185)

***136 ప్రశ్న: అమ్మా! సాధనల గురించి, దివ్యదర్శనాల గురించి చెప్పండి?***

అమ్మ: గురుదేవులకూ, నాకూ మధ్య ఎలాంటి వ్యత్యాసమూ పాటించకు. నీకు ఎప్పుడు ఎలా దర్శనం కలుగుతుందో, అందుకు తగిన రీతిలో ధ్యానం చేయి. ధ్యానంతో పూజ సమాప్తమవుతుంది. హృదయపద్మంలో ప్రారంభించి, సహస్రారంలో ముగించు. మంత్రం, తంత్రం లాంటివి ఏవీ ముఖ్యం కాదమ్మా! భక్తియే ప్రధానం! గురువూ ఆయనే, ఇష్టదైవం కూడా ఆయనే! ఆయనే సర్వస్వం! దివ్యదర్శనాల గురించి ఎక్కువగా ఆలోచించకు! (శా.వ. 36)

***137 ప్రశ్న: అమ్మా! చిత్తశుద్ధితో ఒకటి రెండుసార్లు ప్రార్థిస్తే చాలు భగవద్దర్శనం కలుగుతుందని గురుదేవులు అన్నారు. నేను ఎన్నో రోజులుగా ప్రార్థిస్తున్నాను. కానీ నాకు ఎందుకు భగవద్దర్శనం కలగడం లేదు?***

అమ్మ: గురుదేవులు చెప్పినట్టు తప్పక భగవద్దర్శనం కలుగుతుంది. అలా జరగకుండా ఉంటుందా? గురుదేవుల వాక్కు శివుని వాక్కు. అది జరగకపోయే ఆస్కారమే లేదు.

గురుదేవులను శరణువేడు! "నన్ను కాపాడడానికి

ఒకరున్నారు. నా తల్లీ, తండ్రీ, గురువూ, దైవమూ అన్నీ ఆయనే!" అనే భావన మనస్సులో నెలకొని ఉంటే చాలు సుమా, తప్పక లక్ష్యం సిద్ధిస్తుంది. (శా.వ. 103)

***138 ప్రశ్న (ఒక సన్న్యాసి): అమ్మా! ఒక గొప్ప భక్తుడైన గృహస్థు ఇంట్లో ప్రస్తుతం నేను ఉంటున్నాను. ఆయన భార్య నాకు మంచి ఆహారం ఇస్తోంది. చేపలు తినమని పదేపదే చెపుతుంది. కానీ నేను తినలేదు. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?***

అమ్మ: చేపలు తిను నాయనా! దానిలో తప్పేముంది? చేపలు తింటే మెదడు చల్లబడుతుంది. అయితే వ్యర్థంగా ఖర్చు చేయవద్దని ఆమెకు చెప్పు. భక్తులైన గృహస్థుల వద్ద ధనం ఉంటే సాధువులకు ఎంతో మేలు చేయవచ్చు. వారి ధనం వల్లనే కదా చాతుర్మాస్యవ్రతం లాంటి భిక్ష దొరకడం కష్టమైన సమయంలో సాధుసన్న్యాసులు నియమనిష్ఠలతో, వ్రతాలు అనుష్ఠించగలుగుతున్నారు. (శా.వ. 77)

***139 ప్రశ్న: సాధనలకు తగిన సమయం ఏదమ్మా?***

అమ్మ: సంధ్యాసమయాలు. ఆ సమయాలలో మనస్సు సహజంగా ప్రశాంతతను, పవిత్రతను సంతరించుకుంటుంది కాబట్టి ఆ వేళలలే సాధనకు తగినవి. (శా.వ. 483)

***140 ప్రశ్న: అమ్మా! నేను రామకృష్ణమఠంలో వరిష్ఠ స్వామీజీ వద్ద మంత్రదీక్ష తీసుకున్నాను. క్రమం తప్పకుండా జపం చేయడమే కాక దీక్షాగురువును తరచూ దర్శించుకుంటూ ఉంటాను. ఐనా ఆధ్యాత్మికంగా నాకు ఎలాంటి పురోగతీ కలగడం లేదు. ఇంతకు ముందు ఎలా ఉన్నానో అలాగే ఉన్నానని అనిపిస్తోంది. ఏమి చేయమంటారు?***

అమ్మ: నాయనా! నీవు ఒక మంచం మీద గాఢనిద్రలో ఉన్నావని అనుకుందాము. అప్పుడెవరైనా నిన్ను మంచంతో పాటు ఎత్తుకొనిపోయి వేరేచోటికి తరలించాడనుకో! నువ్వు మరొకచోటికి వచ్చావనే విషయం నీకు మెలకువ వచ్చిన వెంటనే తెలుస్తుందా? తెలియదు. నిద్రమత్తు బాగా వదిలిన తర్వాతే ఆ విషయం నీకు అర్థమవుతుంది. అదే విధంగా నీవు చేసే జపం వల్ల కలిగే ఫలితం నీకు ఇప్పుడే అర్థం కాదు. ఆధ్యాత్మిక పురోగతి కూడా అంతే. అది తెలియాలంటే తీవ్రమైన జపధ్యానాలలోనూ నిమగ్నమవ్వాలి. లేకపోతే అది జీవితం ముగిసే క్షణాలలో మాత్రమే లభిస్తుంది. ధర చెల్లించి కూరగాయలూ, చేపలూ కొనుక్కున్నట్టు ఇంత జపతపాలు చేస్తే భగవంతుడు లభిస్తాడు అన్న లెక్కలేవీ లేవు కదా! (శా.వ. 484)

***141 ప్రశ్న: అమ్మా! మా స్నేహితుడొకడు అర్ధరాత్రిపూట తీవ్రంగా ధ్యానం చేస్తూ ఉంటాడు. అలా చేస్తున్నప్పుడు కుడివైపు నుండి ఒక నాదం వినిపిస్తున్నట్టు, ఒక్కొక్కప్పుడు (మనస్సు నిమ్న స్థాయిలో ఉన్నప్పుడు) ఆ నాదం ఎడమవైపు నుంచి వస్తున్నట్లు అతడు చెపుతుంటాడు. ఇది సరైనదేనా?***

అమ్మ: అవును. ఆ నాదం కుడివైపు నుండే వస్తుంది. శరీర స్మృతి ఎక్కువగా ఉన్నప్పుడే అది ఎడమవైపు నుండి వస్తుంది. కుండలినీశక్తి జాగృతమైతే ఇటువంటి అనుభవాలు కలుగుతాయి. కుడివైపు నుంచి వచ్చేదే నిజమైన నాదం. క్రమంగా మనస్సే గురువవుతుంది. ఏకాగ్రచిత్తంతో రెండు నిముషాలు సాధన చేసినా అది గొప్ప విషయమే సుమా! (శా.వ. 96)

***142 ప్రశ్న (భక్తురాలు): అమ్మా! సాధన గురించి సలహాలివ్వండి?***

అమ్మ: నీకు చదవడం, వ్రాయడం తెలుసు కాబట్టి రోజూ కాసేపు భగవద్గీత, శ్రీరామకృష్ణ కథామృతం చదువు. గురుదేవుల గురించి ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయి. అవి కూడా వీలును బట్టి చదువు. మీ కుటుంబ వ్యవహారాలు నిన్నేమీ చేయలేవు. నీవరకూ నీకు కుటుంబ జీవితం, చెట్టు క్రింద జీవించడం ఒకటే! కుటుంబ జీవితం భగవంతుడి కన్నా వేరైనదా ఏమిటి? భగవంతుడు సర్వత్రా ఉన్నాడు. నీవు స్త్రీవి. ఎక్కడికని వెళ్ళగలవు? భగవంతుడు నిన్ను ఎక్కడ, ఎలా, ఏ స్థితిలో ఉంచుతాడో, అక్కడే సంతృప్తితో జీవించు. భగవంతుణ్ణి పొందగోరడమే నీ లక్ష్యమని గుర్తుంచుకో! ఆయనను నువ్వు ప్రార్థిస్తే, నీ చేయి పట్టుకుని ఆయనే ముందుండి నిన్ను నడిపిస్తాడు. ఆయనను శరణుజొచ్చి నీవు జీవించగలిగితే ఇక దేనికీ భయపడవలసిన అగత్యం ఉండదు.

మరొక విషయం! గురుశిష్యులు కలిసి జీవించడం మంచిది కాదు. ఎందువలనంటే, గురువు దైనందిన జీవితాన్ని పరిశీలించే శిష్యుడు ఆయనను సామాన్యమైన వ్యక్తిగా జమకట్టే అవకాశం ఉంది. అది శిష్యునికి చెడు చేస్తుంది. గురువు ఇంటికి సమీపంలో శిష్యుడు విడిగా నివసిస్తూ, రోజుకొకసారి వచ్చి, ఆయనను దర్శించుకుని, ఆయన సాంగత్యంలో ఆనందిస్తూ, ఉపదేశాలు పొందడం మంచిది. శిష్యుడు గురువును అప్పుడప్పుడూ కలుసుకుంటూ ఉండకపోతే ఆయన బోధనలను మరచిపోయే అవకాశం ఉంది. జ్ఞానసముపార్జన కోసం అక్కడికీ, ఇక్కడికీ తిరగడం ప్రమాదభరితం. గురుదేవులున్నారు! దేనికీ భయపడకు! (శా.వ. 114, 115)

***143 ప్రశ్న (భక్తురాలు): సాధనలో పురోగమిస్తున్నానో, తిరోగమిస్తున్నానో తెలియడం లేదమ్మా? ఎలా?***

అమ్మ: నేను నీకు గురువును కదా! నువ్వు పురోగమిస్తున్నావో, లేదో నాకు తెలుస్తుంది. అది నీకెలా అర్థమవుతుంది? నీవంతు నీవు సాధన చేస్తూ ఉండు. ఇతర విషయాలు పట్టించుకోకు. సాధన సమయంలో ఎదురయ్యే అనేక అంతరాయాలు ఆంతరికమైనవే. బాహ్యమైనవి చాలా తక్కువ. కానీ ఎలాంటి అంతరాయాలు ఎదురైనా జపధ్యానాదులు అభ్యసించేకొద్దీ అవన్నీ ఒక్కొక్కటిగా వైదొలుగుతాయి. నీ కర్తవ్యం నువ్వు పాటిస్తే చాలు. మనస్సులోని మాలిన్యాలు అలాగే ఉన్నాయా, తొలగిపోయాయా అని కలత చెందకు. కొబ్బరిమట్టను చూశావు కదా! సరైన తరుణంలో, ముదిరిన తర్వాత, దానంతట అదే రాలిపోతుంది. పచ్చి మట్టనే తొలగించాలంటే చాలా శ్రమించవలసి వస్తుంది. అదే విధంగా, సరైన సమయంలో అన్నీ జరుగుతాయి సుమా! (శా.వ. 117)

***144 ప్రశ్న: అమ్మా! నేనెందువల్ల జపధ్యానాలలో లీనం కాలేకపోతున్నాను?***

అమ్మ: సాధ్యమైనంత చేస్తూనే ఉన్నావు కదా! అంతా సవ్యంగానే జరుగుతోంది. అమ్మాయీ! ఇంత చిన్న వయస్సులోనే వైధవ్యం ప్రాప్తించినా నువ్వు ఇక్కడకు రావడం గొప్ప విషయం. నువ్వు ఎంతో శ్రమపడవలసిన పని లేదు. సాయంత్రం దేవుడికి ఒకటి రెండుసార్లు ప్రణామం చేస్తే చాలు. ఒక్క మార్గాన్ని గట్టిగా అనుసరిస్తే చాలు. మరేదీ చేయనవసరం లేదు. (శా.వ. 117)

***145 ప్రశ్న: అమ్మా! మీరు పంచాగ్ని తపస్సు చేసి శరీరాన్ని ఎందుకు కష్టపెట్టారు?***

అమ్మ: ఇటువంటి తపస్సులన్నీ లోకకళ్యాణార్థం చేస్తారు నాయనా! లేకుంటే జీవితం సార్థకమయ్యేదెలా? పంచాగ్ని తపస్సు లాంటివి స్త్రీల కోసమే ఉద్దేశించబడ్డాయి. స్త్రీలు అనేక వ్రతాలు ఆచరిస్తారు కదా! ఇదీ అలాగే చేశాను. (శా.వ. 296)

***146 ప్రశ్న: అమ్మా! గురుదేవులు పరిత్యాగాన్ని ఎంతో అభిలషించేవారు. అటువంటి పరిత్యాగాన్ని మేం ఏ కించిత్తో కదా పాటిస్తున్నాం?***

అమ్మ: ఫరవాలేదు నాయనా! క్రమంగా పాటించగలుగుతారులే! ఈ జన్మలో కొంత, రాబోయే జన్మలో మరికొంత – ఇలా క్రమంగా పాటిస్తారు. శరీరమనే తొడుగు మాత్రమే మారుతుంది. ఆత్మ అలాగే ఉంటుంది. (శా.వ. 301)

***147 ప్రశ్న: అమ్మా! నేను ఎన్నో ఏళ్ళ బట్టి భగవన్నామస్మరణ చేస్తున్నాను. కానీ నాకు ఆయన అన్నీ కష్టాలనే ఇస్తున్నాడు. ఇకపై భగవన్నామస్మరణ చేయనే చేయను?***

అమ్మ: పోనీలే నాయనా! నువ్వు ప్రార్థించకపోతే దేవునికి ఏమి నష్టం కలుగుతుంది? భగవంతుడి గురించిన కనీస ఆలోచన కూడా లేకుండానే అనేకులు కాలం గడిపేస్తున్నారు. అందువలన ఆయనకేమి నష్టం? ఆయనను స్మరించ లేక పోవడం నీ దురదృష్టం. ఆయన మాయ అలా ఉంటుంది. ఆ మాయలో పడిపోయి లోకులు భగవంతుణ్ణే మరచిపోయి జీవిస్తున్నారు. ఆయనేమో, 'బాగుంది! అలాగే ఉండండి!' అంటున్నాడు. (శా.వ. 314)

***148 ప్రశ్న: అమ్మా! మిమ్మల్నే గురువుగా పొందిన వ్యక్తికి వేరే సాధనలు ఎందుకు?***

అమ్మ: అది సరే కానీ, ఒక విషయం చెపుతాను విను. ఇంట్లో వంటకు కావలసిన సామగ్రి అంతా ఉన్నా, వంట చేస్తేనే కదా భోజనం చేయగలం. సత్వరమే వంట చేసేవారు ఉదయమే భోజనం చేసేయవచ్చు. బద్ధకిస్తే బాగా ఆలస్యం అవుతుంది – బహుశా పస్తుండవలసి వస్తుంది కూడా. అలాగే సాధనలు ఎవరు ఎంత ఎక్కువగా చేస్తారో, అంత త్వరగా భగవద్దర్శనం పొందుతారు. కొద్దిగా చేసేవారికి కూడా ఆయన దివ్యదర్శనం లభించి తీరుతుంది. కానీ చాలా నిదానంగా అవసాన సమయంలో లభించవచ్చు. ఏమీ చేయకుండా, కేవలం ఆర్భాటం చేసేవారికి అది మరింత ఆలస్యం అవుతుంది. ఎల్లప్పుడూ సాధనలలోనే ఉండడం నీకు సాధ్యం కాదు కాబట్టి గురుదేవుల కైంకర్యంగా భావించి ఆయన పనిచేయి. (శా.వ. 411)

***149 ప్రశ్న: అమ్మా! పనులెన్ని చేసినా ఏమీ ప్రయోజనం లేదు. సదా జపధ్యానాలు చేయగలిగితే మాత్రమే భగవత్సాక్షాత్కారాన్ని పొందగలమని కొందరంటున్నారు. మీరేమంటారమ్మా?***

అమ్మ: అదేంటి నాయనా! అలా ఎలా చెప్పగలరు? ఇది చేస్తే లభిస్తుంది, అది చేస్తే లభించదని వీరెలా గ్రహించారట? ఏదో కొన్ని రోజులు జపధ్యానాలు చేస్తే సమస్తం సాధించినట్లయిపోతుందా? శక్తికి మించి బలవంతంగా జపం చేసిన యువకుడొకడు పిచ్చివాడయిపోవడం చూశాం కదా! మనస్సు మరమేకు లాంటిది. కాస్త వదులైతే చాలు

పిచ్చిపడుతుంది. లేకపోతే మహామాయ వలలో చిక్కుకుని 'నేను చాలా తెలివిగలవాణ్ణి, నేను చాలా బాగున్నాను!' అనే భ్రమలో ఉంటాడు. మరమేకును కూడా సరిగ్గా బిగిస్తే ఆ వ్యక్తి సరైన దారిలో పురోగమించి శాంతి, ఆనందం పొందుతాడు. అవిరామంగా జపధ్యానాలు ఎందరు చేయగలుగుతారు? ప్రారంభంలో ఏదో చేస్తారు కానీ ఆ తరువాత నిర్లక్ష్యం ఆవరిస్తుంది. అప్పుడు మనస్సు ప్రశాంతతను కోల్పోతుంది. ఇలా మనస్సును ఇష్టం వచ్చినట్లు వదిలివేయడం కంటే ఏదోవొక పనిలో ఉంచితే చాలా మంచిది. చంచలమైన మనస్సు గందరగోళాన్ని సృష్టిస్తుంది. ఇదంతా చూసే కదా నా నరేన్ (వివేకానంద స్వామి) 'నిష్కామకర్మ' మార్గాన్ని ఏర్పరిచాడు. (శా.వ. 335, 336)

## 14. మంత్రదీక్ష

***150 ప్రశ్న: అమ్మా! మిమ్మల్ని ధ్యానించడమే నాకు బాగా ఇష్టం. కానీ గురుదేవులను ధ్యానించమని దీక్షాసమయంలో చెప్పారు. ఏమి చేయమంటారు?***

అమ్మ: నాయనా! నన్ను ధ్యానించడం నీకు ఇష్టమయితే అలా చేయి. ఎందుకంటే నాకూ, గురుదేవులకూ మధ్య ఏ భేదమూ లేదు. రూపం మాత్రమే భిన్నం. ఎవరు గురుదేవులో, వారే ఈ శరీరంలో కూడా ఉన్నారు. కాబట్టి నీకిష్టమైన విధంగా నీవు ధ్యానించు. ఏమీ ఫరవాలేదు. (శా.వ. 449)

***151 ప్రశ్న: (మాతృదేవి దగ్గర మంత్రదీక్ష తీసుకున్న ఒక భక్తుడు): అమ్మా! నేను మీ దగ్గర మంత్రదీక్ష తీసుకున్నాను. అయితే, అంతకు ముందే మాకొక కులగురువు ఉన్నాడు. మీ దగ్గర మంత్రదీక్ష తీసుకున్నందుకు కోపంతో మా కులగురువు నన్ను శపించాడు. నా గతి ఏమవుతుంది?***

అమ్మ: నాయనా! నీవేమీ కంగారు పడనక్కరలేదు. నీకేమీ కాదు. గురుదేవులను శరణువేడిన వారిని ఏ శాపమూ ఏమీ చేయలేదు. నిశ్చింతగా, నిర్భయంగా ఉండు. మరొకసారి చెపుతున్నాను. నిన్నే శాపమూ ఏమీ చేయలేదు. (శా.వ. 474)

***152 ప్రశ్న: అమ్మా! మంత్రదీక్ష స్వీకరించిన భక్తులను చూస్తున్నాము. దానివలన వారికేమీ ప్రయోజనం చేకూరినట్లు అనిపించడం లేదు. మునుపు ఎలా ఉండేవారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. దీనిమీద మీ అభిప్రాయం ఏమిటమ్మా?***

అమ్మ: నాయనా! మంత్రజపం వలన మంచి శక్తిని పొందుతారు. గురువు శక్తి శిష్యునికి, శిష్యుని శక్తి గురువుకూ

సంక్రమిస్తుంది. అందుకే కదా మంత్రదీక్ష ఇచ్చిన గురువు శిష్యుల పాపాలు పుచ్చుకొని చాలా రోగాలు అనుభవించవలసి వస్తున్నది. ఇక పురోభివృద్ధి అంటావా? కొందరు సత్వరమే పురోగమిస్తారు. మరి కొందరు మెల్లగా పురోగమిస్తారు. అంతా వారివారి సంస్కారాలను బట్టే ఉంటుంది. (శా.వ. 298)

***153 ప్రశ్న: అమ్మా! మంత్రదీక్ష పుచ్చుకోవలసిన అవసరం ఏముంది? మంత్రం జపించకుండా, ఊరకే 'కాళీ! కాళీ' అని నామం ఉచ్చరిస్తే సరిపోదా?***

అమ్మ: నాయనా! మంత్రం ద్వారా శరీరం పరిశుద్ధమవుతుంది. దానితోపాటు మంత్రదీక్ష ద్వారా మనస్సుకు ఒక లక్ష్యం ఏర్పడుతుంది. మనస్సు కూడా పవిత్రం అవుతుంది. మనస్సు పవిత్రం కాకపోతే ఏదీ సిద్ధించదు. దాని మీదే సర్వం ఆధారపడి ఉంది. కాబట్టి, మంత్రదీక్ష తీసుకోవడం అవసరం. (శా.వ. 227)

***154 ప్రశ్న: అమ్మా! పిచ్చిపట్టిన ఆ యువకుడు గురుదేవుల దర్శనం కలగలేదన్న ఉక్రోషంతో జపమాలను మీమీద విసిరేసి, మీ మంత్రాన్ని మీరే తీసుకోండంటూ, విసురుగా వెళ్ళిపోయాడు. మంత్రాన్ని అలా తిరిగి ఇచ్చివేయడం సాధ్యమేనా?***

అమ్మ: అదెలా సాధ్యమవుతుంది నాయనా! అది జాగృతమైన మంత్రం. దానిని తిరిగి ఇవ్వలేరు. ఒకసారి ఒకరిని ప్రేమిస్తే ఆ ప్రేమ ఎప్పటికైనా మారుతుందా? మారదు గాక మారదు. ఇది కూడా అంతే. ఏదోవొక రోజు అతడికి మతిస్థిమితం కలుగుతుంది. అతడే అప్పుడు ఆయన పాదాల వద్ద క్షమాపణ కోరుకుంటాడు. (శా.వ. 259)

***155 ప్రశ్న: అమ్మా! ఎంతోమంది మీ దగ్గరికి మంత్రదీక్ష కోసం వస్తున్నారు. మీకు అనారోగ్యంగా ఉన్నా, ఓపిక లేకపోయినా కూడా వారికి మంత్రదీక్ష ఇవ్వడం మేము చూస్తున్నాము. ఎందుకలా చేస్తున్నారమ్మా?***

అమ్మ: నాయనా! వారిమీద జాలితో మంత్రదీక్ష ఇస్తున్నాను. నేను ఇవ్వలేనని ఎంత చెప్పినా వారు వదిలిపెట్టరు. పైగా నా దగ్గర విలపిస్తూ కూర్చుంటారు. ఏం చేసేదీ! హృదయం కరిగిపోయి, మంత్రదీక్ష ఇచ్చేస్తున్నాను. దాని వలన నాకు వచ్చే లాభం ఏముంది? మంత్రదీక్ష తీసుకున్న వారి పాపాలను స్వీకరించవలసి వస్తున్నది. – "సరే! ఎలాగూ నశించిపోయే శరీరమే కదా! కనీసం వారికి అయినా మంచి జరగనీ!" అనుకుంటూ వారికి మంత్రదీక్ష ఇస్తున్నాను. (శా.వ. 270)

***156 ప్రశ్న: అమ్మా! స్థిరచిత్తం లేని కొందరు భక్తులు వేరే గురువు దగ్గర మంత్రదీక్ష తీసుకున్నప్పటికీ, మళ్ళీ మీ దగ్గర కూడా మంత్రదీక్ష తీసుకుంటున్నారు. వారి గతి ఏమవుతుంది?***

అమ్మ: నాయనా! వారి విశ్వాసం దృఢమయ్యేటట్లు చేయమని గురుదేవులని ప్రార్థించి, నేను కూడా మంత్రం ప్రసాదిస్తాను. నేనిచ్చిన మంత్రం వారిలో నూతనమైన శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు. భగవన్నామం మీద వారికున్న విశ్వాసాన్ని బలపరుస్తుంది. (శా.వ. 201)

***157 ప్రశ్న: నేను రామకృష్ణ సాంప్రదాయంలో అధ్యక్ష స్వామి దగ్గర మంత్రదీక్ష తీసుకున్నాను. ఇప్పుడు 'యోగా'లో శిక్షణ పొంద డానికి ఇంకొక గురువు దగ్గరకు వెళుతున్నాను. ఇలా దీక్షా గురువునే కాక ఇతర గురువులను ఆశ్రయించడం తప్పేమోనని అనిపిస్తున్నది. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?***

అమ్మ: నాయనా! అందులో తప్పేమీ లేదు. అనేక విషయాలు నేర్చుకోవడానికి పలువురు గురువులను ఆశ్రయించడంలో తప్పేమీ లేదు. కానీ దీక్షాగురువుగా మంత్రదీక్ష ప్రసాదించిన గురువును తప్ప మరెవరినీ స్వీకరించకూడదు. (శా.వ. 181)

***158 ప్రశ్న: అమ్మా! నాతోపాటు మంత్రదీక్ష తీసుకున్న నా 'గురుభాయి' ఒకరు తన దీక్షామంత్రాన్ని మరచిపోయారు. ఆ మంత్రాన్ని చెప్పమని నన్ను మరీమరీ అడుగుతున్నారు. అలా చెప్పవచ్చా? సాధారణంగా దీక్ష ద్వారా తీసుకున్న మంత్రాన్ని ఎవరికీ చెప్పరాదనీ, దాని గురించి ఎవరితోనూ చర్చించరాదనీ మంత్రదీక్ష సమయంలో చెపుతారు కదా!***

అమ్మ: నాయనా! దీక్షామంత్రాన్ని సాధారణంగా ఎవరికీ చెప్పకూడదు. కానీ గురుభాయితో అంటే ఒకే గురువు దగ్గర మంత్రం తీసుకున్న వారితో చెప్పవచ్చు. తప్పులేదు. (శా.వ. 182)

***159 ప్రశ్న: (మంత్రదీక్ష తీసుకున్న బాలుడు) అమ్మా! మీరు నన్ను 108 సార్లు జపం చేయమని చెప్పారు. కానీ నాకు అది తృప్తిగా లేదు. కనీసం వెయ్యిసార్లు, కుదిరితే లక్షసార్లు జపం చేయాలని నా కోరిక. మీరేమంటారమ్మా!***

అమ్మ: కొత్తగా మంత్రదీక్ష తీసుకున్న మీకు ఇప్పుడిలాగే అనిపిస్తుంది. కానీ ఆ ఉత్సాహం స్థిరంగా ఉండదు. అంత జపం చేయలేరు. నువ్వు చేయవలసిన పనులెన్నో ఉంటాయి కదా! వాటన్నింటినీ చేస్తూ జపం కూడా ఎక్కువగా చేయ గలిగితే మంచిదే. ప్రయత్నించు నాయనా! (శా.వ. 166)

## 15. నామజపం, నామస్మరణ

***160 ప్రశ్న (భక్తురాలు): అమ్మా అప్పుడప్పుడు నా మనస్సు కలత చెంది, సుఖాలను ఆశిస్తుంది. పాపపు ఆలోచనలు మనస్సును చుట్టు ముడుతున్నాయి. దానితో నాకు భయం వేస్తోందమ్మా?***

అమ్మ: భయపడకమ్మా! కలియుగంలో మానసిక పాపాలు పాపాలు కావు. దీని గురించిన నీ మానసిక వ్యథలనన్నిటినీ తొలగించు. భయపడవలసిన పని లేదు. (ది.జ. 77, 78)

***161 ప్రశ్న: (విద్యార్థి): అమ్మా! విద్యార్థులమైన మేము ఎన్నిసార్లు జపం చేయాలి? వేయి, పదివేలు చేయాలా, ఇంకా ఎక్కువ చేయాలా?***

అమ్మ: మీరు విద్యార్థులు. ఎన్నో పాఠాలు చదువుకొని, పరీక్షలు వ్రాయాలి. అందుచేత మీరు ఎక్కువగా జపం చేయ లేరు. సమయం దొరికినపుడు అంచెలంచెలుగా జప సంఖ్యను పెంచవచ్చు. "రామకృష్ణ నామాన్ని పదిసార్లు జపిస్తే అదే గొప్ప విషయం అని శ్రీరామకృష్ణులే నాతో అన్నారు." ఈ కాలంలో స్వల్పప్రయత్నంతోనే విజయం ప్రాప్తిస్తుంది. (శా.వ. 474)

***162 ప్రశ్న: అమ్మా! ప్రగాఢమైన ప్రేమ లేకుండా కేవలం నామజపం చేయడం వలన ప్రయోజనమేముంది?***

అమ్మ: నాయనా! నీ అంతట నువ్వు కావాలని నీటిలోకి దూకినా, లేకపోతే ఎవరైనా నిన్ను నీటిలోకి పడద్రోసినా నీవు తడిసిపోతావు కదా? కాబట్టి, ప్రగాఢమైన ప్రేమ ఉన్నా, లేకపోయినా నామజప ప్రభావం తప్పకుండా ఉంటుంది. కాబట్టి, నామజపాన్ని వదలకూడదు సుమా! (శా.వ. 395)

***163 ప్రశ్న: అమ్మా! జపం, తపం వంటి సాధనలు చేస్తే ఉపయోగం ఏమిటి? భగవత్సాక్షాత్కారం లభిస్తుందా?***

అమ్మ: నాయనా! జపం, ధ్యానం వంటి ఆధ్యాత్మిక సాధనలు చేస్తే కర్మబంధాలు తెగిపోతాయి. అంతేకాక, ఇంద్రియ నిగ్రహం కూడా వస్తుంది. కానీ, భగవత్సాక్షాత్కారం కావాలంటే మాత్రం ప్రేమభక్తి తప్పక ఉండాలి. అది లేకుండా దైవ సాక్షాత్కారం కలగనే కలగదు సుమా! (శా.వ. 241)

***164 ప్రశ్న: (సాధువు): కొన్ని సమయాలలో పని ఒత్తిడి వలన జప ధ్యానాలకు ఆటంకం కలుగుతోందమ్మా! ఏమి చేయాలి?***

అమ్మ: పనులా? అవి ఎవరి పనులు? అవన్నీ ఆయన పనులే కదా! తీరిక దొరికినపుడు జపధ్యానాలు చేస్తూపోతే, కాలక్రమంలో నీ మనస్సే నీకు మార్గదర్శి అవుతుంది. (శా.వ. 471)

***165 ప్రశ్న: అమ్మా! నేను వచ్చే నెలలో ఎక్కువ రోజులు బస్సులలోనూ, రైలు బండ్లలోనూ ప్రయాణం చేయవలసి ఉంటుంది. బస్సులో కానీ, రైలుబండిలో కానీ ప్రయాణం చేస్తున్నప్పుడు జపం చేయడం ఎలా?***

అమ్మ: మనస్సులోనే అంచెలంచెలుగా చేయి. క్రమంగా పెదవులు మొదలైనవాటి కదలికలన్నీ ఆగిపోయి అంతా మనస్సులోనే జరగడం మొదలవుతుంది. జపం చేస్తూ ఉంటే, మన మనస్సే మనకు గురువుగా పరిణమిస్తుంది. (శా.వ. 479)

***166 ప్రశ్న: అమ్మా! జపధ్యానాలు ఎలా చేయాలి?***

అమ్మ: జపధ్యానాలకు ఒక నిర్ణీత సమయం కేటాయించడం ఎంతైనా అవసరం. సరైన సమయం (భగవద్దర్శనం కలిగే సమయం) ఎప్పుడు వస్తుందో ఎవరూ చెప్పలేరు. ఊహించని

సమయంలో 'ఆ తరుణం' అకస్మాత్తుగా వస్తుంది. ధనం ద్వారానూ, మానవ ప్రయత్నంతోనూ సాధించలేని అనేకమైన వాటిని కాలమహిమ సాధించగలుగుతుంది. అందువలన సమస్యల ఒత్తిడి ఎంతగా ఉన్నప్పటికీ కొన్ని నియమాలను అంటిపెట్టుకొని ఉండడం ఎంతో అవసరం. (శా.వ. 482)

***167 ప్రశ్న: అమ్మా! జపం ఎలా చేయాలి?***

అమ్మ: 'గురుదేవులు నాకు చెందిన వారు' అని ఎల్లప్పుడూ తలచుకుంటూ ఉండు. ఎలాంటి చింతనతో జపం చేస్తున్నావో అదే నీ మనస్సును ఆక్రమించి ఉంటుంది. (శా.వ. 487)

***168 ప్రశ్న: అమ్మా! మంత్రాన్ని ఊరకే జపిస్తే చాలదా? వ్రేళ్ళతో లెక్కిస్తూనే జపం చేయాలా?***

అమ్మ: నాయనా! భగవంతుడు మనకు వ్రేళ్ళను ఇచ్చింది జపం చేసే భాగ్యం పొందాలనే కదా! కాబట్టి వ్రేళ్ళతో లెక్క పెడుతూ జపం చేయడం మంచిది. (శా.వ. 246)

***169 ప్రశ్న: అమ్మా! జపం చేసేటప్పుడు మనస్సు ఎందుకు చక్కగా దాని మీద లగ్నమవ్వడం లేదు?***

అమ్మ: నాయనా! అవన్నీ నిరంతరం చేసే అభ్యాసం వల్ల మాత్రమే సాధ్యమవుతాయి. మనస్సు వశమవ్వ లేదని జపం చేయడం మానుకోవద్దు. నువ్వు అభ్యసిస్తున్న దానిని విడువ కుండా అభ్యసించు. భగవంతుని పవిత్రనామాన్ని జపిస్తూ ఉంటే, క్రమేణా నీ మనస్సు దానంతట అదే నీ వశమవు తుంది. గాలి వీచినప్పుడు దీపశిఖ నిలకడగా ఉండదు. అదే విధంగా కోరికలున్నంతవరకూ మనస్సు నిలకడగా ఉండదు. మంత్రాన్ని సరిగా ఉచ్చరించకపోతే కూడా విజయం

సిద్ధించడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఒక స్త్రీకి 'రుక్మిణీనాథాయ' అనే మంత్రం ఇచ్చారు. కానీ ఆమె, 'రుక్కు–రుక్కు' అని జపం చేసేది. ఆ కారణం వలన ఆమె పురోగమించడానికి ఆటంకం వచ్చింది. తర్వాత దైవకృప వల్ల ఆమెకు సరైన మంత్రం లభించింది. (శా.వ. 399)

### *170 ప్రశ్న: అమ్మా! మనస్సు ఏకాగ్రం కావడానికి ఎంత జపం చేయాలి?*

అమ్మ: రోజుకు పదివేల సార్లు. కాదు కాదు, ఇరవై వేల సార్లు చేయాలి. ఐనా నీ శక్తి మేరకు సాధ్యమైనంత ఎక్కువ జపించు. (శా.వ. 76)

### *171 ప్రశ్న: అమ్మా! కేవలం భగవన్నామ స్మరణ సరిపోతుందా? మంత్రజపం అవసరం లేదా?*

అమ్మ: నాయనా! నేనిందాక భగవన్నామ స్మరణ సరిపోతుం దని చెప్పాను కదా! అది బయటకు వెళ్ళినపుడు మాత్రమే! ఆశ్రమంలో కానీ, ఇంట్లో కానీ ఉన్నప్పుడు తప్పక మంత్రజపం చేయాలి. అయితే మనస్సును ఏకాగ్రం చేసి, ఒకసారి నామోచ్చారణ చేస్తే అది లక్షసార్లు జపం చేయడానికి సమాన మవుతుంది.

మనస్సును ఏకాగ్రం చేయకుండా రోజంతా జపం చేసినా ప్రయోజనం ఉండదు. మనస్సు ఏకాగ్రం చెంది నపుడే భగవత్కృప సిద్ధిస్తుంది. ఇంకొక మాట చెప్పేదా? "ధనికులు దానం ద్వారా సేవ చేయాలి. అది లేనివారు జపతపాదుల ద్వారా సేవ చేయాలి!" అనేవారు గురుదేవులు. (శా.వ. 102)

***172 ప్రశ్న: అమ్మా! పెద్దరాయిని ఛాతీమీద ఉంచుకొని బద్దలు కొట్టి ప్రదర్శించి చూపితే మీరు చాలా ఆశ్చర్యపోయారు. వీరేమైనా మంత్రతంత్రాలు నేర్చారా? అని అడిగారు. అదేం లేదమ్మా! అంతా అభ్యాసమే! క్రమక్రమంగా అభ్యాసం చేసి బలాన్నీ, శక్తినీ సంతరించుకుంటారు!***

అమ్మ: చూడు! అభ్యాసానికి ఎంత శక్తి ఉన్నదో! అదే విధంగా మంత్రాన్ని జపించి సాధకుడు పరిపూర్ణ స్థితిని సంతరించుకుంటాడు. "జపాత్ సిద్ధి! జపాత్ సిద్ధి!" (జపంతో సిద్ధి! జపంతో సిద్ధి!) (శా.వ. 164)

***173 ప్రశ్న: అమ్మా! ఈ మర్రి విత్తనం చూడండి! ఎంత చిన్నదో! కాని దీనినుంచి బ్రహ్మాండమైన వటవృక్షం పుట్టుకువస్తుంది. ఏమి అద్భుతం!***

అమ్మ: అవును నాయనా! ఆ సూక్ష్మమైన విత్తనం వంటిదే బీజమంత్రం. దానినుంచి చైతన్యం, భక్తి, ప్రేమ ఇత్యాదులన్నీ జనిస్తాయి. అది కూడా మహాద్భుతమే కదా! (శా.వ. 300)

***174 ప్రశ్న (సురేంద్ర): అమ్మా! రోజూ మూడుసార్లు జపం చేయలేక పోతున్నాను. నేనేం చేయాలి?***

అమ్మ: ఫరవాలేదులే నాయనా! గురుదేవులను స్మరించుకో! కుదిరినప్పుడు జపం చేయి. ఐనా మానసికంగా ఆయనకు ప్రణామం చేసుకోవచ్చు కదా! (శా.వ. 307)

## 16. గురువు

***175 ప్రశ్న: అమ్మా! గురువుతో అతిసాన్నిహిత్యం వలన ఆయన ఎడల భక్తివిశ్వాసాలు తగ్గిపోతాయంటారు కదా! మీరేమంటారు?***

అమ్మ: నాయనా! ఇలాంటి విషయాలు ఆలోచిస్తూ మీ మనస్సులను పాడు చేసుకోకండి. అలా ఆలోచించి నాతోపాటు ఎవరూ ఉండకపోతే నా పనులు ఎలా సాగుతాయి? నన్ను అలా మహానుభావురాలిలాగానో, దైవంగానో భావించకుండా ఒక మానవమాత్రురాలిగా భావించి సేవచేస్తే చాలు. నీ భక్తి విశ్వాసాలు తగ్గిపోతాయేమోననే భయం వద్దు. (శా.వ. 331)

***176 ప్రశ్న: అమ్మా! అర్ధరాత్రి ఒంటిగంటయింది. మీరింకా నిద్రపోలేదా? ఏమి చేస్తున్నారమ్మా? మీ ఆరోగ్యం బాగాలేక, కూర్చోలేని స్థితిలో కూడా ఇంకా ఎక్కువగా జపం చేస్తున్నారెందుకమ్మా?***

అమ్మ: ఏమి చేయమంటావు నాయనా? నా బిడ్డలు ఆతురతగా వచ్చి మంత్రదీక్ష తీసుకుంటారు. కానీ ఆ తరువాత ఎందరు శ్రద్ధగా జపం చేస్తారు? చాలామంది అసలు జపమే చేయరు. వారి బాధ్యత తీసుకున్న గురువుగా నేను వారి సంగతి చూసుకోవాలి గదా. అందుకే ఈ వృద్ధాప్యంలో, అనారోగ్యంతో వున్నా, వారి కోసం జపం చేస్తున్నాను. అంతేకాదు – "గురుదేవా! ప్రభూ! వారిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేయండి! వారికి ముక్తిని ప్రసాదించండి! ఈ లోకంలో ఎన్ని కష్టాలు, క్లేశాలు! ఇందులోకి వాళ్ళను మళ్ళీ రానీయకండి!" అని ప్రార్థిస్తున్నాను. (శా.వ. 342, 343)

***177 ప్రశ్న: అమ్మా! కొందరు ఒక గురువు వద్ద మంత్రదీక్ష తీసుకుంటారు. మరొక గురువు వద్ద సన్న్యాసదీక్ష తీసుకుంటారు. మరి ధ్యానసమయంలో ఏ గురువును ధ్యానించాలి?***

అమ్మ: నాయనా! మంత్రదీక్ష ఇచ్చినవారే గురువు. ఆ మంత్రం నుంచే అంచెలంచెలుగా త్యాగమూ, వైరాగ్యమూ, సన్న్యాసమూ – అన్నీ సిద్ధిస్తాయి. కాబట్టి ధ్యానసమయంలో మంత్రదీక్షను ప్రసాదించిన గురువునే ధ్యానించాలి. (శా.వ. 400)

***178 ప్రశ్న (ఒక సన్న్యాసిని): అమ్మా! మా స్నేహితుడి గురువుగారు "సాకారోపాసనలో ఏమీ లేదు. సూర్యుణ్ణి, అగ్నిని పూజించండి!" అంటున్నారు. సాకారోపాసనలో సత్యం ఏమైనా ఉందా? మీ అభిప్రాయం తప్పకుండా చెప్పాలమ్మా!***

అమ్మ: మీ గురువుగారు చెప్పిన తర్వాత ఆ విషయం గురించి నన్ను అడగడం సమంజసం కాదు. అయినా మీరు ఒత్తిడి చేస్తున్నారు కాబట్టి నా అభిప్రాయం చెపుతున్నాను. అనాదిగా ఎందరో సాకారోపాసన చేసి ముక్తి పొంది ఉన్నారు. అవన్నీ కేవలం కట్టుకథలా? మన గురుదేవులకు ఇటువంటి సంకుచిత అభిప్రాయం ఉండేది కాదు. ఒక ఉదాహరణ చెపుతాను విను!

ఒక చెట్టుమీద రకరకాల రంగులున్న పక్షులు వాలతాయి. అవి రకరకాలుగా కూస్తూ ఉంటాయి. అవి నానారకాలుగా కూస్తున్నా వాటన్నింటినీ పక్షికూతలనే అంటాము. కానీ ఆ కూతలు విని వాటిలో ఒకటే పక్షి అనీ, మిగిలినవి కావనీ చెప్పకూడదు కదా! అలాగే సాకారోపాసన, నిరాకారోపాసన – అన్నీ దేవుని చేర్చే మార్గాలే. దేనినీ ఖండించకూడదు. (శా.వ. 32)

***179 ప్రశ్న: అమ్మా! మా కులగురువు 'గోవింద గోసాయి'. కానీ నాకు ఆయన దగ్గర మంత్రం తీసుకోవడం ఇష్టం లేదు. మీ దగ్గరే మంత్రదీక్ష తీసుకుందామనుకుంటున్నాను. నన్ను అనుగ్రహిస్తారా అమ్మా?***

అమ్మ: లేదు నాయనా! నేను నీకు మంత్రదీక్ష ఇవ్వలేను. కులధర్మాలను విడనాడడం మంచిది కాదు. సామాజిక ఆచార వ్యవహారాల ప్రకారం ప్రవర్తించడం మంచిది. కాబట్టి నీ కుల గురువైన గోవిందగోసాయి దగ్గరే మంత్రదీక్ష తీసుకో! (శా.వ. 299)

***180 ప్రశ్న (ఒక సన్న్యాసిని): అమ్మా! గురునింద చేయరాదని పెద్దలు అంటారు. అయినా ఆపుకోలేక చెపుతున్నాను. మా గురువు గారికి కోర్టులు, వ్యాజ్యాలు అంటే చాలా ఇష్టం. ఇప్పుడు వయస్సు మీరటం వలన అవన్నీ చేతగావడం లేదు. మరోవైపు అప్పులవాళ్ళు ఆయనకు నోటీసులు ఇస్తున్నారు. ఈ సమస్య ఆయనను క్రుంగదీస్తున్నది. నేనేం చేయను? గురువుగారి సమస్యలను కొంచెం మేరకైనా తీరుద్దామనుకుంటున్నాను. నలుగురి దగ్గరా డబ్బు పోగుచేస్తున్నాను.***

అమ్మ: గురువుకు ఇష్టం లేకపోయినా నిజాన్ని ధైర్యంగా ఆయనతో చెప్పవచ్చు. దానిలో దోషం లేదు. అయినప్పటికీ గురుభక్తి ఉండాలి. గురువు ఎటువంటి వ్యక్తి అయినా, ఆయన పట్ల భక్తి ఉంటే నిశ్చయంగా ముక్తి లభిస్తుంది. (శా.వ. 16)

## 17. పతనం

***181 ప్రశ్న: అమ్మా! ఇతరులలో లోపాలు చూడవద్దని మీరు చెపుతూ ఉంటారు. కానీ అలా చూడక తప్పడం లేదు. దాని వలన ఏమవుతుంది?***

అమ్మ: నాయనా! నీ మనస్సులో లోపం ఉన్నప్పుడే నీవు ఇతరులలోని లోపాలను చూస్తావు. వాళ్ళ లోపాలు ఎత్తి చూపితే ఆ వ్యక్తికి ఏమన్నా జరుగుతుందా ఏమిటి? నువ్వే అధోగతి పాలవుతావు. నేను ఎవరిలోనూ లోపాలను చూడలేను. బాల్యం నుంచీ నా స్వభావం అటువంటిది. నాకు ఎవరైనా చిన్న సహాయం చేసినా, ఆ వ్యక్తిని ఎల్లప్పుడూ జ్ఞాపకం ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాను. (శా.వ. 286)

***182 ప్రశ్న: అమ్మా! గొప్ప వ్యక్తులు సైతం దిగజారిపోవడం చూస్తుంటే మనస్సులో చాలా బాధగా ఉంది. మేము కూడా ఇలానే దిగజారిపోతామేమోనని భయం వేస్తోందమ్మా?***

అమ్మ: భయపడకు నాయనా! భోగవస్తువుల మధ్య జీవిస్తున్నప్పుడు వాటిని అనుభవించాలన్న కోరిక కలుగుతుంది. అపుడే దిగజారే అవకాశం ఉంటుంది. కాబట్టి జాగ్రత్తగా ఉండు, నాయనా! నువ్వు ఒక సన్న్యాసివి. నీవరకూ నీవు ఒక స్త్రీ యొక్క బొమ్మను కూడా చూడకూడదు. వారు ఉన్నవైపుకు కూడా నీవు వెళ్ళవద్దు! (శా.వ. 392)

***183 ప్రశ్న: అమ్మా! మహాత్ముల సన్నిధిలో సేవచేసే వారిలో కొందరు సేవకులు ఎందుకు పతనం చెందుతారు?***

అమ్మ: ఒక మహాత్ముడుంటే ఆయన చుట్టూ నలువైపులా తేజస్సు వ్యాపించి ఉంటుంది. ఆయనకు సేవలు చేయడానికి వచ్చేవారంతా ఆ తేజస్సులో తమనుతాము మైమరచిపోయి,

ఆ మహాత్ముని ద్వారా తమకు లభించే కీర్తి, ఖ్యాతి మాత్రమే తమ సర్వస్వమని అనుకుని వాటిలోనే మునిగిపోతారు. అదే కారణంగా వారి అహంకారం పెరిగిపోతుంది. ఒక మహాత్ముణ్ణి నిజాయితీగా సేవించేవారు ఎంతమంది ఉంటారో చెప్పు? ఒక కథ చెపుతా విను! నిశ్చలమైన ఒక చెరువు నీటిలో చంద్రబింబం కూడా ప్రతిఫలిస్తున్నది. దాన్ని చూసి చిన్నచిన్న చేపలు ఎంతో సంతోషించాయి. ఆనందంగా నీటిలో ఆడుతూ, నీటి మీది చంద్రుడి ప్రతిబింబం కూడా తమ లాంటి చేపేనని భావిస్తూ, హాయిగా ఆడుకున్నాయి. కానీ చంద్రుడు నిష్క్రమించగానే, ప్రతిబింబం కూడా మాయమయ్యేసరికి చేపలు నిర్ఘాంతపోయాయి. మహాత్ములను సేవించేవారి తీరు ఇదే విధంగా ఉంటుంది సుమా! (శా.వ. 331)

***184 ప్రశ్న: అమ్మా! మీ సేవ చేసేవాళ్ళలో కొందరు దుర్మార్గులమ్మా! వారిని గురించి మీరేమి చెపుతారు?***

అమ్మ: ఇదిగో చూడు! సేవాపరాధం తలెత్తడం సహజం. అంటే సేవచేసే వారిలో, తాము ఎవరిని సేవిస్తున్నారో వారు తమకే లోబడివున్నారని అనుకుంటూ, అలాగే ఉండాలని కోరి, పట్టుబట్టే అహంకారం తలెత్తుతుంది. చివరకు సేవలందుకునే మహాత్ముడు తన మాటే వినాలని ఆకాంక్షిస్తారు. అంతేకాదు, ఆయన కూర్చున్నా, నిలబడినా, లేచినా తమ ఆదేశానుసారమే చేయాలని భావిస్తారు. ఆపైన వారిలో సేవాభావం పూర్తిగా నశించిపోతుంది. అటువంటి వారే దుర్మార్గులుగా తయారవుతారు. కానీ తమ సుఖాలు, సౌకర్యాలు అన్నీ విస్మరించి, ఆ మహాత్ముని సుఖదుఃఖాలనే తమవిగా భావించి సేవించే వారికి సేవాపరాధం ఎలా చుట్టుకుంటుంది? (శా.వ. 331)

## 18. పాపాలు - పరిహారం

***185 ప్రశ్న: అమ్మా! ఒక భక్తురాలు తన పాపాలన్నింటి గురించి గురుదేవులకు చెప్పకొని వాటినుంచి విముక్తి పొందిందని చెప్పారు కదా! అదెలాగమ్మా? నోటితో చెప్పినంత మాత్రాన పాపాలు పోతాయా? ఆ విధంగా పాపప్రక్షాళన చేసుకోవచ్చా?***

అమ్మ: అలా చేసుకోవడం ఎందుకు సాధ్యం కాదు? ఆయనొక మహాపురుషుడు. ఆయనకు విన్నవించుకుంటే పాపాలు తొలగిపోవా ఏమిటి? తప్పక తొలగిపోతాయి. శాంతి కలుగుతుంది. (శా.వ. 56)

***186 ప్రశ్న: అమ్మా! ఆ వ్యక్తి తప్పు చేశాడు. అతడికి తగిన శిక్ష వేయరెందుకు?***

అమ్మ: నేను అతడికి తల్లిని అయివుండి అతణ్ణి ఎలా దండించగలను? (శా.వ. 486)

***187 ప్రశ్న: అమ్మా! ఆ యువకుడు దుర్మార్గుడుగా తయారయ్యాడు. ఇక మీదట అతణ్ణి ఇక్కడకు రానివ్వకూడదు. మీరు ఇక్కడకు రావద్దని అతడితో ఎందుకు చెప్పరు?***

అమ్మ: నేను అతడితో ఇక్కడికి రావద్దని చెప్పలేను. నా దగ్గరికి రాకపోతే మరెక్కడికి పోగలడు? నేను మంచివారికి మాత్రమే తల్లినా? దుర్మార్గులకు కూడా నేను తల్లినే! (శా.వ. 486)

***188 ప్రశ్న (యోగీన్‌మా): అమ్మా! ఆ భక్తుణ్ణి కాస్త మందలించండి!***

***లేకపోతే పక్కదారులు పడుతున్న అతడి పరిస్థితి ఇంకా విషమిస్తుంది!***

అమ్మ: యోగీన్! ఆ పని నేను చేయలేను. ఒకవేళ నేను చెప్పినా, అందుకు తగినట్టు అతడు తన జీవితం గడపలేడు. నేను అతడి గురువును కాబట్టి, నా మాటలను పెడచెవిని పెడితే అది అతడికే హాని చేస్తుంది. నా బిడ్డకు హాని కలిగితే నేను భరించగలనా? అందుకే నీవు చెప్పినట్లు అతణ్ణి నేను మందలించలేను. (శా.వ. 486)

***189 ప్రశ్న: అమ్మా! ఎవరిని చూసినా నాకు వారి తప్పులే కనిపిస్తున్నాయి. అలా చూడడం మంచిదేనా?***

అమ్మ: నాయనా! మనిషి అన్నాక తప్పులు చేయకుండా ఉండడు కదా! ఆ తప్పుల్ని మనం పట్టించుకోకూడదు. ఇతరులలో తప్పులు చూడడం వలన మనిషి తనకు తానే హాని చేసుకుంటాడు. ఎవరి తప్పులూ చూడకు. ఇతరులలోని తప్పులు చూడడం మొదలుపెడితే, అదే నీ స్వభావంగా మారిపోతుంది సుమా! (శా.వ. 379)

***190 ప్రశ్న: అమ్మా! నేను చేసిన పాపాలు తలచుకుంటుంటే భయం వేస్తున్నది. ఇక నా గతి ఏమిటి? నేను పాతాళానికి క్రుంగిపోవలసిందేనా?***

అమ్మ: అదేంటి నాయనా! నా బిడ్డ పాతాళానికి క్రుంగిపోవటమా? అలా ఎన్నటికీ జరగదు. ఇక్కడికి ఎవరైతే వస్తున్నారో, ఎవరు నా సంతానమో, వారికి ముక్తి తప్పక లభిస్తుంది. నా బిడ్డలను పాతాళానికి నెట్టడానికి విధి సైతం సాహసించదు సుమా! (శా.వ. 183)

## 19. వైరాగ్యం

***191 ప్రశ్న: అమ్మా! ఆ యువకుడు వివాహం చేసుకోలేదు. దైవభక్తి ఉన్నది. అతని గతి ఏమవుతుంది?***

అమ్మ: నాయనా! వివాహం చేసుకోని వారు భగవంతుణ్ణి ప్రార్థించినా, ప్రార్థించకపోయినా ముక్తిపథంలో సగం విజయం సాధించినట్లే! భగవద్భక్తి కొంచెం ఉన్నా సరే, అటువంటివారు చాలా శీఘ్రంగా ఆధ్యాత్మిక పురోభివృద్ధి పొందగలుగుతారు. సందేహం లేదు. (ది.జ. 104)

***192 ప్రశ్న: అమ్మా! ఒక వ్యక్తి తనకు తానుగా ఏమి చేయగలడు? అంతా భగవంతుడే చేయిస్తున్నాడు కదా?***

అమ్మ: అవునమ్మా! అంతా భగవంతుడే చేయిస్తున్నాడన్నది నిజమే కానీ ఆ ఆలోచన ఎప్పుడూ మనస్సులో మెదులుతూ ఉండాలి కదా! అహంకారం తలకెక్కి 'అన్నీ నేనే చేస్తున్నాను. నేనెవ్వరినీ ఆశ్రయించి ఉండవలసిన పని లేదు!' అంటూ ఆర్భాటం చేస్తుంటాడు మనిషి. ఎవరు భగవంతుని మీదనే విశ్వాసం ఉంచి జీవిస్తున్నారో, వారిని ఆయనే ఆపదలనుంచి ఎల్లప్పుడూ కాపాడుతున్నారు కదా! (శా.వ. 393)

***193 ప్రశ్న (ప్రబోధ్ బాబు): అమ్మా! బలవంతంగా సంసారంలో జీవించడం సబబేనా?***

అమ్మ: అనేకమంది చేసేది అదేగా నాయనా! అంతేకాదు. మహామాయ అనుగ్రహం పొందకుండా ఇష్టానుసారం సంసారాన్ని త్యజిస్తే ఇక్కట్లు తప్పవు. అటువంటి వ్యక్తి సంసార జీవితానికి తిరిగివచ్చేస్తాడు. ఆపైన, లౌకిక జీవితం ఒక విష

వృక్షమన్న వాస్తవాన్ని గ్రహించగలిగినా గృహస్థజీవితం గడుపుతున్న వారు ఏమీ చేయలేరు. (శా.వ. 110-111)

***194 ప్రశ్న: అమ్మా! ముక్తి పొందడానికి సాధన చేస్తూ పాటుపడాలని మీరు అంటారు కానీ ఎలా పాటుపడాలో చెప్పండమ్మా?***

అమ్మ: నాయనా! గురుదేవులు చెప్పినట్లు త్రోసిపుచ్చవలసిన వాటిని త్రోసిపుచ్చి, స్వీకరించవలసిన వాటిని స్వీకరించి, ఇష్టదైవాన్ని ఏకాగ్రమైన చిత్తంతో ప్రార్థన చేస్తే అంతా సాధ్యమౌతుంది. అపుడు అసాధ్యం కూడా సుసాధ్యమే! (శా.వ. 193)

***195 ప్రశ్న (ఒక భక్తురాలు): అమ్మా! భర్తను సేవించడం ద్వారానే భగవంతుణ్ణి పొందవచ్చని శాస్త్రాలు చెపుతున్నాయి. భర్తకు నచ్చకపోయినా భార్య కొంతమేరకు ఆత్మనిగ్రహం పాటిస్తే తప్పా?***

అమ్మ: ఆ ప్రయత్నం భగవంతుని నిమిత్తం అయితే దానిలో తప్పు లేదు. ఎలా తప్పవుతుంది? ఆత్మనిగ్రహం ఎంతో అవసరం. వితంతువులకు అన్ని కఠోరమైన నియమాలను విధించడం ఆత్మనిగ్రహం కోసమే! (శా.వ. 79)

***196 ప్రశ్న (ఒక సన్న్యాసి): అమ్మా! కుటుంబం, తల్లిదండ్రులు, బంధువులు - అందరినీ త్యాగం చేసి మఠంలో చేరాను. కానీ ఇక్కడ కూడా సంసారంలోలాగానే బాధ్యతలూ, కర్తవ్యాలూ, గొడవలూ - అన్నీ ఉంటున్నాయి కదమ్మా?***

అమ్మ: నాయనా! ఆశ్రమ జీవితం కూడా ఒక రకంగా సంసార జీవితం లాంటిదే! అయితే ఇక్కడ ఈ గొడవల మధ్యలో కూడా భగవత్సాన్నిధ్యాన్ని అధికంగా అనుభూతి చేసుకోగలుగుతారు. (శా.వ. 481)

***197 ప్రశ్న: అమ్మా! భక్తులు ఎటువంటి వారైనా సరే, సరిగా ఉన్నా లేకపోయినా, మీ అనుగ్రహం వలన, దీవెనల వలన వారు రక్షించబడతారు కదా?***

అమ్మ: అలా అనకు నాయనా! నా అనుగ్రహం వలననే అంతా జరుగుతుందని అనుకోకు. నేను ఏమీ కాను. సమస్తమూ గురుదేవులే! మీలోని వైరాగ్యాన్ని బట్టి ఆయనే అనుగ్రహించి, ఆశీర్వదిస్తారు. నేను కేవలం ఆయన చేతిలో పరికరాన్ని మాత్రమే సుమా! (శా.వ. 201)

***198 ప్రశ్న: అమ్మా! ఇక్కడికి వచ్చేవారికి ఇదే ఆఖరి జన్మ అని గురుదేవులు చెప్పారు కదా! కానీ సర్వసంగపరిత్యాగం లేకపోతే ముక్తి లభించదని స్వామీజీ అన్నారు. ఈ రెంటినీ వింటుంటే, ముఖ్యంగా స్వామీజీ చెప్పినది తలచుకుంటే, మాకు చాలా భయం వేస్తున్నది. గృహస్థుల గతి ఇంతేనా? వారికేది దారి?***

అమ్మ: నాయనా! గురుదేవులు చెప్పిందీ నిజమే, నరేన్ చెప్పింది కూడా నిజమే! గురుదేవులు చెప్పింది గృహస్థులకు సంబంధించినది. గృహస్థులకు కావలసింది ఆంతరిక సన్న్యాసం. వారు బాహ్యంగా సన్న్యాసం స్వీకరించనవసరం లేదు. ఆ ఆంతరిక సన్న్యాసం కూడా సహజంగా సిద్ధించాలి. ఇక స్వామీజీ చెప్పింది సన్న్యాసుల కోసం. వారికి బాహ్యా సన్న్యాసం కూడా అవసరం. అయితే అది గృహస్థులకు అవసరం లేదు. మీబోటి సంసారులు స్వామీజీ మాటలు విని భయపడనవసరం లేదు. గురుదేవులను శరణువేడి, జీవిస్తూ, ఆయన మీతో ఉన్నారన్న నిజాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటే, ఆయనే మీ సంగతంతా చూసుకుంటారు. (శా.వ. 180)

***199 ప్రశ్న (స్వామి అరూపానంద): అమ్మా! నేను సన్న్యాసం తీసుకుందామనుకుంటున్నాను. మా ఇంట్లోని వారేమో నన్ను ఇంటిలోనే ఉండమనీ, ఆశ్రమం నుంచి తిరిగి రమ్మనీ బలవంతం చేస్తున్నారు. నాకు ఇంటికి వెళ్ళడం ఇష్టం లేదు. మీ సలహా ఏమిటమ్మా?***

అమ్మ: నాయనా! ఇంటికి వెళతావా అని అడిగానో లేదో అంత గట్టిగా విలపించావే! ఏడవకు, నాయనా! మీరంతా దైవాంశ సంభూతులు. భగవంతుని కోసం సర్వస్వం త్యజించడం ఎవరికి సాధ్యం? భగవంతుణ్ణి శరణు జొచ్చినప్పుడు విధివ్రాత తనంతటట తానే చెరిగిపోతుంది. భగవదనుభూతి పొందిన వ్యక్తికి రెండు కొమ్ములు పుట్టుకొస్తాయా? లేదు. అతడిలో నిత్యానిత్యవివేకం జనిస్తుంది. దివ్యప్రేరణ కలుగుతుంది. కాబట్టి నాయనా! సన్న్యాసం తీసుకుందామన్న ఆశయం చాలా మంచిది. దానికే కట్టుబడి ఉండు! (శా.వ. 239)

***200 ప్రశ్న: అమ్మా! త్యాగవైరాగ్యాలే ముఖ్యం కదా. అవి మాకు ప్రాప్తిస్తాయా?***

అమ్మ: ఎందుకు ప్రాప్తించవు? గురుదేవులను శరణువేడితే, అన్నీ లభిస్తాయి. త్యాగమే ఆయనకున్న సంపద. ఆయన సర్వస్వాన్నీ పరిత్యజించినందువల్లనే మనమందరమూ ఆయన పేరు చెప్పుకుని, ఇలా హాయిగా తిని తిరుగుతున్నాం. ఆయనను అనుసరిస్తే త్యాగవైరాగ్యాలు తప్పక ప్రాప్తిస్తాయి. (శా.వ. 275)

***201 ప్రశ్న: అమ్మా! శ్రీరామకృష్ణమఠ స్వామీజీలు సేవాశ్రమాలలోనూ, ఆసుపత్రులలోనూ పనిచేయడం, పుస్తకాలు అమ్మడం, జమాఖర్చుల పద్దులు చూడడం లాంటి పనులు చేయడం సబబు కాదు కదా? గురుదేవులు ఇలాంటి పనులు ఎప్పుడైనా***

***చేశారా? ఆత్మ సాక్షాత్కారం కోసం మఠంలో చేరేవారికి ఈ రకం పనులు అప్పగించడం సమంజసమేనా? వాళ్ళు పనంటూ ఏదైనా చేయవలసివస్తే పూజ, జపం, ధ్యానం, భజన వంటివి చేయవచ్చు గానీ, ఏవేవో రకరకాల పనులు చేస్తూ ఉంటే, వాటివల్ల కోరికలలో చిక్కుకుపోయి, భగవంతుణ్ణి మరచి పోయి, భగవన్మార్గం నుంచి వైదొలగే ప్రమాదం ఉంది కదా?***

అమ్మ: అదేంటి నాయనా! అలా మాట్లాడుతున్నావు? సేవా కార్యక్రమాలు, ఇతర పనులు చేయకపోతే రాత్రింబవళ్ళూ మఠంలో ఏమి చేస్తారు? ఇరవై నాలుగు గంటలూ జపధ్యానాలు చేస్తూ ఉండడం సాధ్యమయ్యే పనేనా? నువ్వు గురుదేవుల గురించి ప్రస్తావించావు కదా? ఆయన సంగతే వేరు. ఆయన ఆహారాదులన్నింటినీ మధురబాబే ఏర్పాటు చేసేవాడు. కానీ మఠంలో చేరిన సాధువులకు ఎవరు నిత్యావసరాలను ఏర్పాటు చేస్తారు? వాళ్ళు ఏదోవొక పనిని నిస్వార్థంగా చేస్తున్నందువలననే వారికి ఆహారం లభిస్తోంది. లేకపోతే పిడికెడు మెతుకుల కోసం ఇంటింటికీ తిరిగి బిచ్చమెత్తవలసి వచ్చేది. దాంతో అనారోగ్యం పాలయ్యేవారు. పైగా ఈ రోజుల్లో సాధువులకు భిక్ష ఇచ్చేవారు ఎంతమంది ఉన్నారు? కాబట్టి నాయనా, అటువంటి మాటలు ఎన్నడూ అనవద్దు. ఎవరైనా అన్నా, నీవు పట్టించుకోవద్దు. పైగా వారు ఈ పనులన్నీ చేస్తూ కూడా మోక్షం కోసం సాధన చేస్తూనే ఉంటారు సుమా! ఇదంతా గురుదేవుల నిర్దేశం ప్రకారమే జరుగుతోంది. రామకృష్ణ మఠాలు ఈ తీరులోనే నిర్వహించ బడతాయి. నిర్వహించబడాలి! అర్థమయిందా? (శా.వ. 280)

***202 ప్రశ్న: అమ్మా! నేను సాధువును కాగోరుతున్నాను. మీ సలహా కావాలి?***

అమ్మ: నాయనా! సాధువు కాగోరితే మొట్టమొదట భగవంతుణ్ణి పొందడానికి ఏమేరకు నీకు మనోవ్యాకులత ఉందో గమనించి, తెలుసుకో! భగవంతుడు తప్ప మరేదీవద్దని నీ మనస్సు నీకు దృఢంగా చెప్పగలిగితే, అప్పుడు సన్న్యాసం స్వీకరించవచ్చు. అటువంటి సుస్థిరత, దృఢసంకల్పం లేకపోతే వైరాగ్యం నిలకడగా ఉండదు. (శా.వ. 461)

***203 ప్రశ్న (ఒక సన్న్యాసి): అమ్మా! మేం ఎంతో జాగ్రత్తగా జీవించాలి కదా! మనస్సు ఎక్కడ దిగజారిపోతుందోనని ఎప్పుడూ భయపడుతూనే ఉండాలి.***

అమ్మ: అవును నాయనా! నువ్వు చెప్పేది నిజమే! సన్న్యాసి చలువచేసిన తెల్లని వస్త్రం లాంటివాడు. గృహస్థు నల్లని వస్త్రం లాంటి వాడు. నల్లని వస్త్రంలో మరకలు అంతగా కనిపించవు. కానీ తెల్లని వస్త్రం మీద చిన్న సిరాబొట్టు సైతం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఈ లోకం కామకాంచనాలలో మునిగితేలుతోంది. సన్న్యాసులు ఎంతో జాగ్రత్తగా, తీవ్రవైరాగ్యాన్ని అలవరచుకోవాలి. అందుకే గురుదేవులు 'సాధూ! అప్రమత్తుడవై మసలుకో!' అని చెప్పేవారు. (శా.వ. 78)

***204 ప్రశ్న: అమ్మా! పిల్లలందరూ మీకు సమానమే కదా! కానీ మీరు సలహాలిచ్చేటప్పుడు గృహస్థజీవితం కోరుకునే వారికి అందుకు అనుమతిస్తున్నారు. మరొకవైపు, సన్న్యాస జీవితం కోరుకునే వారికి కూడా ఆ జీవిత త్యాగమయ జీవితపు ఔన్నత్యాన్ని శ్లాఘిస్తూ దారిచూపుతున్నారు. ఏ మార్గం అందరికీ శ్రేయస్కరమో దానిలోకే అందరినీ తీసుకుపోరాదా?***

అమ్మ: భలే చెప్పావమ్మా! అలా ఎలా కుదురుతుంది? ఒకే మార్గం అందరికీ అనువుగా ఉంటుందా చెప్పు? సుఖభోగాలు కోరేవారు వాటిని త్యాగం చేయమంటే వింటారా? అందుకనే వారి ఇచ్ఛను గమనించి, వారికి ఆ విధమైన సలహా ఇస్తాను. అలాగే 'విషయసుఖాలన్నీ మాయ, భగవంతుడొక్కడే నిత్యం!' అనే సత్యాన్ని తమ పూర్వజన్మ సుకృతం వలన అవగతం చేసుకున్నవారిని సన్న్యాసజీవితం స్వీకరించమని చెప్పి నేను ఒకింత సాయపడకూడదా? (శా.వ. 332)

***205 ప్రశ్న: అమ్మా! మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. కాదనరుగా! కాశీలో మిమ్మల్ని స్వప్నంలో దర్శించిన దేవేంద్రనాథ్ మీ దగ్గర సన్న్యాసదీక్ష కోరుతున్నాడు. ఆయన సన్న్యాసం తీసుకోవటం వలన వారి కుటుంబ సభ్యులెవరికీ ఎటువంటి ఇబ్బందీ కలగదు. దయ చేసి ఆయనకు సన్న్యాసదీక్ష అనుగ్రహించండి.***

అమ్మ: అతను సన్న్యాసం తీసుకోవటం వలన ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ కలగదంటున్నావు కాబట్టి అతడికి తప్పకుండా సన్న్యాసదీక్ష ఇస్తాను. సరేనా! రేపు కోయల్‌పరా మఠం నుండి కాషాయరంగు వేసిన క్రొత్త గుడ్డలు తీసుకురా! రేపే సన్న్యాసం ఇస్తాను. సన్న్యాసం తీసుకున్నాక అతను కొత్త మనిషి అవుతాడు. (శా.వ. 163, 164)

***206 ప్రశ్న: అమ్మా! ఈ సంసార జీవితం ఎంతమాత్రం సుఖంగా లేదు. ఏమి చెయ్యాలి?***

అమ్మ: అమ్మాయీ, ఇటు చూడు! నీతోపాటు గంపెడు పిల్లల్ని వెంట తీసుకువచ్చావు! ఒకరు నీ వీపు మీద ఉంటే,

ఇంకొకరు నీ భుజం మీద ఉన్నారు. మరొకరు నీ చేతులు పట్టుకొని ఉన్నారు. ఇంద్రియ నిగ్రహం లేకుండా పిల్లల్ని కనడమే నీ ధర్మం అన్నట్లు ప్రవర్తిస్తున్నావు! ఇక నీ సంసార జీవితం సుఖంగా ఎలా ఉంటుంది? ఇక చాలు. ఇకనైనా ఇంద్రియ నిగ్రహంతో, దైవసాక్షాత్కారం కోసం ప్రయత్నించు. (మాతృసన్నిధి 87)

***207 ప్రశ్న: అమ్మా! మిమ్మల్ని చూడడానికి వచ్చిన ఆ సంపన్న మహిళ సొగసైన వస్త్రాలు ధరించి, విశేషంగా అత్తరు పూసుకుని, ఒళ్ళంతా నగలు పెట్టుకుని వచ్చింది. ఆమె గురించి మీ అభిప్రాయం ఏమిటి?***

అమ్మ: చూడమ్మా! మహిళలకి లజ్జయే ఆభరణం. భగవంతుడి పాదాలకు అంకితమైనప్పుడే పుష్పం తన జన్మ సార్థకమైనదని భావిస్తుంది. అలా జరగకపోతే చెట్టు మీద వాడిపోవడమే మేలు. పరిమళభరితమైన పూలను ఎవరైనా డాంబికుడు గుత్తిగా కట్టి ముక్కు దగ్గర పెట్టుకుని, 'ఆహా! ఎంత సువాసన!' అని మెచ్చుకోవచ్చు. మరుక్షణం, ఆ పూలగుత్తిని నేల మీద పడేసి చెప్పులతో తొక్కేసి, ఇక దానివైపే చూడకపోవచ్చు. మహిళల విషయం కూడా అంతే. కాబట్టి, బాహ్య ఆడంబరాలు మాని సరళమైన జీవితం గడుపుతూ, భగవత్సాక్షాత్కారం కోసం ప్రయత్నించాలి. (మాతృసన్నిధి 260)

***208 ప్రశ్న: అమ్మా! మా అమ్మాయిని వివాహం చేసుకోమని బ్రతిమాలుతున్నాను. కానీ ఆమె నా మాట వినిపించుకోవడం లేదు. దయచేసి మీరు ఆమెకు చెప్పి వివాహానికి ఒప్పించండి!***

అమ్మ: చూడమ్మా! జీవితపర్యంతం ఒకరికి బానిసగా ఉండి,

అతడి ఇచ్ఛానుసారం నడవడం దౌర్భాగ్యం కదా? అవివాహితగా ఉండడంలో కొంత ప్రమాదం ఉన్నప్పటికీ వివాహం వద్దనుకునే వారిని సంసార జీవితం గడపమని నిర్బంధించడం తగదు. వైరాగ్య జీవితానికి ఆకర్షితులైన కన్యలకు అవివాహిత జీవితాన్నే ప్రోత్సహించాలి. (ది.జ. 97)

***209 ప్రశ్న (కేదార్ మహరాజ్): అమ్మా! సర్వమత సామరస్యమనే నూతన సందేశవ్యాప్తికే గదా గురుదేవులు వచ్చారు?***

అమ్మ: నాయనా! మీకు అలా అనిపించవచ్చునేమో కానీ నా వరకు నాకు త్యాగమే ఆయన విశిష్టత అనిపిస్తుంది. గురుదేవులలో దర్శనమిచ్చే సహజత్యాగాన్ని ఎవరైనా, ఎన్నడైనా చూసి ఎరుగుదురా? అదే ఆయన ప్రత్యేకత. (శా.వ. 334)

## 20. భగవంతుని స్వభావం

***210 ప్రశ్న: అమ్మా! భగవంతుడే అందరికీ తల్లీ, తండ్రీ అయినప్పుడు ఆయన ఎందుకు మనల్ని పాపాలు చేయనిస్తున్నాడు?***

అమ్మ: నాయనా! ఒక్క విషయం గుర్తుంచుకో! భగవంతుడే ఈ జీవరాశులన్నింటిగా పరిణమించి ఉన్నారనడం సత్యమే. కానీ ప్రతి ఒక్కరూ తమ సంస్కారాలకు తగినట్లు, పనులకు తగినట్లు కర్మఫలాన్ని అనుభవిస్తున్నారు. సూర్యుడు ఒక్కడే అయినా ప్రతిఫలించే స్థలం, పదార్థం స్వభావాలను బట్టి సూర్యకిరణాలు మార్పుచెందుతాయి. అదే విధంగా మన సంస్కారాన్నీ, స్వభావాన్నీ బట్టి మనమే పాపాలు చేస్తున్నాం కానీ అందులో దేవుని పాత్ర ఏమీ లేదు. (శా.వ. 396, 397)

***211 ప్రశ్న: అమ్మా! చైతన్య మహాప్రభువు అవతార పురుషుడు కాదని చాలామంది అంటున్నారు. నిజమేనా?***

అమ్మ: చెప్పేవాళ్ళు ఏదోవొకటి చెపుతూనే ఉంటారు. దానికేం లే! దేహధారణచేసి మనలాగానే జీవించే వ్యక్తిని అవతార పురుషునిగా అవగతం చేసుకోవడం అంత సులభం కాదు. అవతార పురుషులను అందరూ గుర్తించగలరా? ఒకరిద్దరికి మాత్రమే అది సాధ్యం. అవతార పురుషులైన గురుదేవులు తన నోటినుంచి రక్తం స్రవిస్తున్నా భక్తులతో మాట్లాడడం మానలేదు. వారికి ఎలా మేలు చేయాలన్నదే

ఆయన ఆలోచన. ఇవన్నీ సరే! అవతార పురుషుల గురించి మీరెందుకు కలత చెందాలి? ఒక వ్యక్తికి సంబంధించినంత వరకూ, అతడి సొంత గురువు అవతార పురుషుడి కంటే అధికుడు. ఈ విషయం జ్ఞాపకం ఉంచుకో! (శా.వ. 122)

***212 ప్రశ్న: అమ్మా! భగవదనుగ్రహం లభిస్తే సముచిత తరుణం వచ్చేదాకా వేచి ఉండవలసిన అవసరం లేదు కదా?***

అమ్మ: నిజమే నాయనా! కానీ ఇతర మాసాలలో లభించే మామిడిపండ్లు జ్యేష్ఠమాసంలో లభించే పండ్లలా తియ్యగా ఉంటాయా? ఇప్పుడైతే ఋతువు కాని కాలంలో కూడా పండ్లు పండించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ అవి వాటి ఋతువులో పండే పండ్లలాగా రుచిగా ఉండవు. భగవల్లాభమార్గాల విషయంలో కూడా అంతే. ఈ జన్మలో కొంత సాధన చేస్తే, మరుజన్మలో కొంత ఆత్మ వికాసం పొందవచ్చు. ఆపై జన్మలో ఇంకా పురోగమించవచ్చు. ఆ విధంగా పురోగతి సాధిస్తూ కొన్ని జన్మలలో భగవత్సాక్షాత్కారం పొందవచ్చు. (శా.వ. 245)

***213 ప్రశ్న: అమ్మా! భగవంతుడు మనకు సొంతమని అంటున్నారు కదా! ఆయన మన సొంతమైనప్పుడు ఆయనను దర్శించడానికి ప్రార్థించవలసిన అవసరం ఏముంది? మన సొంతమైన వారు మనం పిలువకపోయినా రావాలి గదా! తల్లిదండ్రులు మనలను చూసుకునేటట్లుగా భగవంతుడు కూడా చూసుకుంటాడా?***

అమ్మ: అవును నాయనా! భగవంతుడు నీకు సొంతమే! ఆయనే నీ తల్లీ, తండ్రీ! ఆయనే వారి రూపంలో మనల్ని పెంచి పోషిస్తాడు. లేకపోతే నీవు ఎక్కడుండేవాడివి? ఇప్పుడెక్కడికి వచ్చావు? నీ తల్లిదండ్రులు నిన్ను పెంచారు. తుదకు, నువ్వు వారికి సొంతం కాదని గ్రహించారు. కాకి గూటిలో కోకిల

పెరగడం లేదా? తల్లిదండ్రుల రూపంలోనే భగవంతుడు మనల్ని చూసుకుంటాడనడంలో సందేహమేమీ లేదు. (శా.వ. 257)

***214 ప్రశ్న: అమ్మా! భగవంతుణ్ణి 'కపాలమోచనుడు' అని ఎందుకంటారు?***

అమ్మ: చూడమ్మా! పూర్వజన్మల కర్మల మేరకే ప్రతి వ్యక్తీ ఈ భూమి మీద జన్మిస్తున్నాడు. అందుకే కొందరు చిరుప్రాయం లోనే భగవంతుణ్ణి ప్రార్థించడం చూస్తున్నాం. అంతా స్వీయకర్మ ఫలితమే! కానీ ఆయన అనుగ్రహముంటే తాను లిఖించింది తానే చెరిపివేస్తాడు. అందుకే కదా ఆయనని 'కపాల మోచనుడు' అంటారు. అంతా ఆయన చలువే! అందువల్ల ఆయనకు నిన్ను నీవు సమర్పించుకో! (శా.వ. 153)

***215 ప్రశ్న: అమ్మా! మరణించిన వ్యక్తి ఆత్మ భగవత్సాన్నిధ్యాన్ని చేరుకుంటుందని అంటారు కదా! దానంతట అదే వెళుతుందా, లేక ఎవరైనా తీసుకువెళతారా?***

అమ్మ: లేదు నాయనా! అది దానంతట అదే వెళుతుంది. సూక్ష్మశరీరం అన్నది వాయు శరీరం లాంటిది కదా! దాని ద్వారా ఆ వ్యక్తుల ఆత్మ దానంతట అదే వెళుతుంది. (శా.వ. 249)

## 21. భగవంతుని దర్శనం

***216 ప్రశ్న (ఒక సన్యాసి): అమ్మా! నేను సన్యాసదీక్ష తీసుకున్న తరుణంలో అధ్యక్షులవారి వద్ద మంత్రదీక్ష తీసుకున్నాను. జపం, ధ్యానం బాగా చేసేవాణ్ణి. నాకు అనేక దివ్యదర్శనాలు కలిగేవి. ప్రస్తుతం ఆ దివ్యదర్శనాలన్నీ కరువైపోయాయి. జీవిత పరమార్థాన్ని పొందకపోతే, ఆ దివ్యదర్శనాలను పొందలేక పోతే బ్రతికి ప్రయోజనమేముంది? మరణించడమే మేలని అనిపిస్తోందమ్మా! మీరు ఏమంటారు?***

అమ్మ: ఏం మాటలు అంటున్నావు నాయనా! ఇటువంటి ఆలోచనలు రావచ్చా? దివ్యదర్శనాలు రోజూ లభిస్తాయా? గాలం వేసి కూర్చుంటే ప్రతిసారీ పెద్ద చేపలే పడతాయా? గాలం, ఎర మొదలైనవాటన్నింటినీ చక్కగా సిద్ధం చేసుకుని, గాలం వేసి కూర్చుంటే ఒక్కొక్కసారి పెద్ద చేప చిక్కవచ్చు. ఎన్నోసార్లు చిక్కక పోవచ్చు. అందుకని చేపలు పట్టడమే మానుకుంటామా?" అని గురుదేవులు అనేవారు. కాబట్టి దివ్యదర్శనాల కోసం ఎదురుచూసి నిరాశానిస్పృహలకు లోను కావద్దు. అవి వచ్చినపుడు వస్తాయిలే! (శా.వ. 76)

***217 ప్రశ్న: అమ్మా! భగవంతుడెక్కడున్నాడు?***

అమ్మ: నాయనా! ఆయన మరెక్కడున్నాడు? భక్తుల దగ్గరే ఉన్నాడు. నిజమైన భక్తులు సంచరించే ప్రదేశానికి వెళితే చాలు, లౌకికుల మనస్సులలోని మాలిన్యాలన్నీ తొలగి పోతాయి! (శా.వ. 184)

***218 ప్రశ్న: అమ్మా! భగవంతుని ప్రత్యక్ష దర్శన అనుభూతి పొందలేకపోతే ఇక జీవించి ప్రయోజనమేమిటమ్మా?***

అమ్మ: బాగా చెప్పావు నాయనా! అది నిజం. అటువంటి అనుభూతి పొందకపోతే జీవితలక్ష్యం ఎలా నెరవేరుతుంది? కానీ దానిని పొందడానికి గాఢవిశ్వాసంతో సాధనలు సాగిస్తూ పురోగమించాలి. అపుడే అది సాధ్యమవుతుంది. (శా.వ. 275)

***219 ప్రశ్న: అమ్మా! నేను ఎంత ప్రయత్నించినా నాకు గురుదేవుల దర్శనం కలగడం లేదు. అది లభించేటట్లు చేయండమ్మా!***

అమ్మ: నాయనా! చర్మచక్షువులతో ఎవరైనా ఎప్పుడైనా గురుదేవులను దర్శించారా? లేదు. కళ్ళు మూసుకుంటే ఆయనను దర్శించవచ్చు. అప్పుడు ఆయన రూపం కనబడు తుంది. నిజంగా గురుదేవుల దర్శనం కావాలంటే నీ సాధనలు తీవ్రతరం చేయి. మనస్ఫూర్తిగా ఆయనను ప్రార్థించు. తప్పక నీకు ఆయన దర్శనం కలుగుతుంది. (శా.వ. 259)

***220 ప్రశ్న: అమ్మా! భగవంతుడు మన సొంతమైనపుడు ఆయనకు నచ్చితే సత్వరమే దర్శనం ఇవ్వవచ్చు కదా?***

అమ్మ: అది సరేగానీ నాయనా, 'భగవంతుడు నా సొంతం!' అనే ప్రగాఢవిశ్వాసం ఎంతమందికి ఉంటుంది? భక్తులందరూ ఏదోవొక సాధన చేస్తారు కానీ భగవంతుణ్ణి నిజంగా ప్రేమించే వారు ఎందరు? ఆయన తప్ప వేరే ఏమీ అక్కరలేదనేవారు ఎందరుంటారో చెప్పండి? అలా గాఢంగా, నిజంగా ప్రేమించేవారికి ఆయన తప్పక దర్శనం ఇస్తారు. (శా.వ. 265)

***221 ప్రశ్న: అమ్మా! కొందరు భగవద్దర్శనం కావాలని కోరతారు. కానీ వారికది లభించదు. మరికొందరు భగవత్సాక్షాత్కారం***

***కోసం వ్యాకులత చెందనప్పటికీ వారికి లభిస్తుంది. దీని అర్థం ఏమిటి?***

అమ్మ: నాయనా! భగవంతుడు చిన్న బిడ్డలాంటి నైజం కలిగినవాడు. కొందరు ఎంత అర్థించినా ఇవ్వడు. కొందరు కోరనప్పటికీ వారికి బలవంతంగా కట్టబెడతాడు. బహుశా ఈ రెండవ తరహావారు గత జన్మలో ఎన్నో సత్కర్మలు చేసివుంటారు. బహుశా అందుకే వారిమీద భగవంతునికి అనుగ్రహం కలుగుతుంది. (శా.వ. 265)

***222 ప్రశ్న (నళిని): అత్తా! నీతో కలసి ఇంత కాలంగా జీవిస్తున్నా నాకు దివ్యదర్శనాలు, దృశ్యాలు కనిపించవెందుకు?***

అమ్మ: తప్పకుండా కనిపిస్తాయమ్మా! అయితే దానికి ఎంతో భక్తివిశ్వాసాలు కావాలి. అప్పుడే అటువంటివి లభిస్తాయి. కానీ, నీ దగ్గర అటువంటి భక్తివిశ్వాసాలు ఉన్నాయా? (శా.వ. 86)

***223 ప్రశ్న: అమ్మా! బ్రహ్మజ్ఞానం ఎలా కలుగుతుంది? ఈ కళ్ళతో బాహ్యవస్తువులన్నింటినీ చూస్తూ చూస్తూ అవే బ్రహ్మం అని ఎలా అనుకోగలను? ఆ అనుభూతి ఎలా సిద్ధిస్తుంది? బ్రహ్మజ్ఞానం కలగకపోతే ముక్తిలేదని స్వామీజీ అంటున్నారు. అంతా గందరగోళంగా ఉంది. ఏమీ అర్థం కావడం లేదు.***

అమ్మ: నాయనా! బ్రహ్మజ్ఞానం కోసం ప్రయత్నించే మార్గం చాలా కఠినమైన మార్గం. అలాంటి సాధనలు చేయడానికి చాలాకాలం పడుతుంది. నువ్వు గురుదేవులను ప్రార్థించు. ఆయనను ఆశ్రయించి జీవించు. సముచిత తరుణంలో ఆయనే అన్నీ గ్రహించేలా చేస్తారు. నీకెందుకు ఆందోళన? గురుదేవుల అనుగ్రహం కలిగితే అంతా సిద్ధిస్తుంది. (శా.వ. 403)

***224 ప్రశ్న: అమ్మా! వేదాంత ఆదర్శాలను అనుసరించే సన్న్యాసులు నిర్వాణస్థితిని పొందుతారా?***

అమ్మ: అవును నాయనా! సన్న్యాసులు మాయాబంధాలను తెంచుకుని నిర్వాణస్థితిని చేరుకొని భగవంతునిలో ఐక్యం చెందుతారు. కోర్కెల పర్యవసానమే ఈ దేహం. కోర్కె కించిత్తు మిగిలినా దేహం నిలిచి ఉంటుంది. కోర్కెలు ఆసాంతం నశించినప్పుడు అంతా సమసిపోతుంది. (శా.వ. 251)

***225 ప్రశ్న: అమ్మా! గురుదేవులు ఈశ్వరకోటుల గురించి చెపుతూ నిర్వికల్పసమాధి స్థితిని చేరుకున్న తరువాత కూడా తిరిగి రాగలరనీ, ఇతరులకు అది సాధ్యం కాదనీ అనేవారు. దీని అర్థం ఏమిటి? భగవంతునిలో మగ్నమయిన మనస్సును తిరిగి వెనుకకు తీసుకురావడం సాధ్యమేనా?***

అమ్మ: అది నిజమే నాయనా! నిర్వికల్పసమాధిని పొందిన తర్వాత కూడా ఈశ్వరకోటులు తమ మనస్సులను కూడా మామూలు స్థితికి తీసుకురాగలరు. భగవంతునిలో మగ్నమయిన మనస్సును తిరిగి తీసుకురావడమనేది అందరూ చేయగలిగే పని కాదు. పరమహంసలు మాత్రమే అలా చేయగలరు. పాలూ, నీరూ కలసివున్నా రాజహంస నీటిని విడదీసి, పాలు మాత్రం త్రాగగలదు కదా! (శా.వ. 262, 263)

***226 ప్రశ్న: అమ్మా! భగవంతుడు నిజంగానే నా సొంతమని ఎప్పటికైనా నేను గ్రహించగలుగుతానా?***

అమ్మ: గ్రహించగలవు నాయనా! తప్పకుండా గ్రహించ గలుగుతావు. సకలమూ నీకు సిద్ధిస్తుంది. నువ్వు కోరినవన్నీ లభిస్తాయి. స్వామీజీకి (వివేకానంద స్వామికి) లభించలేదా? స్వామీజీకి లభించినట్లే నీకు కూడా తప్పక లభిస్తుంది. (శా.వ. 258)

## 22. గురుదేవులు

***227 ప్రశ్న: అమ్మా! మీ ముగ్గురి చిత్రపటాలను ఎక్కడ చూసినా మనస్సులో ఎప్పడూ ఒక సందేహం కలుగుతుంది. గురుదేవుల ప్రక్కన ఆయనతో సమానంగా ఆయన శిష్యుడైన వివేకానంద స్వామి చిత్రపటాన్ని పెట్టడం సమంజసం కాదేమో అనిపిస్తుంది. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?***

అమ్మ: అదేంటి నాయనా! అటువంటి సందేహం నీకు ఎందుకు కలిగింది? గురుదేవులే ఉంటే నరేన్‌ను (వివేకానంద స్వామిని) ఇలా తమ ప్రక్కన కూర్చోనిచ్చేవారా? తమ ఒడిలోనే కూర్చోబెట్టుకునేవారు! నరేన్ గురుదేవుల కంటిపాప కదా! అంతేకాదు. నరేన్‌ను ఆరాధించకపోతే, గురుదేవులు అక్కడివారు చేసే పూజను స్వీకరించరు సుమా! (శా.వ. 155)

***228 ప్రశ్న: అమ్మా! నాలుగు చేతులు గల దైవాన్ని దర్శించడం నాకు ఇష్టం లేదు. నాలాగానే ఉన్న దేవుణ్ణి దర్శించడమే నాకు ఇష్టం!***

అమ్మ: నాకూ అదే ఇష్టం నాయనా! అటువంటి దర్శనాలతో ప్రయోజనం ఏముంది? మన గురుదేవులున్నారు చాలు. ఆయనే మనకు సర్వస్వమూ! (శా.వ. 298)

***229 ప్రశ్న: అమ్మా! అదేమిటి? మీ చిత్రపటాన్ని మీరే మీ తల మీద ఉంచుకున్నా రెందుకు?***

అమ్మ: (నవ్వుతూ) ఎందుకా? ఎందుకంటే, ఇందులో కూడా గురుదేవులే ఉన్నారు, నాయనా! గురుదేవులూ, నేనూ వేర్వేరు కాదు కనుకనే అలా ఉంచుకున్నాను. (శా.వ. 463)

***230 ప్రశ్న: అమ్మా! అనేక అవతారాలలో అవతార పురుషులు తమ శక్తి - అంటే - సహధర్మచారిణి నిర్యాణానికి తదుపరే తమ దేహాలను చాలించారు. కానీ ఈసారి గురుదేవులు మీకంటే ముందుగానే వెళ్ళిపోయారు కదా? ఎందుకలా జరిగింది?***

అమ్మ: నాయనా! గురుదేవులు ఈ ప్రపంచాన్నే జగన్మాత స్వరూపంగా చూశారు. ఈ లోకంలో మాతృత్వపు మహత్యాన్ని చాటిచెప్పడానికే నన్ను వదలి వెళ్ళారు. (శా.వ. 489)

***231 ప్రశ్న: అమ్మా! గురుదేవులకు అన్నం నివేదించవచ్చా? చేపలు నివేదించవచ్చా?***

అమ్మ: నాయనా! గురుదేవులకు మీరు తినేది ఏదైనా సరే నివేదించవచ్చు. ఐతే, భక్తిశ్రద్ధలతో, ఆయన మంత్రం ఉచ్చరిస్తూ, ఆయన మీరు సమర్పించిన పదార్థాన్ని స్వీకరిస్తున్నారన్న ప్రగాఢవిశ్వాసంతో నివేదించాలి సుమా! అప్పుడు ఆయన దానిని తప్పకుండా స్వీకరిస్తారు. (శా.వ. 175, 176)

***232 ప్రశ్న: అమ్మా! గురుదేవులు కొందరి గురించి చెప్పేటప్పుడు 'వీరు నాకు చెందినవారు' అని చెప్పేవారు. దానికి అర్థం ఏమిటి?***

అమ్మ: నాయనా! ఒక రాజుగారు ఎక్కడికైనా వెళితే ఆయన పరివారం కూడా ఆయనతో వెళుతుంది కదా? అలా వచ్చేవారే తనకు చెందినవారని గురుదేవులు చెప్పేవారు. గురుదేవులు ప్రతి యుగంలోనూ ఏతెంచేటప్పుడు ఆయనతో పాటు వచ్చే వారినే ఆయన తనవారుగా చెప్పేవారు. ఆయనతోపాటు

వచ్చిన వారంతా ఆయనకు కలిగే ఆనందంలో ఆనందిస్తారు, ఆవేదనలో ఆవేదన చెందుతారు. వారంతా ఆయనకు చెందినవారు సుమా! (శా.వ. 273)

***233 ప్రశ్న: అమ్మా! మాకేదైనా ఉపదేశం చేయండి?***

అమ్మ: నేనేం ఉపదేశం చేయగలనమ్మా? గురుదేవుల ఉపదేశాలు పుస్తకరూపంలో వెలువడ్డాయి. ఆయన ఉపదేశాలలో ఏ ఒక్కటైనా అవగతం చేసుకుని, పాటించగలిగితే సమస్తమూ లభిస్తుంది. కానీ ఆ ఉపదేశాలను అర్థం చేసుకోగలిగిన శ్రద్ధ ఉన్నవారు ఎంతమంది ఉన్నారు? (శా.వ. 37)

***234 ప్రశ్న: అమ్మా! గురుదేవులను మీరు ఎలా చూస్తున్నారు?***

అమ్మ: (గంభీరంగా) చిన్నబిడ్డగా చూస్తున్నాను. (శా.వ. 475, 476)

***235 ప్రశ్న: అమ్మా! గురుదేవులు చిత్రపటాలన్నింటిలోనూ సజీవంగా ఉన్నారా?***

అమ్మ: నాయనా! గురుదేవులు అన్ని చిత్రపటాలలోనూ కచ్చితంగా సజీవంగా ఉన్నారు. వ్యక్తి, వ్యక్తి యొక్క నీడ – రెండూ ఒకటేనని మనకు తెలుసుకదా! కాబట్టి ఆయన తప్పక దానిలో ఉంటారు. నువ్వు నిరంతరం భక్తిశ్రద్ధలతో ప్రార్థించే కొద్దీ ఆ చిత్రంలో ఆయన వ్యక్తమవుతారు. ఆ ప్రదేశమే ఒక ఆలయంగా మారిపోతుంది. గురుదేవులను పూజించే ప్రదేశం ఆయన జీవించే ప్రదేశమే అవుతుంది సుమా! అక్కడకు ఆయన తన దృష్టిని తప్పక సారిస్తారు. (శా.వ. 255)

***236 ప్రశ్న (సురేంద్ర): అమ్మా! గురుదేవులను పూజిస్తున్నప్పుడు ఒక ఇబ్బంది కలుగుతున్నది. ఇష్టదైవమూ, గురుదేవులూ ఒక్కరే అని అనుకున్నప్పటికీ దేవిని పూజించి - "ఓ మహేశ్వరీ! నీ***

***అనుగ్రహంతో.." అని చెప్పేటప్పుడు మనస్సులో గందరగోళం ఏర్పడుతోంది. దీనికి పరిష్కారం ఏమిటి?***

అమ్మ: నాయనా! నీ ఇష్టదైవమూ, గురుదేవులూ ఒక్కరేనన్న విశ్వాసాన్ని దృఢపరచుకో! సరైన విశ్వాసం లేనప్పుడే ఇలాంటి ఇబ్బందులు కలుగుతాయి. ఆయనే మహేశ్వరుడు - ఆయనే మహేశ్వరి. ఆయన సకల దైవస్వరూపులు, సకల మంత్ర స్వరూపులు. ఆయనలోనే దేవీదేవతలనందరినీ పూజించవచ్చు సుమా! (శా.వ. 306, 307)

***237 ప్రశ్న: అమ్మా! మీరు అర్పించే నైవేద్యాన్ని గురుదేవులు నిజంగా ఆరగిస్తారా?***

అమ్మ: అవును నాయనా! తప్పక స్వీకరించి, ఆరగిస్తారు. గురుదేవుల కళ్ళనుండి ఒక కాంతి వెలువడి నేను సమర్పించిన ఆహారపదార్థాలన్నింటినీ స్పృశిస్తుంది. ఆయన అమృతస్పర్శతో ఆ ఆహారం పరిపూర్ణ మవుతుంది. ఆయనకు ఆహారం అవసర మా ఏమిటి? ఆయన భక్తుల తృప్తికోసం వస్తారు. ఆ ప్రసాదం మనం స్వీకరిస్తే మన మనస్సు పావనమవుతుంది. నివేదించని ఆహారం తింటే మనస్సు మలినమవుతుంది. (శా.వ. 255)

***238 ప్రశ్న: అమ్మా! గురుదేవులు పాశ్చాత్యదేశాలలో అవతరిస్తారని మీరు చెప్పారు కదా! అది నిజమేనా?***

అమ్మ: లేదు నాయనా! నేను అలా అనలేదు. గురుదేవులకు శ్వేత జాతీయులు అనేకులు భక్తులవుతారని చెప్పాను. ఇప్పటికే ఎందరో క్రైస్తవులు వస్తున్నారు కదా! తాను నూరేళ్ళ తర్వాత మళ్ళీ అవతరిస్తానని గురుదేవులు చెప్పారు. అయితే, ఈ నూరేళ్ళూ ఆయన భక్తుల హృదయాలలో జీవిస్తారు. (శా.వ. 274)

***239 ప్రశ్న: అమ్మా! మీలాంటి తల్లి నాకు లభించినప్పటికీ, జీవితంలో గొప్పగా సాధించినది ఏదీ లేదు కదా అని భయం వేస్తున్నది. ఎలాగమ్మా?***

అమ్మ: భయమెందుకు నాయనా! మీ అందరి వెనుకా గురుదేవులున్నారు. ఇది సదా మనస్సులో జ్ఞాపకం ఉంచుకో! నేను కూడా మీతోనే ఉన్నాను. తల్లిగా నేనున్నప్పుడు నువ్వు భయపడవచ్చా? గురుదేవులు ఒకసారి నాతో "నీవద్దకు ఎవరైతే వస్తారో వారి అంతిమ ఘడియలలో నేను వచ్చి వారి చేయిపట్టుకుని తీసుకు వెళతాను!" అని చెప్పారు. కాబట్టి నా దగ్గరికి వచ్చిన మిమ్మల్ని తీసుకుని వెళ్ళడానికి గురుదేవులు తప్పక వస్తారు. (శా.వ. 177, 178)

***240 ప్రశ్న: అమ్మా! గురుదేవుల శిష్యులలో పురుషులే ఎక్కువ ఉన్నారు. ఆయనకు కూడా స్త్రీపురుష భేదం, పురుష పక్షపాతం ఉన్నాయా? మాకు (స్త్రీలకు) ఆయన కృపాకటాక్షం లభించదా?***

అమ్మ: అదేంటమ్మా, అలా అన్నావు? గురుదేవులకు స్త్రీపురుష భేదంగానీ, పురుష పక్షపాతంగానీ లేనేలేదు. భక్తుల కోసం ఆయన ఎంతగా ఆరాటం చెందారో, భక్తురాండ్రకోసం కూడా అంతే ఆరాటపడ్డారు. గురుదేవులు మిమ్మల్ని ఎంతగానో అభిమానిస్తున్నారమ్మా! ఆయన కృపాకటాక్షం ఎల్లప్పుడూ మీమీద ఉంటుంది. ఈ విషయం సదా గుర్తుంచుకో! (శా.వ. 151,152)

***241 ప్రశ్న: అమ్మా! గురుదేవులు మా చేయి పుచ్చుకొని కాపాడుతున్నారని మీరంటున్నారు. కానీ మాకేమీ అర్థం కావడం లేదే?***

అమ్మ: నాయనా! ఆ విషయం మీకు అర్థం కాకపోవడమే అసలు కష్టం. ఇప్పుడు కూడా మిమ్మల్ని తమ చేతులతో పట్టుకొని ఉన్నారు. మీకు అతి సమీపంలోనే ఉన్నారు. మిమ్మల్ని కాపాడుతూనే ఉన్నారు. నిజం చెపుతున్నాను. అర్థం చేసుకోండి! (శా.వ. 287)

***242 ప్రశ్న: అమ్మా! మరణానికి కొద్దిసమయం ముందు గిరీష్ 'జై రామకృష్ణ' అని స్మరిస్తూ స్పృహ కోల్పోయారు. అలా స్పృహలేని స్థితిలో మరణించిన వారికి సద్గతి లభిస్తుందా?***

అమ్మ: నాయనా! మరణించే ముందర స్పృహ కోల్పోయినా, స్పృహపోయే ముందు మనస్సులోని ఆలోచన మేరకే మరణానంతర గతి ప్రాప్తిస్తుంది. ఇక గిరీష్ సంగతి అంటావా! అతడు గురుదేవుల శిష్యుడు కదా! గురుదేవుల నుండే ఆయన శిష్యులందరూ వచ్చారు. ఆయనవద్దకే తిరిగి వెళతారు సుమా! (శా.వ. 268)

***243 ప్రశ్న: అమ్మా! గురుదేవులు రకరకాల సమాధిస్థితులలో ఉండే వారు కదా. ఆ సమాధిస్థితులలో ఆయన ముఖం ఎలా ఉండేది?***

అమ్మ: నాయనా! సమాధి స్థితిలో ఉన్నప్పుడు ఆయన ముఖంలో నేను చిరునవ్వునే చూశాను. అన్ని రకాల సమాధిస్థితులలోనూ ఆయన ముఖంలో చిరునవ్వు తాండవిస్తూ ఉండేది. అది ఆయనకే సాధ్యం సుమా! (శా.వ. 252)

***244 ప్రశ్న: అమ్మా! గురుదేవుల శరీరఛాయ ఎలా ఉండేది?***

అమ్మ: నాయనా! గురుదేవులది బంగారు మేనిఛాయ. గురుదేవులకు నూనె రాసేటప్పుడు ఆయన శరీరం నుంచి ఒక

రకమైన తేజస్సు వెలువడడం నేను చూశాను. కానీ తర్వాత రోజులలో ఆ ఛాయ బాగా తగ్గిపోయింది. (శా.వ. 252)

***245 ప్రశ్న (యోగీన్‌మా): అమ్మా! గురుదేవుల శిష్యులందరూ ఆధ్యాత్మిక సింహాలు. మరి మీ శిష్యులు అత్యంత సాధారణంగా ఉన్నారు కదా!***

అమ్మ: యోగీన్! దీని గురించి నువ్వు ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఆయన ఎంతో జాగ్రత్తగా జాతి రత్నాలను ఎంపిక చేసుకున్నారు. పేరూ ఊరూ లేని చిన్న చేపలను నా వైపు త్రోశారు. ఆయన శిష్యుల్ని నా శిష్యులతో పోల్చకు. (ది.జ. 61)

***246 ప్రశ్న (వివేకానంద స్వామి): అమ్మా! గురుదేవుల సందేశాన్ని వ్యాప్తిచేద్దామన్న నా జీవితలక్ష్యాన్ని అనుకున్నంత వేగంగా సాధించలేక పోతున్నాను. మనస్సులో ఆందోళనగా ఉంటున్నది. ఏమి చేయాలి? మీ ఆశీస్సులివ్వండి!***

అమ్మ: నాయనా! కలవరపడకు. నువ్వు ఇప్పుడు చేస్తున్న పనులు, ఇక చేయబోతున్న పనులు చిరకాలం స్థిరంగా నెలకొంటాయి. ఈ మహత్కార్యాలు చేయడానికే నువ్వు జన్మించావు. రాబోయే కాలంలో దివ్యజ్ఞానాన్ని ప్రసాదించే సద్గురువుగా నిన్ను వేలాదిమంది ఆరాధిస్తారు. నీ ఆశయాన్ని త్వరలోనే గురుదేవులు పూర్తిచేస్తారు. ఇది తథ్యం. నువ్వు చేయదలచుకున్న కార్యం త్వరలోనే జరగడం నీవే చూస్తావు. నీకివే నా ఆశీస్సులు! (శా.చ. 182)

## 23. అమ్మ - స్వస్వరూపం

***247 ప్రశ్న: అమ్మా! మీరెంతో అనారోగ్యంగా ఉన్నారు. చాలా బాధపడుతున్నారు. ఒక్కసారి 'నా వ్యాధి నయమవ్వాలి!' అని మీరు సంకల్పిస్తే అది తక్షణమే నయమవుతుంది కదా?***

అమ్మ: నాయనా! అలా ఎలా చెప్పను? గురుదేవుల సంకల్పం ప్రకారమే అన్నీ జరుగుతాయి సుమా! అందుచేత ఈ విషయంలో చెప్పడానికి ఏముంది? గురుదేవులతో కూడా శశిధర తర్క చూడామణి ఇదే విషయాన్ని ప్రస్తావిస్తే, గురుదేవులు 'సచ్చిదానంద పరబ్రహ్మకు సమర్పించిన మనస్సును శరీరం వైపు మరలించడమా?' అని ఎదురు ప్రశ్న వేశారు. నా విషయంలో కూడా అంతే! (శా.వ. 205)

***248 ప్రశ్న: అమ్మా! నేను మీ దర్శనం అయిన తరువాత పూరీ జగన్నాథం వెళదామని అనుకున్నాను. కానీ ఇప్పుడు నాకు ఎక్కడకీ వెళ్ళాలని అనిపించడం లేదు. మీ పాదపద్మాలే కోటి తీర్థాలతో నాకు సమానం. నాకు ఇక ఏవీ వద్దు.***

అమ్మ: మంచిది నాయనా! నువ్విక పూరీ జగన్నాథం వెళ్ళనవసరం లేదు. నీ భావనే నీకు బలం, ముఖ్యం. (శా.వ. 162)

***249 ప్రశ్న: అమ్మా! సురబాల అత్తను చూడండి. ఒకవైపు పిచ్చిదానిలా ఉంది. మిమ్మల్ని తిడుతూ ఉంటుంది. కానీ పొరపాటున మీ చేతులు తన కాళ్ళని తాకాయని చాలా భయపడిపోతోంది. ఇదేంటమ్మా? ఆమె ప్రవర్తన వింతగా ఉందే?***

అమ్మ: నాయనా! రాముడు సాక్షాత్తూ నారాయణుడనీ, సీత ఆది పరాశక్తి అనీ రావణునికి తెలియదా ఏమిటి?

అయినప్పటికీ తనకంటూ కేటాయించిన భూమికను, పాత్రను అతను పోషించాడు. అలాగే సురబాల సంగతి కూడా! ఈమెకు కూడా నేనెవరో తెలియదా ఏమిటి? అయినా తన పాత్ర తాను నిర్వర్తించడానికే ఆమె వచ్చింది. (శా.వ. 165)

***250 ప్రశ్న: అమ్మా! మాకోసం మీరు ఇంత శ్రమపడవలసి వస్తోంది కదా! ఎందుకమ్మా ఇంత శ్రమపడుతున్నారు?***

అమ్మ: అదేంటమ్మా, అలా అంటావు? పిల్లలకు తల్లి చేసి పెట్టకపోతే మరెవరు చేసి పెడతారు? దీన్ని గురించి నువ్వేమీ ఆలోచించకమ్మా! (శా.వ. 128)

***251 ప్రశ్న: అమ్మా! 'తేలోభేలో' బందిపోటు ఘటనలో మీరు ఆ బందిపోట్లకు కాళికాదేవి రూపంలో కనిపించారట కదా అమ్మా! అయితే నేను మాత్రం మిమ్మల్ని కాళికాదేవి రూపంలో చూడదలచుకోవట్లేదు. మిమ్మల్ని ఇలాగే చూడాలనుకుంటున్నాను. మీరు తల్లి! నేను తనయుణ్ణి!***

అమ్మ (చిరునవ్వుతో): మంచిది నాయనా! నేను కూడా బ్రతికిపోయాను! కాళికాదేవిలాగా నాలుకను బయటకు చాపుకుని నిలబడవలసిన అవసరాన్ని తప్పించావు! (శా.వ. 129)

***252 ప్రశ్న: అమ్మా! భక్తుల పాపాలను స్వీకరించడం వల్లనే మీకు ఈ అనారోగ్యం వచ్చిందని విన్నాను. అమ్మా! నా కోసం మీరు దేనినీ అనుభవించకండి. నా కర్మను నేనే అనుభవించేలా ఆశీర్వదించండి. ఇదే నా హృదయపూర్వక ప్రార్థన.***

అమ్మ: అదేమిటి నాయనా! అలా అంటావు. అసలు అవేమి మాటలు? మీరంతా బాగుండాలి. అదే నాకు కావాలి. అందుకోసం మీ కర్మఫలాన్ని నేనే అనుభవిస్తాను. ఏమీ ఫరవాలేదు. నేను అమ్మను కదా! (శా.వ. 166)

***253 ప్రశ్న: అమ్మా! ఒకవేళ ఇప్పుడు మీ అమ్మగారు బ్రతికి ఉంటే ఎంత ఆందోళన చెందేవారో కదా! ప్రస్తుతం ఎందరో పిల్లలు 'అమ్మా! అమ్మా!' అంటూ మీ వద్దకు వచ్చి మిమ్మల్ని ఎన్నో ఇబ్బందులు పెడుతున్నారు. ఎంతైనా మేము మీ కడుపున పుట్టలేదు. మేము మీ బిడ్డలము కామా?***

అమ్మ: ఏమంటున్నావమ్మా? మీరు నా కడుపున పుట్టలేదా? మరి ఎవరి కడుపున పుట్టారు? నా బిడ్డలు కారా? మరి ఎవరి పిల్లలు? ఈ లోకంలో నేను తప్ప మరొక తల్లి ఉందా ఏమిటి? స్త్రీలందరిలోనూ నేనే ఉన్నాను. తల్లులందరిలోనూ నేనే నెలకొని ఉన్నాను. ఎక్కణ్ణుంచి, ఎవరు వచ్చినా అందరూ నా బిడ్డలే. ఇది ముమ్మాటికీ నిజం. దీన్ని అర్థం చేసుకో. 'అమ్మా!' అని సంబోధిస్తూ వచ్చేవారందరూ నా బిడ్డలే! (శా.వ. 148)

***254 ప్రశ్న: అమ్మా! చిరిగిన చీరలకు అతుకులు వేసి సరిచేయడం లాంటి చిన్నచిన్న పనులలో మునిగిపోతూ కనిపిస్తున్న మిమ్మల్ని చూస్తుంటే, మీరు పూర్తిగా మాయలో మునిగిపోయినట్లు అనిపిస్తోంది!***

అమ్మ: నేను మాయలో మునిగిపోవడం కాదు నాయనా! నేనే మాయను! అర్థమయిందా? (శా.వ. 290)

***255 ప్రశ్న: పిచ్చిఅత్త (సురబాల) మిమ్మల్ని విపరీతంగా విసిగిస్తున్నారు కదా! మీకెందుకమ్మా ఈ కష్టాలు?***

అమ్మ: నాయనా! ముళ్ళతో కూడిన బిల్వదళాలతో నేను శివుణ్ణి పూజించాను కాబోలు! అందుకే నాకు ఈ ముల్లు (సురబాల) వచ్చిపడింది. నిజమేమిటో తెలుసా? ఎవరికి ఇది ఆఖరి జన్మో, వారు తమ కర్మఫలాన్నంతా ఈ జన్మలోనే

అనుభవించి పూర్తిచేయాలి. పుట్టింది మొదలు నేను ఏ పాపమూ చేసినట్లు జ్ఞాపకం లేదు. ఐదేళ్ళ ప్రాయంలోనే గురుదేవుల సాంగత్యం నాకు లభించింది. మరి నాకెందుకిన్ని కష్టాలు? ఆయన తాకితేనే అందరూ మాయను వదిలించుకోగలుగుతున్నారు. మరి నన్ను మాత్రం ఇంత మాయ ఎందుకు ఆవరించింది? నా మనస్సు రేయింబవళ్ళూ ఉన్నతస్థితిలోనే ఉండాలని కోరుతోంది. కానీ నాలోని కారుణ్యం కారణంగా వీరికోసం నా మనస్సును బలవంతంగా క్రిందికి దింపి ఉంచాను సుమా! (శా.వ. 291)

***256 ప్రశ్న: అమ్మా! నేను మీ గురించి ఎంతో విన్నాను. స్వయంగా చూశాను. కానీ మిమ్మల్ని నా సొంత తల్లిగా అవగతం చేసుకోలేక పోతున్నానెందుకని?***

అమ్మ: నాయనా! నేను నిజంగానే నీ తల్లిని కాకపోతే నీవు ఇక్కడికి ఎందుకువస్తావు? “ఎవరికి చెందవలసిన వారు వారికే చెందుతారు. ప్రతి యుగంలోనూ ఏతెంచే అవతారమూర్తుల తోపాటు వారికి చెందినవారు కూడా వస్తారు.” అలాగే నీవు కూడా వచ్చావు. అయితే నేను నీ తల్లిననే నిజాన్ని సరైన తరుణంలో గ్రహిస్తావు. అంతదాకా వేచి ఉండక తప్పదు. (శా.వ. 242)

***257 ప్రశ్న (బ్రహ్మచారి జ్ఞాన్): అమ్మా! ఈ పిల్లులు పాలు పెరుగు దొంగిలించి చాలా ఇబ్బంది పెడుతున్నాయి. వీటిని బయటికి పంపాలంటే కొట్టక తప్పడం లేదు. ఏమి చేయమంటారు?***

అమ్మ: ఇదిగో చూడు, నాయనా! దొంగిలించడం పిల్లుల నైజం. వాటిని ప్రేమగా చూడు కానీ కొట్టకు! ఎందుకంటే వాటిలో కూడా నేనే కదా ఉన్నాను. (శా.చ 309)

***258 ప్రశ్న (ఒక భక్తురాలు): మీరు ఎవరిని నిజంగా మీ సొంతంగా భావిస్తారు?***

అమ్మ: కథామృతంలో 'ఆంతరంగిక భక్తుల' గురించి నీవు చదువలేదా? గురుదేవులకు కానీ, నాకు కానీ నిజంగా సొంత మనుష్యులెవరైనా ఉంటే వారు భక్తులూ, భక్తురాండ్రే!

***ప్రశ్న (అదే భక్తురాలు): అదెలాగమ్మా?***

అమ్మ: ఏం అర్థం కాలేదా? (భక్తురాలి హృదయాన్ని చూపిస్తూ) ఇక్కడ ఉన్నది ఎవరు?

***ప్రశ్న (అదే భక్తురాలు): మీరు!***

అమ్మ: (తమ హృదయాన్ని చూపిస్తూ) ఇక్కడ ఉంటున్నది మీరు! ఇదొక రకమైన ఆకర్షణ. కానీ దీనిలో ఎటువంటి మాయా లేదు. ఈ ఆకర్షణ వలననే మీరు ఇక్కడికి పదేపదే వస్తూ ఉంటారు. అర్థమయిందా? – ప్రపంచంలో వేరెవరూ నిజంగా నీ సొంత మనుష్యులు కారని ఒక రోజు నీకు తెలిసివస్తుంది. నిజానికి ఈ ఆకర్షణ ఏమిటో నీకు అప్పుడు కానీ చక్కగా అర్థం కాదు! (శా.వ. 465)

***259 ప్రశ్న: అమ్మా! సాధనలేవీ చేయలేకుండా ఉన్నానంటే నాకోసం మీరే చేస్తానని అంటారు. మీ బిడ్డలందరి కోసం కూడా మీరే చేస్తారా? అసలు మీకెంతో మంది బిడ్డలు కదా. వారందరూ మీకు జ్ఞాపకం ఉంటారా? జ్ఞాపకం లేకపోతే వారందరి కోసం ఎలా చేస్తారు?***

అమ్మ: నాయనా! నువ్వన్నట్లు నా బిడ్డలందరి పేర్లూ నాకు జ్ఞాపకం ఉండవు. కానీ ఎవరెవరి పేర్లు జ్ఞాపకం వస్తాయో వారందరి కోసం జపం చేస్తాను. జ్ఞాపకం రానివారి కోసం

గురుదేవులతో, "భగవాన్! నాకెందరో బిడ్డలు. ఎక్కడెక్కడో ఉంటున్నారు. నాకు జ్ఞాపకం రానివారందరినీ మీరే కాపాడాలి. వారికి శ్రేయస్సును ఇవ్వాలి!" అంటూ ప్రార్థిస్తాను. (శా.వ. 482)

## *260 ప్రశ్న: అమ్మా! మీరు మాకోసం ఎంతో శ్రమపడి పనిచేస్తున్నారు. మీరు ఎప్పుడు విశ్రాంతి తీసుకుంటారు?*

అమ్మ: నాయనా! నాకు విశ్రాంతా? గురుదేవులు బహుశా ఈ శరీరాన్ని త్రోసిపుచ్చారనుకో! అప్పుడు మాత్రం నాకు విశ్రాంతి దొరుకుతుందని అనుకుంటున్నావా? నేను ఎవరెవరి బాధ్యతలు స్వీకరించానో వారిలో ఒక్కరు మిగిలివున్నా నాకు విశ్రాంతి లేదు. నేను వారితోపాటు ఉండాలి. వారందరి బాధ్యతలూ స్వీకరించాను కదా? (శా.వ. 416)

## *261 ప్రశ్న: అమ్మా! మీకెప్పుడూ మీ స్వస్వరూపం జ్ఞాపకం రాదా?*

అమ్మ: ఆ విషయం అనుక్షణం జ్ఞాపకంలో ఉండడం ఎలా సాధ్యం? అలా జరిగితే ఈ పనులన్నీ ఎలా సాగుతాయి? కానీ ఎటువంటి పనులలో మునిగివున్నా, ఎప్పుడు కోరుకుంటే అప్పుడు ఒక చిన్న ఆలోచన చాలు. మనస్సు తక్షణమే చైతన్యవంతమై పోతుంది. మహామాయ లీలావిలాసం పూర్తిగా అర్థమయిపోతుంది. (శా.వ. 334, 335)

## *262 ప్రశ్న: అమ్మా! ఇటీవల ముద్రించిన మీ ఛాయాచిత్రాన్ని చూపించాను గదా! అది సరిగానే ఉందా అమ్మా?*

అమ్మ: ఈ ఛాయాచిత్రం బాగుంది నాయనా! మునుపు కాస్త లావుగా ఉండేదాన్ని. ఆ ఛాయాచిత్రం తీసిన సమయంలో యోగీన్ తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్నాడు. అతడి గురించిన దిగులుతో చిక్కిపోయాను. యోగీన్‌కు వ్యాధి

తీవ్రమైనపుడు విలపించేదాన్ని. కాస్త నెమ్మదించినపుడు సంతోషించేదాన్ని. సారాబుల్ ఈ ఛాయాచిత్రాన్ని తీసింది. ముందు నేను ఒప్పుకోలేదు. కానీ ఆమె పట్టుబట్టి, "అమ్మా! నేను ఈ ఛాయాచిత్రాన్ని అమెరికా తీసుకుపోయి పూజించుకుంటాను!" అని పరిపరివిధాల ప్రాధేయపడింది. నాకు ఒప్పుకోక తప్పలేదు. (శా.వ. 251, 252)

***263 ప్రశ్న: మీరు జగజ్జనని, శ్రీరామకృష్ణులు భగవంతుడు అని మా విశ్వాసం. అటువంటప్పుడు ఒక సాధారణ స్త్రీలాగా ఇలా చపాతీలు చేస్తూ కూర్చున్నారేమిటి? మరి ఇదంతా మాయ అనుకుంటాను. అవునా అమ్మా?***

అమ్మ: నాయనా! మాయకాకపోతే మరేమిటి? మాయ కాకుంటే నాకెందుకీ పరిస్థితి? వైకుంఠంలో నారాయణుని ప్రక్కన మహాలక్ష్మిగా కూర్చొని ఉండేదానిని. కానీ భగవంతుడు మానవునిగా లీలలు సలపడానికి ఇష్టపడతాడు కదా! శ్రీకృష్ణుడు గోపాలుని గానూ, శ్రీరాముడు దశరథుడి కొడుకు గానూ జన్మించారు కదా! (శా.వ. 224, 225)

***264 ప్రశ్న: అమ్మా! దేవుడి దగ్గరకు, పెద్దల దగ్గరకు వెళ్ళేటప్పుడు వట్టిచేతులతో వెళ్ళకూడదని మీరే చెప్పారు కదా! అందుకనే మీ దగ్గరికి వచ్చేటప్పుడు ఏదోవొకటి తెస్తున్నాను. ఇపుడు మరి మీరెందుకు వద్దంటున్నారు?***

అమ్మ: అమ్మాయీ! నీవు అంతగా ఉన్నదానివి కాదు. రోజూ ఎందుకు ఇంత ఖర్చుపెట్టి ఇవన్నీ తెస్తున్నావు? ఒక ఉసిరి కాయ తీసుకురా, చాలు! మీ అందరి నోటి ద్వారా నేనే తింటున్నాను కదా! మీరు తింటే నేను తిన్నట్లే. గురుదేవుల సామ్రాజ్యంలోకి వచ్చి నేను ఎంతో ఆరగించాను సుమా! (శా.వ. 118)

***265 ప్రశ్న: (శ్రీరామకృష్ణులు) ఇలా ఈ శిష్యులందరికీ మితం లేకుండా 5-6 చపాతీలు పెడితే వారి ఆధ్యాత్మిక జీవితానికి అవరోధం కలుగుతుంది కదా?***

అమ్మ: నా పిల్లలేదో రెండు చపాతీలు ఎక్కువ తిన్నారని ఎందుకు కలత చెందుతారు? ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోకండి. వాళ్ళ బాగోగులు నేను చూసుకుంటాను. (శా.వ. 124)

***266 ప్రశ్న: అమ్మా! ఇక్కడ ఎంతోమంది ఉన్నారు కదా! మీరే స్వయంగా ఎందుకు వడ్డిస్తున్నారమ్మా?***

అమ్మ: నాయనా! బిడ్డలకు స్వహస్తాలతో వడ్డించి తినిపించకపోతే తల్లి మనస్సు శాంతిస్తుందా? వాళ్ళు కడుపు నిండా తింటేనే నాకు సంతోషం. అందుకని నేనే స్వయంగా వడ్డిస్తాను! (శా.వ. 210)

***267 ప్రశ్న: అమ్మా! మీ పాదాలను తాకితే నా పాపాల కారణంగా మీకు బాధ కలుగుతుందని నేను మీ పాదాలు తాకటానికి తటపటాయిస్తున్నాను.***

అమ్మ: దానిని గురించి ఆలోచించి కలత చెందకు! మేం జన్మించింది ఇందుకోసమే! ఇతరుల పాపాలను, కష్టాలనూ మేము స్వీకరించి అనుభవించకపోతే ఇక మరెవరు ఈ పనిచేయగలుగుతారు? వారందరి బాధ్యతలు ఎవరు తీసుకోగలుగుతారు? (శా.చ. 239)

***268 ప్రశ్న: అమ్మా! దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులతో పాటు ఉన్నప్పుడు మీరు అహర్నిశలూ శ్రమించేవారు కదా! అప్పుడు మీ భావం ఎలా ఉండేది?***

అమ్మ: నాయనా! ఆ రోజుల్లో నా హృదయంలో ఒక అమృత

భాండం ఉన్నట్లుగా, నిరంతరం ఆనందంలో మునిగిపోయి ఉండేదాన్ని. ఏమీ శ్రమ అనిపించేది కాదు. (శా.చ.)

***269 ప్రశ్న (అన్నపూర్ణమ్మ): అమ్మా! మీరింత అనారోగ్యంగా ఉన్నారు. మేమంతా అదృష్టవంతులం కాబట్టి మీ దర్శనం, సాహచర్యం లభించింది. మరి మీ బిడ్డలు, వారి బిడ్డలకు ఎవరమ్మా గతి?***

అమ్మ: అమ్మాయీ! ఇప్పటికే వచ్చినవారందరికీ, ఇంత వరకూ రానివారందరికీ, ఇక రాబోయే వారికీ, ఆ నా బిడ్డలందరిపైనా నా ప్రేమ ఎల్లప్పుడూ ఉంటుంది. నా శుభాశీస్సులు వారికి ఎల్లప్పుడూ ఉంటాయి. (శా.చ. 365)

***270 ప్రశ్న: అమ్మా! నేనెంతో దుర్మార్గుణ్ణి. నాకు మీ అభయం కావాలి.***

అమ్మ: నాయనా! నేను సన్మార్గులకు, దుర్మార్గులకు కూడా తల్లినే! భయపడవద్దు. నువ్వు కష్టాలలో ఉన్నప్పుడూ, నిరాశా నిస్పృహలూ, ఆవేదనా, నిన్ను క్రమ్మినప్పుడు 'నాకొక తల్లి ఉంది!' అని గుర్తుంచుకో! నీ మనస్సును కలవరపరచే ఆలోచన వచ్చినప్పుడల్లా నన్ను తలచుకో! దిగులుపడకు! (ది.జ. 119)

ఎట్టి చోటుల కేగిన ఎట్టులున్న
ఎన్ని కష్టాలు కల్గిన ఏమియైన
ఎవ్వరేమన్న మరువకు మెప్పుడైన
కలదు నాకొక తల్లియను జ్ఞాపకంబు!